మార్చి
2018

143

సంపుటి : 12 సంచిక : 11 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

కార్మికవర్గ ఆవిర్భావంపై మార్క్స్
నేటికీ మార్గదర్శకం ప్రజా కళా ఉద్యమం
సమాజాన్ని దిగజారుస్తున్న దోపిడీ వ్యవస్థ
కోరలు చాచిన రాకాసి ఆర్ఎస్ఎస్
చరిత్ర జ్ఞానంలేని మోడీ
పర్యావరణం కోసం పోరాటం
చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు
సమాచార హక్కు చట్టాన్ని దిగజారుస్తున్న ప్రభుత్వం
కాల్పులనూ, నిర్బంధాలనూ ఎదిరించి సాగిన యల్లాయపాలెం భూ పోరాటం

**స్ఫూర్తి**

## కాల్పులనూ, నిర్బంధాలనూ ఎదిరించి సాగిన

# యల్లాయపాలెం భూ పోరాటం

**వి వెంకటేశ్వర్లు**

నెల్లూరు జిల్లాలో ఉధృతంగా సాగిన భూ పోరాటంలో ఎల్లాయపాలెంలో పోలీ సులు అమానుషంగా కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో గాలింకి తిరుపాలు మరణిం చారు. అదే గ్రామానికి చెందిన రమణమ్మ కు కాల్పుల్లో ఒక చేయి పోయింది. సోమ రాజుపల్లికి చెందిన తోటపల్లి నర్సయ్యకు కాల్పుల్లో ఒక చేయి పోయింది. కోవూరు తాలుకా పెనుబల్లికి చెందిన నలుగురికి యావజ్జీవ శిక్షలు, మరో ఇద్దరికి మూడేళ్ళ కఠిన కారాగార శిక్షలు విధించారు. మామిడిపూడిలో లాఠీఛార్జీ జరిగింది. స్త్రీ, పురుషులు, చంటిబిడ్డలన్న విచక్షణ లేకుండా కొట్టారు. ముదివర్తిలో ఇళ్ళలో ఉన్న వారిపైబడి అమానుషంగా లాఠీఛార్జీ చేశారు. అరెస్టులకు పాల్పడ్డారు. అప్పుడు నెల్లూరు జిల్లాలో జరిగిన ఈ భూ పోరాటా లు మరో స్వాతంత్ర్య సంగ్రామాన్ని తలపిస్తున్నాయంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మొదలు అనేక పత్రికలు కొనియాడాయి. చరిత్రలో ఇంతటి సువర్ణాధ్యాయాన్ని లిఖిం చిన ఈ పోరాటాలను అర్థం చేసుకోవా లంటే భూ సమస్య గురించి తెలుసు కోవాలి. ఆ నేపథ్యంలో ఎల్లాయపాలెం, సోమరాజుపల్లి, పెనుబల్లి గ్రామాల్లో జరి గిన పోరాటాలను చూడాలి.

భూ సంస్కరణల చట్టాన్ని 1973లో చేశారు. 1975లో అమల్లోకి తెచ్చారు. దాని ప్రకారం రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల మిగులు భూమి తేలవచ్చునని ప్రకటించిన ప్రభుత్వం 1979 నాటికి 12 లక్షల 84 వేల ఎకరాలే మిగులు భూము లని తేల్చింది. చివరకు 3 లక్షలా 21 వేల ఎకరాలను స్వాధీనం చేసుకుంది. అందులో 2 లక్షలా 18 వేల ఎకరాలను పేదలకు పంచింది. ఇలా పంపిణీ అయిన దానిలో 18 వేల ఎకరాలు మాత్రమే మాగాణి భూమి ఉంది. భూ సంస్కరణలు ఎంతటి బూటకపు సంస్కరణలుగా అమలు జరిగాయో పై లెక్కలే తేల్చి చెప్పాయి.



ఎల్లాయపాలెం భూ పోరాట అమరుడు తిరుపాలు

నెల్లూరు జిల్లాలో భూ సమస్యను అర్థం చేసుకోవడానికి వరకవిపూడికి చెందిన యానాటివారి వంశం గురించి చెప్పు కోవాలి. వీరికి నాలుగువేల ఎకరాల భూమి ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. వీరి మిగులు భూముల గురించి సిపిఐ (ఎం) నాయకులు వాకబు చేస్తున్నారని ఆ భూ యజమాని విన్నాడు. ఈ కబురు విని ఆయన ప్రతి సవాళ్ళకు దిగారు. తనకు చెందిన వెయ్యి ఎకరాలు బంగాళా ఖాతంలో కలిసిందనీ వెళ్ళి దానినీ సర్వే చేసి బయటకు తీయమంటూ హేళనకు దిగాడు. నెల్లూరు భూస్వాముల మనస్తత్వా నికి దో మచ్చు తునక. ఇన్ని వేల ఎకరాల భూమి ఈయనకు ధారాదత్తం కావడం వెనుక ఓ కథ ఉంది. యానాటి రామ చంద్రారెడ్డికి వెయ్యావుల రామచంద్రారెడ్డి అని పేరు. స్వాతంత్ర్యానికి ముందు సర్కారు జిల్లాలతో కూడిన ఉమ్మడి మద్రాసు రాష్ట్ర గవర్నరు వరకవి పూడి మీదుగా కారులో ప్రయాణిస్తున్నారు. ఆయన కారుకు ఓ ఆవుల మంద అడ్డం వచ్చింది. అవి యానాటి వారి ఆవులు. ఆ వెయ్యి వెళ్ళేటప్పటికి గంట సమయం పట్టింది. ఆ పశు సంపదను చూసి ఆయన ముచ్చట పడ్డారు. యానాటి వారి గురించి తెలుసు కుని వారి ఇంటికి వెళ్లారు. వారి ఆతిథ్యం స్వీకరించి, వారి పశుపోషణా తీరును కొని యాడి మద్రాసు వెళ్ళారు. వెంటనే ఆవుల మందకు బీడుగా చూపుతూ 4000 ఎక రాల భూమిపై వారికి పట్టా హక్కులిచ్చారు.

1979 నవంబరు 23న 'ప్రజాశక్తి' వార పత్రికలో ప్రచురితమైన దిగువ వార్త కూడా నెల్లూరు జిల్లా భూ సమస్యకు సంబంధించిన మరో కోణాన్ని తెలియ జేస్తుంది. 'నెల్లూరు జిల్లా మామిడిపూడిలో దళితుల నోరుగొట్టి చట్ట విరుద్ధంగా భూ స్వాములకిచ్చిన 145 ఎకరాల ప్రభుత్వ భూ పట్టాలను రద్దు చేసి వాటిని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జక్కా వెంకయ్య, చిట్టేటి రమణారెడ్డి, టిపి భానురాజు, వి. మాల కొండారెడ్డి, టి.రమణయ్య, ఆ గ్రామ నాయకులు బల్లెం వెంకటయ్య, తాటిపర్తి గోవిందయ్యా రెవెన్యూ మంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డికి మెమోరాండం ఇచ్చారు. (ఆ మెమోరాండంలో భూ సమస్యను తెలిపే వివరాలిలా ఉన్నాయి). ఈ గ్రామం 1959 జూలై 1న రైత్వారీ గ్రామ మైంది. అప్పటికి ఆ గ్రామంలో సర్వే నెం: సి31లో 376 ఎకరాల 76 సెంట్ల పచ్చిక బీడు భూమి ఉంది. దీన్ని కూడా సెక్షన్ 15(1) కింద తమకు పట్టాలివ్వాలంటూ కొందరు భూస్వాములు అసిస్టెంటు సెటిల్‌మెంట్ ఆఫీసరుకు దరఖాస్తులు పెట్టుకున్నారు. అది సాగు చేయడం లేదని పచ్చిక బీడు అనే పేరుతో సెటిల్‌మెంటు అధికారి ఇవ్వలేదు. ఆ తరువాత హై కోర్టులో రిట్ వేశారు. 1967లో కోర్టు దీన్ని కొట్టేసింది. హై కోర్టులో రిట్ పెండింగ్‌లో ఉండగానే రెవెన్యూ బోర్డు వారు 54 ఎకరాలా 76 సెంట్ల భూమిని అల్లూరు ఆది శేషారెడ్డి భార్యకు సెక్షన్ 11(సి) కింద పట్టా ఇచ్చారు. మరో 90 ఎకరాలను ఇలాగే మరి కొందరికి పట్టా ఇచ్చారు. వీరంతా సీలింగ్‌ను మించిన భూమి ఉన్న భూస్వాములే. ఈ పట్టాలను రద్దు చేసి తక్షణం పేదలకు ఇవ్వాలి" ఇది వ్యవసాయ కార్మిక సంఘం మెమోరాండంలోని సారాంశం. ఇలా గ్రామగ్రామాన వ్యవసాయ కార్మిక సంఘం భూ స్వాముల ఆధీనంలోని భూ ముల పుట్టు పూర్వోత్తరాలను వెలికి తీసిసర్వే నెంబర్లతో సహ బయటపెట్టింది. ఈ శక్తి ఈ సంఘానికెలా వచ్చిం దో తర్వాత చర్చిద్దాం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...

1. కాల్పులనూ, నిర్బంధాలనూ ఎదిరించి సాగిన యల్లాయపాలెం భూ పోరాటం
వి. వెంకటేశ్వర్లు......... 2

2. కార్మికవర్గ ఆవిర్భావంపై మార్క్స్
ఆర్. రామ్‌కుమార్ ...... 4

3. నేటికీ మార్గదర్శకం ప్రజా కళా ఉద్యమం
తెలకపల్లి రవి............ 7

4. సమాజాన్ని దిగజారుస్తున్న దోపిడీ వ్యవస్థ
ఎ కోటిరెడ్డి.............. 10

5. కోరలు చాచిన రాకాసి ఆర్ఎస్ఎస్
గుల్ల తిరుపతిరావు...... 15

6. చరిత్ర జ్ఞానంలేని మోడీ
సుధీంద్ర కులకర్ణి...... 21

7. పర్యావరణం కోసం పోరాటం
జాన్ బెల్లమి ఫాస్టర్ .... 24

8. చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు
జియా ఉస్ సలామ్ .... 28

9. సమాచార హక్కు చట్టాన్ని దిగజారుస్తున్న ప్రభుత్వం
అక్షయ్ దేశ్‌మనె ...... 31



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటోరియల్ 9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# క్రోనీ క్యాపిటలిజం

పెట్టిబడిదారుల ప్రాపకంతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వంలో ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ మన దేశంలో ఎంతగా కోరలు చాచిందో ఇటీవల బ్యాంకు కుంభకోణాలను పరిశీలిస్తే అర్ధమవుతుంది. మద్యం వ్యాపారి విజయ్ మాల్యా స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియాలో 9 వేల కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని ఎగ్గొట్టి ఎంచక్కా ఇంగ్లండ్ పారిపోయిన వైనం మరువక ముందే పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ. 12 వేల కోట్లకు పైగా ఎగనామం పెట్టి వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ విదేశాలకు పారిపోయాడు. ఈ కుంభకోణం పై చర్చ సాగుతుండగానే పెన్నుల వ్యాపారి విక్రమ్ కొఠారి, పంచదార వ్యాపారి గుర్మిత్ సింగ్ మన్ బ్యాంకులకు వేల కోట్లు ఎగనామం పెట్టారని వార్తలొచ్చాయి. సరికొత్తగా ఆర్‌పి ఇన్ఫో సిస్టమ్స్ సంస్థ ఏకంగా 10 బ్యాంకులకు 500 కోట్లు, శ్రీలక్ష్మీ కొటిన్ సంస్థ 4000 కోట్లు ఎగ్గొట్టినట్లు వార్తలొచ్చాయి.

కార్పొరేట్ బడా సంస్థలు బ్యాంకులను ముంచేసేందుకు ఒక పద్ధతి అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇందులో ప్రభుత్వ భాగస్వామ్యం కూడా కనిపిస్తుంది. మొదటిగా కార్పొరేట్ సంస్థలు ఎటువంటి హామీలు లేకుండా లేక సరైన హామీలు లేకుండా బ్యాంకుల వద్ద అప్పు చేస్తాయి. రెండో దశలో అప్పులు చెల్లించకుండా ఎగనామం పెడతాయి. బ్యాంకులు వాటిని నిరర్ధక ఆస్తులుగా ప్రకటిస్తాయి. అప్పులు ఎగ్గొట్టే వారు కొందరు విదేశాలకు పారిపోతే మరికొందరు దేశంలోనే అధికార పదవుల్లో చివరికి కేంద్ర, రాష్ట్రాల మంత్రులుగా కూడా ఉంటారు. మూడో దశలో ప్రభుత్వం రంగంలోకి వస్తుంది. నిరర్ధక ఆస్తుల బారినుండి బ్యాంకులను రక్షించేందుకు బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తుంది. ఈ ఏడాది రెండున్నర లక్షల రూపాయలకు పైగా కేంద్ర ప్రభుత్వం బ్యాంకులకు కేటాయించింది. ఈ విధంగా ప్రజల సొమ్మును ప్రభుత్వం ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తోంది. ఇదీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం యొక్క నగ్న రూపం.

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలో భాగమే ఈ క్రోనీ క్యాపిటలిజం. పెట్టుబడిదారులు సాధారణ పద్ధతిలో అయితే కార్మికుల అదనపు శ్రమను దోపిడీ చేసి బలుస్తారు. దీనివల్ల కార్మికులకు కనీసం ఉపాధి అయినా లభిస్తుంది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో పడినప్పుడు సాధారణ అభివృద్ధి మార్గాలు మూసుకుపోయినప్పుడు పెట్టుబడిదారులు తమ లాభాలు మరింతగా పోగుచేసుకునేందుకు క్రోనీ క్యాపిటలిజాన్ని ఆశ్రయిస్తారు. ప్రభుత్వాలను అడ్డు పెట్టుకుని ప్రజా వనరులను - ప్రయివేటీకరణ ద్వారా, బ్యాంకుల్లోని సొమ్ము, భూములు, గనులు వగైరా నేరుగా దోచుకోవడం ద్వారా వీళ్లు పెట్టుబడి పోగేసుకుంటారు.

క్రోనీ పెట్టుబడిదారీ విధానాల వల్ల కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభాలు పెరుగుతాయి. కానీ కార్మికులకు ఉపాధి లభించదు. ప్రజల సంపద నేరుగా పెట్టుబడిదారుల పరం అవుతుంది. క్రోనీ క్యాపిటలిస్టు విధానాల అమలులో బిజెపి ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం దొందూ దొందే. కానీ బిజెపి ప్రభుత్వం ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివింది. గత ఎన్డీఎ ప్రభుత్వం (వాజ్‌పేయి) హయాంలో ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ కోసం ఏకంగా ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేశారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ప్రజల వనరులను ఆశ్రిత కార్పొరేట్‌లకు నగ్నంగా దోచిపెడుతోంది. విశేషమేమంటే ప్రభుత్వ రంగ బ్యాంకులను దోచుకుంటున్న ఈ కార్పొరేట్ శక్తులే దొంగే దొంగ దొంగ అన్నట్లు దీనికి కారణాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులమీద నెట్టేసి వాటిని ప్రయివేటీకరించడమే పరిష్కారం అని చెబుతున్నారు. ఇది ప్రభుత్వ బ్యాంకులను పూర్తిగా స్వాహా చేసే కుట్ర. ఈ కుట్రను సాగనిస్తే ప్రజల ధనానికి రక్షణ ఉండదు. అందుకని ఇది బ్యాంకుల సమస్య కాదు. ప్రజల సమస్య. బ్యాంకులను మింగేసేందుకు కార్పొరేటల్ సంస్థలు చేస్తున్న ఈ కుట్రలను తిప్పికొట్టాలి.


**చందా వివరాలు**
విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# కార్మికవర్గ ఆవిర్భావంపై మార్క్స్

ఆర్. రామ్‌కుమార్



రచయిత ప్రముఖ
ఆర్థిక విశ్లేషకులు

**కా**ర్ల్‌మార్క్స్ పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాల్లోనూ వ్యవసాయ రంగం గురించిన ప్రస్తావనలున్నాయి. పాఠకులకు వాటిని పరిచయం చేయటమే ఈ వ్యాసం వుద్దేశం. ఆ గ్రంథంలో పెట్టుబడిదారీ వుత్పత్తి విధానపు సమగ్ర స్వరూపాన్ని మార్క్స్ ఆవిష్కరించారు. ఇందులో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని రంగాలవారీ విశ్లేషణ లేదు. కేవలం వ్యవసాయ రంగానికే ఉద్దేశించిన ప్రత్యేక అధ్యాయాలు కూడా ఈ గ్రంథంలో లేవు. పెట్టుబడిదారీ వ్యవస్థపై ఇచ్చిన వివరణలో సమాజపు చారిత్రక పరిణామక్రమమే కీలక నేపథ్యమైనందున, పెట్టుబడి గురించి సాగిన ఈ అధ్యయనంలో ప్రతి అధ్యాయంలోనూ వ్యవసాయంలో వచ్చిన మార్పుల ప్రస్తావనలున్నాయి. అయినప్పటికీ పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాలలోను ప్రస్తావించబడిన వ్యవసాయ రంగంలో సంభవించిన కొన్ని మార్పులను రేఖామాత్రంగా వీక్షించేందుకు ప్రయత్నిద్దాం.

**సరుకుగా శ్రమ శక్తి...**

మార్క్స్ అభిప్రాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని అధ్యయనం చేయటానికి సరుకుల ఉత్పత్తిని అధ్యయనం చేయటమే తొలి మెట్టు. సరుకుల వుత్పత్తి క్రమం తొలిసారిగా పెట్టుబడిదారీ వ్యవస్థలోనే మనుగడలోకి రాలేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమానికి పూర్వం కూడా మానవ శ్రమతో తయారైన సరుకులు మార్కెట్లో మారకం చేయబడినాయి. కానీ మానవ శ్రమశక్తి సరుకుగా మారడం అనేది పెట్టుబడిదారీ విధానంలో మాత్రమే కనిపించే విలక్షణ స్వభావం. పెట్టుబడిదారునికి శ్రామికుడు తన శ్రమశక్తిని అమ్ముకుంటాడు. పెట్టుబడిదారుడు దానిని కొంటాడు. ఆ శ్రమశక్తితో కొత్త సరుకులు తయారు చేస్తాడు. వాటిని మార్కెట్లో అమ్మి లాభం గడిస్తాడు. ఏకకాలంలో ఉపయోగపు విలువను, ఉపయోగపు విలువల వనరులను నిబిడీకృతం చేసుకుని ఉండటంలోనే శ్రమశక్తి సరుకుగా మారటానికి దారితీసిన చారిత్రక పర్యవసానాలకు పునాదులున్నాయి. (పెట్టుబడి ప్రథమ సంపుటి, అధ్యాయం 6)

శ్రమశక్తి సరుకుగా మారటం అనేది మానవాళి చరిత్రలోనే ఒక కీలక మలుపు. పెట్టుబడిదారీ వుత్పత్తి క్రమానికి పూర్వం శ్రమశక్తిని సరుకుగా అమ్ముకొనేందుకు శ్రామికులకు స్వేచ్ఛ లేదు. వారికి ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే వారు అనేకరకాలైన బంధనాల్లో ఇమిడి పోయి ఉంటారు. బానిస, అర్థబానిస, కార్మికుల మధ్య ఉన్న వ్యత్యాసాలను మార్క్స్ స్పష్టం చేస్తాడు. తమ శక్తిని పూర్తిగా ఇతరుల ప్రయోజనాలకోసం వెచ్చించే సరుకుగా మారిన వారు బానిసలు. తమ శ్రమశక్తిలో కొంత భాగాన్ని అమ్ముకొన్న వారు అర్థ బానిసలు. వేతన కార్మికుల శ్రమశక్తి పూర్తి సరుకుగా మార్చబడింది. ఈ పరిణామక్రమాన్ని ఆదిమ సంచయంగా మార్క్స్ అభివర్ణించాడు.

పై తెలిపిన క్రమం పూర్తయ్యేందుకు పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలో ఒక కీలకమైన అటంకం ఎదురయ్యింది. శ్రమశక్తిని అమ్ముకొనే వారే ఉత్పత్తి సాధనం అయిన భూమిని కూడా కలిగి వుండేవారు. ఫలితంగా గ్రామీణ జనాభాలో అత్యధికులు తమ శ్రమశక్తితో సరుకులు తయారు చేసి అమ్ముకొనే స్థితిలో ఉండేవారు. ఈ పరిస్థితులలో యజమానులు తమ డబ్బును పెట్టుబడిగా మార్చకోలేకపోయారని మార్క్స్ అభిప్రాయ పడ్డాడు. డబ్బును పెట్టుబడిగా మార్చాలంటే డబ్బు యజమాని మార్కెట్‌లో తన శ్రమశక్తిని ఒక సరుకుగా అమ్ముకొనేందుకు సిద్ధపడిన శ్రామికుని కలుసుకోవాలి. అతని నుండి ఉత్పత్తి సాధనం అయిన భూమిని బలవతంగా వేరు చేసినప్పుడు మాత్రమే ఆతడు తన శ్రమను అమ్ముకొనేందుకు సిద్ధ పడతాడు. ఆ విధంగా ఆదిమ సంచయం పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమానికి మార్గం సుగమం చేసింది.

మార్క్స్ దృష్టిలో ఆదిమ సంచయం అంటే ఉత్పత్తి సాధనాల నుండి శ్రామికుడిని దూరం చేయడం, అతని వద్ద తన శ్రమశక్తి మినహా అమ్ముకొనేందుకు మారొకటి లేని స్థితిని కల్పిచటం. ఒక నిర్వచనంగా చూస్తే ప్రాథమిక సంచయం పెట్టుబడి సంచయానికి ముందు చోటుచేసుకునే క్రమం. ఇది ప్రత్యేకమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి చారిత్రక ప్రాతిపదికను సిద్ధం చేస్తుంది. పెట్టుబడిదారీ విధానం తనకాళ్లపై తాను నిలబడేందుకు కావల్సిన పరిస్థితులను సృష్టిస్తుంది. ఒక ముఖ్యమైన సూత్రీకరణలో మార్క్స్ ఇలా వ్రాశారు.

...పెట్టుబడి సంచయం జరగాలంటే అదనపు విలువ ఉండాలి. అదనపు విలువ వుండాలంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి ఉండాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి ఉండాలంటే దానికి ముందు సరుకుల ఉత్పత్తిదారు చేతుల్లో పెట్టుబడి, శ్రమశక్తి గణనీయంగా ఉండాలి. ఇదంతా ఒక విషవలయంగా కన్పిస్తుంది. ఆదిమ సంచయం అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ఫలితం కాదని, పెట్టుబడిదారీ సంచయానికి ముందే ఆదిమ సంచయం మనుగడలో ఉందని, పెట్టుబడిదారీ పూర్వ సమాజం దాని ప్రారంభ స్థానం అనుకుంటేనే ఈ విషవలయం నుండి మనం బయట పడగలం. (క్యాపిటల్1, పేజి 667).

**స్వేచ్ఛ ద్వంద్వ స్వభావం :**

పెట్టుబడి ఆదిమ సంచయపు ప్రధాన లక్షణం స్వేచ్ఛాయుతమైన శ్రామికులు. దీనిలో ద్వంద్వ స్వభావం ఇమిడి ఉంది. మొదటిది, పెట్టుబడిదారీ పూర్వ యుగంలో వలే ప్రస్తుత వుత్పత్తిదారులు బానిస, అర్థబానిస బంధనాల నుంచి విముక్తి కావటం. తన శ్రమశక్తికి తానే సంపూర్ణమైన అధినేతగా మారటం. (క్యాపిటల్-1-165). రెండవది, ఇప్పటి ఉత్పత్తిదారుడిని తన ఉత్పత్తి సాధనాల నుండి వేరు చేసి, ఎటువంటి రక్షణ కవచమూ లేకుండా

నిరధా రంగా మార్చటం. (క్యాపిటల్-1 -714). ఫలి తంగా గతకాలపు యజమాని, సేవకుడు సం బంధం తెగిపోయి, మార్క్స్ మాటల్లో శ్రామికుడు తన కోసం తాను పూర్తిగా వదిలేయబడినాడు.

...కనుక ఉత్పత్తిదారులను వేతన కార్మి కులుగా మార్చే ఒక చారిత్రిక స్థితి ఒకవైపున, ఫ్యూడల్ దాస్యం మరియు వృత్తి సంఘపు శృంఖాలాల నుండి వారిని విముక్తి చేయటంగా కన్పిస్తుంది. బుర్జువా చరిత్రకారులు ఈ పార్శ్వాన్ని మాత్రమే గమనించగలుగుతున్నారు. కానీ, మరొక వైపున కొత్తగా విముక్తి చెందిన వీరు, తమ ఉత్పత్తి సాధనాలనూ, పాత భూ స్వామ్య వ్యవస్థ సమకూర్చిన జీవితపు హామీలను కోల్పోయిన తర్వాత మాత్రమే తమకు తాము అమ్ముకొనేవారుగా మారారు. (క్యాపిటల్. 1.669)

> "కట్టుబానిసత్వం నుండి వేతన శ్రామికులుగా పరివర్తన చెందే క్రమంలో పెట్టుబడి దారీ వ్యవస్థ శ్రమజీవుల కిచ్చిన స్వేచ్ఛ వ్యవసాయక మార్పులపై జరుగుతున్న చర్చలకు చాలా ప్రధానమైనది. స్వేచ్ఛావాద రచయితలు శ్రామికుల ప్రతికూల స్వేచ్ఛలకే ప్రాధాన్యతనిస్తు న్నారు."

పెట్టుబడిదారీ విధానాన్ని ఆ మాటకొస్తే దాని వర్తమాన సామ్రాజ్యవాద దశను చారిత్రక నేపథ్యంలో అర్థం చేసుకోవాలంటే తొలుత ఆదిమ సంచయపు ద్వంద్వ స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. ద్వంద్వ స్వేచ్ఛలు అన్న మార్క్స్ అవగాహన ప్రాధాన్యతను అర్థం చేసుకోవటంలో మార్క్సిస్టేతర రచయితలు అన్ని చోట్లా విఫలమ య్యారు. పైగా ఈ దశను మానవాళి స్వేచ్ఛకు చిహ్నంగా బూర్జువా సామాజిక శాస్త్రవేత్తలు ప్రస్తుతిస్తున్నారు. తమ శ్రమశక్తిని అమ్ముకోవటం ద్వారా జీవనం సాగించగల వర్గం ఒకటి చారిత్రికంగా మనుగడలో లేకుంటే పెట్టుబడి దారుడు లాభాలు పోగేసుకోగల్గే స్థితికి చేరేవాడు కాదు. ఈ అంశాన్ని అర్థం చేసుకోవటంలో పై మేధావులు విఫలమయ్యారు.

వేరొక వైపున వ్యవస్థాగత మార్పుల అనంతర కాలపు రచనలు పై మార్పు యొక్క రెండవ పార్శ్వాన్ని మాత్రమే నొక్కి వక్కాణి స్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థవంత మైన చారిత్రక కోవకుచెందిన దశగా ఆ రయితలు చూడటం లేదు. పైగా పెట్టుబడిదారీ వ్యవస్థకు అస్పష్టమైన పదం "అభివృద్ధి"గా నామ కరణం చేస్తున్నారు. వేలాది సంవత్సరాలుగా భూమాతతో కలిసి ప్రకృతి ఒడిలో జీవిస్తున్న స్థానిక తెగలను మాతృగడ్డపై నుండి శాశ్వ తంగా తరిమేయటాన్ని వారు ఆధునిక యుగంలో అభివృద్ధి కోసం జరుగుతున్న హింసగా అభివర్ణిస్తున్నారు. వస్తుగతంగా వారి అభిప్రాయాలు సరికాదు. మరీ ముఖ్యంగా ఈ వర్ణనలు ఏకపక్షమైనవి. మార్క్స్ వ్రాసిన వ్యక్తిగత స్వేచ్ఛలు, వాటి సమగ్రతలపై చారిత్రక దృష్టిలేని అవగాహనలవి. పెట్టుబడిదారీ వ్యవస్థకు ముందున్న సామాజిక నిర్మాణాలను విశిష్టమైనవిగా వారు శ్లాఘిస్తున్నారు. ఈ హింసను సాంప్ర దాయ తెగలపై ప్రేమపూర్వక అణచివేతలుగా చూస్తున్న డేవిడ్ హార్వే అభివర్ణనలకు దగ్గరగా వారి అభిప్రాయాలున్నాయి.

కట్టు బానిసత్వం నుండి వేతన శ్రామి కులుగా పరివర్తన చెందే క్రమంలో పెట్టుబడి దారీ వ్యవస్థ శ్రమజీవుల కిచ్చిన స్వేచ్ఛ వ్యవసా యక మార్పులపై జరుగుతున్న చర్చలకు చాలా ప్రధానమైనది. స్వేచ్ఛావాద రచయితలు శ్రామి కుల ప్రతికూల స్వేచ్ఛలకే ప్రాధాన్యతనిస్తు న్నారు. అందుకు భిన్నంగా మార్క్సిస్టు రచయితలు 'శ్రామికుల స్వయం నిర్ణయ స్వేచ్ఛలను ఎలుగెత్తి చాటారు. విస్తృతము, సుసంపన్నమైన స్వయం నిర్ణయాధికారంతో కూడిన సానుకూల స్వేచ్ఛలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. దక్షిణ భారత దేశపు గ్రామీణప్రాంత అస్వతంత్ర శ్రామికులు, స్వేచ్ఛా జీవులుగా మారే క్రమం గురించి రామచంద్రన్ ఇలా చెబుతున్నారు:

...పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులకున్న నామమాత్రపు స్వేచ్ఛలకు, పెట్టుబడిదారీ పూర్వ సమాజంలో శ్రామికులకు నిజమైన స్వేచ్ఛలేని తనానికి వున్న తేడాలను మార్క్స్ వివరించారు. గతకాలపు వుత్పత్తి క్రమంలో లేని విధంగా, పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మిక వర్గం యజ మానులను మార్చుకునే సేచ్ఛను సంపాదిం చింది.... ఒక సమాజంలో శ్రామికులు తమ శ్రమశక్తిని అమ్ముకునే స్వాతంత్ర్యాన్ని సాధించు కోవటం వారి సానుకూల స్వేచ్ఛల విస్తృతికి చిహ్నం. అది ఆరోగ్యవంతమైన సమాజానికి కొలమానంగా నిలుస్తుంది.

క్యాపిటల్ -1 చాప్టర్ 6లో - నామ మాత్రపు స్వేచ్ఛ గురించి మార్క్స్ విస్పష్టంగా వర్ణిస్తారు. శ్రమశక్తిపైన చర్చను ముగిస్తూ చలామణి దృష్టి కోణంలో పాఠకునికి మార్గనిర్దేశం చేస్తాడు. "ఇది కనిపించని వుత్పత్తికి స్వర్గధామం. ఇక్కడ శ్రమశక్తి క్రయ, విక్రయాలు జరుగుతాయి. ఇక్కడ శ్రమశక్తి వినిమయం పూర్తవుతుంది.

...మనం ఇప్పుడు విడిచి వెళ్ళే రంగం లోపల శ్రమశక్తి క్రయ విక్రయాలు జరుగు తాయి. నిజానికి ఇది మానవుని అంతర్లీనంగా ఉండే హక్కుల స్వర్గం. అక్కడ మాత్రమే స్వేచ్ఛ, సమానత, ఆస్థి, రాజ్యమేలుతాయి. అందుకే శ్రమశక్తి యొక్క క్రయ విక్రయాదారులు ఇద్దరికీ ఈ రాజ్యంలో అడ్డేమీలేదు. వారు స్వతంత్ర వ్యక్తులుగా ఒప్పందాలు చేసుకుంటారు. వారు చేసుకునే ఒప్పందం వారి ఉమ్మడి ఇచ్ఛను చట్ట బద్ధంగా వ్యక్తీకరించే రూపం మాత్రమే. ఇందు లో ప్రతి వ్యక్తి రెండో వ్యక్తితో సరుకులకు సాదా ప్రతినిధిగా సంబంధం ఏర్పరచుకుంటారు. వారు ఒక సమవిలువను మరొక సమవిలువతో మార్పిడి చేసుకుంటారు. అందుకే అది సమానత. ప్రతి ఒక్కరూ తమ స్వంతమైన దాన్నే అమ్ము తారు. అందుకే అది ఆస్థి. ప్రతి ఒక్కరూ తమ సంగతి మాత్రమే చూసుకుంటారు. వారిని కలిపేదీ, ఒకరితో ఒకరికి సంబంధం నెరిపేదీ ఒకే శక్తి. మిగిలిన వారిని గురించి ఏ ఒక్కరూ ఆందోళనపడరు. సొంత లాభం సొంత ప్రయో జనం మాత్రమే. అందుకే అది స్వార్థం.

...ఈ రకమైన సరుకుల మారకం పూర్త య్యాక...., ఈ రంగంలో మనం నాటకీయ పాత్రలు గానే కనిపిస్తాము. అడుగో ముందు న్నాడే...అతడే డబ్బు యజమాని. ఇప్పుడు పెట్టు బడిదారుడిగా మును ముందుకి సాగిపోతున్నాడు. శ్రమశక్తి యజమాని వెనుక అతనిని అనుసరిస్తు న్నాడు. ఒకరు హుందాగా ధీమాగా వ్యవహర్తలా గానూ, మరొకరు పిరికిగా, సంకోచంగా స్వంత తోలును అమ్ముకోడానికి మార్కెట్‌కు వచ్చిన వాడిలా తోలు ఒలిపించుకో డానికి సిద్ధంగా వున్నాడు. (పెట్టుబడి 1,పేజి 172).

"ఆదిమ సంచయం" భావాన్ని పరిచయం చేశాక, 12-18వ శాతాబ్దాల మధ్యకాలంలో ఇంగ్లండులో అది ప్రవేశించిన క్రమాన్ని మార్క్స్

> **"వ్యవసాయ కార్మికవర్గం అనబడే ప్రత్యేకవర్గం అప్పటికింకా ఆవిర్భవించ లేదు. ఇతరుల భూమిలో శ్రమించగా సమకూరిన కూలి మొత్తాలను చిన్నరైతులు తమ ఆదాయా లకు తోడు చేసుకునేవారు. ఉమ్మడి భూముల్లో పశువులు పెంపకం, అటవీ వుత్ప త్తులను సేకరించటం ద్వారా వారు మరికొంత ఆదాయం పొందేవారు."**

వర్ణించారు. 19వ శతాబ్దంలో దాని పరాకాష్టగా పెట్టుబడిదారీ వుత్పత్తి విధానం ఆ దేశాన్ని ఆవహించింది. (సంపుటి 1, చాప్టర్ 27-30). అక్కడి వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానపు సంక్షిప్త చరిత్రను పెట్టుబడి గ్రంథం లోని పై అధ్యాయాలలో పొందుపరిచారు. ఈ పరిణామాన్ని మార్క్సు వ్యవసాయక పెట్టుబడిదారీ విధానంగా అభివర్ణించారు. దీన్నే వ్యవసాయక విప్లవం అని కూడా నిర్ధారిస్తాడు. పైన మార్క్సు చర్చించిన ఇంగ్లండు మార్గం, ఇతర సమాజాలలో వ్యవసాయక మార్పుల అధ్యయనానికి ప్రాథమిక సైద్ధాంతిక భూమికగా వుపకరించింది.

**ఇంగ్లండ్‌లో చిన్నరైతుల గెంటివేత**

15వ శతాబ్దపు ఆరంభంలో ఇంగ్లండ్ స్వేచ్ఛాయుతమైన రైతు యజమానులతో కూడిన సమాజం. 14వ శతాబ్దం చివరికి అక్కడ బానిసత్వం అంతమయింది. వ్యవసాయ కార్మికవర్గం అనబడే ప్రత్యేకవర్గం అప్పటికింకా ఆవిర్భవించ లేదు. ఇతరుల భూమిలో శ్రమించగా సమకూరిన కూలి మొత్తాలను చిన్న రైతులు తమ ఆదాయాలకు తోడు చేసుకునేవారు. ఉమ్మడి భూముల్లో పశువులు పెంపకం, అటవీ వుత్పత్తులను సేకరించటం ద్వారా వారు మరికొంత ఆదాయం పొందేవారు.

పైన తెల్పిన స్వేచ్ఛాయుత రైతాంగాన్ని చుట్టుముట్టి వారిని భూముల నుండి గెంటివేయటం ద్వంద స్వేచ్ఛలుగల కార్మికవర్గం రూపొందేందుకు దారితీసింది. ఈ గెంటివేతలకు పలు ప్రక్రియలు దోహదపడ్డాయి. మొదటిది, 15-16 శతాబ్దాలలో పెద్ద వ్యవసాయ క్షేత్రాల యజమానులపై ఆధారపడిన చిన్న కమతాలు సాగుదార్లను భూముల నుండి వెళ్ళగొట్టారు. రెండవది 16వ శతాబ్దంలో క్రిష్టియన్ మతంలో ప్రొటెస్టెంట్స్ సంస్కరణలు చర్చి ఎస్టేట్స్ విభజనకు ఊతమిచ్చాయి. మరొక వైపున చర్చి భూముల్లో సేద్యం చేసుకుంటున్న శ్రామికులు కేవలం రెక్కల కష్టంపై ఆధారపడే కార్మికులుగా మారారు. విస్తారమైన చర్చి భూములు కొద్దిమంది రాచరిక అనుయాయులకు, సాగుదారులను ఆ భూముల నుండి గెంటేయటంలో తోడ్పడిన పలుకుబడిగల రైతులకు ధారాదత్తం చేశారు. మూడవది, 'గెంటివేతల వుద్యమం'(15-16 శతాబ్దాలలో ఇంగ్లండులో భూ సంబంధాలలో మార్పులు తెచ్చిన వుద్యమం) ఆదిమ సంచయానికి ప్రధానంగా తోడ్పడింది. సాగుదారుల అధీనంలోని వుమ్మడి భూములను స్వాధీనం చేసుకొని, ప్రైవేటు ఆస్తిగా మార్చి వాటిని భూకబ్జాదారుల పరం చేసేందుకు 'ఆక్రమణల వుద్యమం' వుపకరించింది. 16వ శతాబ్దంలో ప్రారంభమైన ఈ వుద్యమం, 18వ శతాబ్దంలో గుణాత్మకంగా మారింది. వ్యవస్థలో వచ్చిన మార్పులు ఉమ్మడి భూముల ఆక్రమణలకు చట్టబద్ధతను కల్పించాయి. నాటి పార్లమెంట్‌లో భూయజమాన్య వర్గాల పలుకుబడికి ఈ మార్పులు అద్దం పడుతున్నాయి.

ఎరిక్స్ హాబ్స్‌బామ్ ఈ ప్రక్రియలో రెండు విభిన్న ప్రభావాలను గమనించాడు. మొదటిది గతంలో సేద్యం చేయని భూములలో నూతన పెట్టుబడులతో వ్యవసాయం అభివృద్ధి చేసేందుకుభూయజమానులను ప్రోత్సహించారు. వేరొక వైపున అప్పటి వరకు సేద్యం చేసుకుంటున్న చిన్న భూయజమానులను భూముల నుండి తరిమేశారు. వారిని అప్పుడే రూపొందుతున్న వేతన శ్రామికుల సమూహంలోకి నెట్టేశారు. వ్యవసాయ రంగంలో నిరంతరంగా జరుగుతున్నఅభివృద్ధితోపాటు, "బలప్రయోగంతో నిమిత్తం లేకుండానే భూ ఆక్రమణలు'' కొనసాగాయని మారిస్‌డాబ్ (1963) అభిప్రాయ పడుతున్నారు. ఇంకా ఇలా రాస్తున్నారు:

...బలవంతపు గెంటివేతలకు మరికొన్ని అంశాలు తోడయ్యాయి. రుణభారంతో కృంగిపోయిన చిన్న పెట్టుబడిదారులు, 18వ శతాబ్దపు ముగింపు, 19 శతాబ్దపు ఆరంభంలో సాంప్రదాయ గృహపరిశ్రమలలో వుపాధులు కోల్పోయినవారు, వ్యవసాయ రంగంలో భారీ పెట్టుబడులు కలిగిన ఆధునిక సంస్థల పోటీకి నిలబడలేక పెట్టుబడి కొరతలతో ఇబ్బందులు పడుతున్న వారు తమ కమతాలను సంపన్న రైతులకు లేదా ఆధునిక భూస్వాములకు పెద్దగా ఒత్తిడి లేకుండగానే అప్పగించ వలసి వచ్చింది. (డాబ్1963, పేజి 227).

**నిరాస్థిపరులపై భయానక చట్టాలు :**

పెరుగుతున్న నిరాస్థిపరులైన కార్మిక వర్గానికి వ్యతిరేకంగా బూర్జువాల స్పందనలు గెంటివేతల కంటే క్రూరంగా వుండేవి. శైశవదశలోని తయారీరంగపు పరిశ్రమలు 'స్వేచ్ఛాయుతులైన' కార్మికులందరినీ ఇముడ్చుకోలేదు. నూతన ప్రపంచపు క్రమశిక్షణలో ఇమడలేని వారు, కొంత పాక్షికంగా యిష్టపడి, మరికొంత ఒత్తిడికిగురైె సామూహికంగా బిచ్చగాళ్ళుగా, చిల్లర దొంగలుగా, దేశదిమ్మరులుగా మారారు. (పెట్టుబడి-3, పేజి686) పాలక వర్గాలు వారిపై నేరగాళ్ళుగా ముద్రవేసి భయానకమైన "యాంటీ లంపెన్ యాక్టు"ను సంధించాయి.

బూర్జువాలు తమ రాజ్యాధికారాన్ని వినియోగించి కార్మికుల వేతనాలు కుదించారు. పనిదినాన్ని పొడిగించారు. వారి ప్రతిఘటనలను అణచేశారు. మార్క్సు దృష్టిలో ఇదే ప్రాథమిక సంచయపు అసలైన సారాంశం. (క్యాపిటల్-1, పేజి 689) వారు సృష్టించిన చట్టాలు నైతికంగా అమానుషమైనవే కాదు. కొత్తగా ఆవిర్భవించిన ఎలాంటి ఆస్థిపాస్తులు లేని స్వేచ్ఛాయుతమైన కార్మికులను, కేవలం వాడుకుని వదిలేసే శ్రామికశక్తిగా మార్చడానికే వారు ప్రయత్నించారు. తద్వారా వేతన వ్యవస్థ క్రమశిక్షణలకు లొంగి వుండేలా వారిని నియంత్రించాలని కోరుకున్నారు. చట్ట పరిధికి మించి వేతనాలుఇవ్వకుండా యాజమాన్యాలను కట్టడి చేశారు. చట్ట పరిధికి మించి వేతనాలు అందుకునే కార్మికులను శిక్షార్హులుగా బెదిరించారు. కార్మిక సంఘాలను నిషేధించారు. ఇతర సంస్థలు కార్మికులకు అండగా నిలవటాన్ని తీవ్రమైన నేరంగా ప్రకటించారు. (క్యాపిటల్1, పేజి 690)

కాలం గడిచేకొద్దీ పెట్టుబడి కేంద్రీకరణ పెరిగేకొద్దీ, కార్మిక వర్గాన్ని క్రమశిక్షణా చట్రంలో నొక్కేసే అవసరం క్రమంగా తగ్గసాగింది. అందుకు కారణం, పెట్టుబడిదారీ వుత్పత్తి క్రమంలో నిరంతర వత్తిడి కొనసాగుతుందని, బలవంతపు చర్యలు ఆర్థిక సంబంధాలను మందగింప చేస్తాయని..... పెటుబడిదారులు శ్రామికులను లొంగదీసుకునే క్రమం పూర్తయిందని అది సహజమని మార్క్సు అభిప్రాయం.

**అనువాదం : వై. సిద్దయ్య**

# నేటికీ మార్గదర్శకం ప్రజా కళా ఉద్యమం



రచయిత
ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

**తెలకపల్లి రవి**

దాదాపు తెలంగాణ పోరాట ప్రారంభ దశలోనే 1946లో రాయల్‌నౌకాదళం తిరుగుబాటుపై కాళోజీ నారాయణరావు గొప్ప గీతం రాశారు. 1947లో మద్రాసులో అభ్యుదయ రచయితల మహాసభలు జరిగితే అప్పటికి పేరున్న ప్రతివారూ చొరబడ్డారు. అభ్యుదయం అన్న మాటకు కూడా రకరకాల నిర్వచనాలు ఇవ్వడం మొదలుపెట్టారు. అయితే ప్రజా కళారంగం అప్రతిహతంగా కొనసాగుతూ అమోఘమైన ప్రభావం చూపిస్తూనే వచ్చింది. అసలే చదువు పత్రికలు గ్రంధాలయాలు తక్కువగా వుండగా తెలుగు మరీ వెనకపట్టుగా వున్న తెలంగాణ ప్రాంతంలో పోరాట ఫలితంగా మట్టి మనుషులు మహా వీరులుగా రూపెత్తారు. అక్కడి జానపద గీతాలు, గ్రామీణ కళలు పోరాట ప్రతిధ్వనులైనాయి. తిరునగరి రామాంజనేయులు సుద్దాల హనుమంతు యాద గిరి వంటి ప్రజా కళాకారుల గీతాలు జనాన్ని వుర్రూతలూపితే దొరలకు వెర్రెత్తించాయి.

పల్లెటూరి పిలగాడా పశుల గాసే మొన గాడా, బండెనక బండి గట్టి, భారతి భారతి ఉయ్యాలో... అమరజీవివి నీవు కొమరయ్యా ఇంకా ఇలాటి అనేకానేక గీతాలు మార్మోగాయి. అల్లాకేనాం పదాలు పిట్లల దొర, లత్కోరు సాబు, పల్లెసుద్దులు, ఒగ్గు కథ వంటివాటికి ప్రజా కళాకారులు ప్రాణప్రతిష్ట చేశారు. గెరిల్లాల కాపలాతో ఈ కళారూపాలు ప్రదర్శిస్తుంటే ప్రభుత్వసైన్యం, రజాకార్లు దాడులు చేసేవారు. ఆంధ్ర ప్రాంతం నుంచి అనేకమంది రచయితలు, కవులూ ఆ పోరాటాన్ని బలపరుస్తూ శక్తివంత మైన పాటలు, గేయాలు రాశారు. ఓ నిజాము పిశాచమా కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని తీగలను తెంచి అగ్నిలో వేసినావు నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గానం చేశాడు ధాశరథి కృష్ణమాచార్యులు. ఖబర్దార్ ఖబర్దార్ నిజాంపాదుషాహే అని హెచ్చరించే వజ్రాయుధం వెలువరించారు సోమసుందర్. పొట్లపల్లి రామారావు, కాంచనపల్లి చిన వెంకట రామారావు, రావెళ్ల, గంగినేని, ఆరుద్ర, రెంటాల తెన్నేటి సూరి వంటి ఎందరో ఆ పోరాటంపై కావ్యాలు, కథలూ నవలలూ రాశారు. ఎక్కడో దూరంగా వున్న కిషన్ చందర్ కూడా జబ్ ఖేత్ జాగే అంటూ నవల రాశారు( అదే మా భూమి చిత్రానికి ఆధారం) తర్వాత కాలంలో విజయవాడ నుంచి ఎంపిగా ఎన్నికైన హరీంద్ర నాథ చటోపాధ్యాయ విలేఖించనిండు నన్ను తెలంగాణ వీరగాధ అంటూ గానం చేశారు. ఆ పోరాటాన్ని చిత్రిస్తూ సుంకర, వాసిరెడ్డి రాసిన మా భూమి నాటకం అప్పటికి ఇప్పటికి తెలుగు కళారంగ చరిత్రంలో ఒక సాటిలేని సంచలనం. విశ్వనాథ వంటి సనాతనవాది కూడా అందులోని జీవద్భాషకు జేజేలన్నారు! ఈ నాటకం ఎక్కడ వేస్తే అక్కడ యువజన సంఘం వెలసేదని చెబుతుంటారు. ఈ నాటకం పేరు ప్రఖ్యాతులు విని ప్రత్యేకంగా వేయించుకుని చూసిన కాంగ్రెస్ మంత్రులు ఆ రోజే దాన్ని నిషేదించారు. నిషేదం నుంచి బయిటకు వచ్చిన కమ్యూనిస్టులు కళారంగంలో ఎంత ప్రభావం చూపారో తెలియడానికి ఇదే నిదర్శనం.అదే కారణంతో పాలకవర్గాలు కక్షగట్టి వ్యవహరించాయి. ప్రజాశక్తి పత్రికను నిజాం నిషేదించగా ఆంధ్ర పోలీసులు ప్రజాశక్తినగర్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. తెలంగాణలో 4000 మంది యోధులను బలిగొన్నారు. ఆంధ్ర ప్రాంతంలోనూ నిర్బందంలో వందలాది మంది మరణించారు. ప్రజల్లోంచి పుట్టిన కళా సాహిత్యాలు వారికి ప్రేరణ నిచ్చి పోరాటోన్ముఖులను చేస్తే పాలకులు అణచివేతకు పాల్పడిన ఉదంతం ఇది. ఈ వీరోచిత అధ్యాయాన్ని గురించి చెప్పడానికి ఈ సమయం సరిపోదు. ప్రజాశక్తి లేని పరిస్థితుల్లో మద్రాసులో తాపీవారు నడుపుతున్న జనవాణి ఉద్యమానికి ఆధారంగా నిలిచింది. నార్లవెంకటేశ్వరరావుతో సహా అనేకమంది అక్కడ తయారైన వారే. ప్రజాశక్తిలో దీర్ఘకాలం పనిచేసిన బొమ్మారెడ్డి,ఎకెఆర్‌బి కోటేశ్వరరావు, తాపీ వారికుమారుడైన మోహన రావు కూడా పత్రికా నిర్వహణలో పాలు పంచుకున్నారు.

భయానకమైన ఆ నిర్బంధం కారణంగా కళాకారులు మద్రాసు చేరి చిత్ర పరిశ్రమలో తలదాచుకోవలసి వచ్చింది. అయితే అక్కడా వారు వూరుకోలేదు.మంచి చిత్రాలు తీశారు. తాతినేని ప్రకాశరావు, వి మధుసూదనరావు, తాపీ చాణక్య, ప్రత్యగాత్మ, వంటి దర్శకులు ,టి,చలపతిరావు, మాస్టర్ వేణు వంటి సంగీత దర్శకులు, మా గోఖలే వంటి కళాదర్శకులూ, నిర్మాతల కారణంగా నిరుపేదలు, పల్లెటూరు, కాడెద్దులు ఎకరం నేల, తర్వాత కాలంలో డా. రాజారావు పుట్టిల్లు,రోజులు మారాయి, నమ్మిన బంటు వంటి చిత్రాలు వచ్చాయి. జి.వరలక్ష్మి, జమున, సావిత్రి వంటి నటీమణులు మిక్కిలినేని, నాగభూషణం, గుమ్మడి పెరుమాళ్లు, వల్లం నరసింహారావు, కాకరాల, రాజబాబు వంటి నటులు ఈ ప్రభావంతో వెల్లిన వారే. కాట్రగడ్డ సోదరుల నవయుగ పిలింస్ ఆలంబనగానే హైదరాబాదులో సారథీ స్టుడియో ఏర్పడి తెలుగు చిత్రనిర్మాణాన్ని తరలించడానికి నాందిపలికింది. మరో వైపున ప్రచురణ రంగంలోనూ ప్రజాశక్తి ప్రచురణాలయం కొత్త కొత్త కథా సంపుటాలూ, చారిత్రిక సైద్ధాంతిక గ్రంధాల ముద్రణ మొదలు పెట్టింది

దైనందిన జీవితంలోనూ ముగ్గులు, అలంకారాల వంటి వాటిలో కూడా సుత్తి కొడవలి లేదా శ్రమజీవుల చిహ్నాలు ప్రత్యక్షమైనాయి. పల్లెల్లో కుర్రాళ్లు పేకాటలు, జూదాల నుంచి బయిటపడి ఆరోగ్యకరమైన అలవాట్లు, ఆటపాటలు నేర్చుకోవడం మొదలుపెట్టారు. వీరు పాత పెత్తనాలను ధిక్కరించడం చూసి మొదట

**"1951లో తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ప్రచారంలోనూ ప్రజా కళాకారులు గొప్ప పాత్ర పోషించారు. నిర్బంధంతో కమ్యూనిస్టులను అణచి వేశామని సంబరపడిన పాలకులే ఫలితాలు చూసి కంగు తిన్నారు. ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలలోనూ కమ్యూనిస్టులు ప్రథమ శక్తిగా వచ్చారు."**


ఆరుద్ర


వి. మధుసూదనరావు


దాశరథి రంగాచార్య


నాగభూషణం

కంగారు పడిన వారి పెద్దలే తర్వాత ఆరోగ్య కరమైన వాతావరణానికి ముచ్చటపడ్డారు. ఆరోగ్యం, పరిశుభ్రత నేర్చుకున్న మహిళలు కుటుంబాలను కూడా దిద్దుకోవడం ప్రారంభించారు. చాలా మంది పాడటం రాయటం చదవడం నేర్చుకున్నారు. తిరణాలలు, జాతరల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు సర్వసాధారణంగా మారాయి. ఇలా మొత్తంపైన గ్రామీణ సాంస్కృతిక దృశ్యం మారింది. దీనికి వ్యవసాయ కార్మిక పోరాటాలు, కార్మికుల సమ్మెల వంటివి కలిపి చూస్తే సమాజంలో సమూలమైన కదలిక వచ్చిన తీరు తెలుస్తుంది. కర్మాగారమూ కళాయతనమూ, కార్యాల యమూ కారాగృహముల దేవుని గుడిలో బడిలో మడిలో ప్రాణము మోగే ప్రతి స్థలములో నీ హృదయములో నా హృదయములో గంటలు గంటలు గంటలు అంటూ అప్పటి వాతావరణాన్ని ప్రతిధ్వనించారు. పుడమితల్లికి పురిటి నొప్పులు కొత్తసృష్టిని స్ఫురింపించాయి అంటూ కొత్త ప్రపంచమే ఏర్పడుతున్నట్టు చిత్రించారు. ఈ కళావికాసం, సాహిత్య సృజన వెనక కమ్యూనిస్టుల ప్రోత్సాహం, ప్రజల ఆదరణ ప్రధానపాత్ర వహించాయి.

1951లో తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ప్రచారంలోనూ ప్రజా కళాకారులు గొప్ప పాత్ర పోషించారు. నిర్బంధంతో కమ్యూన్నిస్టులను అణచివేశామని సంబరపడిన పాలకులే ఫలితాలు చూసి కంగు తిన్నారు. ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలలోనూ కమ్యూనిస్టులు ప్రథమ శక్తిగా వచ్చారు. అయితే ఇక్కడ ఉమ్మడి మదరాసు రాష్ట్రం అక్కడ పాత హైదరాబాద్ రాష్ట్రం వున్న కారణంగా నానామాయోపాయాలతో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలిగింది. 1952 అక్టోబరు1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ సమయంలోనూ ప్రజా సోషలిస్టు పార్టీ నాయకుడుగా వున్న ప్రకాశం పంతులు కమ్యూనిస్టులతో వున్న కూటమి నుంచి వైదొలగి కాంగ్రెస్‌లో చేరడం వల్లనే మొదటి ముఖ్యమంత్రి కాగలిగారు. ఆ ప్రభుత్వం 1955లో అవిశ్వాస తీర్మానంతో పడిపోయి మధ్యంతర ఎన్నికలు వచ్చాయి.

1955 మధ్యంతర ఎన్నికలు రాజకీయాలలోనే గాక కళా సాహిత్య రంగాలలో కూడా భీకర సంగ్రామంగా మారాయి. అంతకు ముందు గొప్ప ప్రభావం చూపిన ప్రజా కళాకారులను రచయితలను తమవైపు తిప్పుకోవడానికి పాలకులు అన్ని పాచికలూ ఉపయోగించారు. అంతకు ముందు ప్రగతిశీలంగా వుండిన నార్ల వెంకటేశ్వరరావు ఆంధ్రప్రభ సంపాదకుడుగా వుండి కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఉధృతంగా సాగించాడు. నేను సంకలనం చేసిన విషపుదాడుల వికృత చరిత్ర చదివితే అప్పటి పరిస్థితి తెలుస్తుంది. దానితో పోలిస్తే మీడియా పక్షపాతం గురించి ఇప్పుడు చూస్తున్నది చాలా తక్కువ. మహాకవి శ్రీశ్రీ, సివి, నార్లచిరంజీవి వంటి ఏ కొద్దిమందో తప్ప అందరూ వ్యతిరేక ప్రచారానికి పాల్పడ్డారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక కమ్యూనిస్టు వ్యతిరేక వాహికలుగా మారాయి. అప్పుడే శ్రీశ్రీ పెట్టుబడికి కట్టుకథకు పుట్టిన విష పుత్రికలని వీటిని నిరసించారు. అమృతం కురిసినరాత్రి వంటి గొప్ప కావ్యం రాసిన దేవరకొండ బాలగంగాధర తిలక్ కూడా ఆ కాలంలో విషం కక్కే ప్రచారమే చేశారు. కమ్యూనిస్టుల పురోగమనంలో కళా సాహిత్య రంగాల పాత్ర తెలుసుగనకే పాలకవర్గాలు అంతటి పథకం వేశారన్నమాట. ఎంబి సంస్మరణ ప్రసంగంలో ప్రత్యేకంగా చెప్పుకోవవలసిందేమంటే ఆ ఎన్నికల ప్రచారంలో దారుణమైన దాడికి దుష్ప్రచారానికి గురైన వారు ఇద్దరు- ఒకరు ఎంబి మరొకరు శ్రీశ్రీ. ప్రజలను ఉర్రూతలూపే ఆయన ప్రసంగాల ధాటికి తట్టుకోలేక అనని మాటలు అన్నట్టు రాశారు. నగలతో భూస్వామ్య స్త్రీల మెడల అర్రులు అరిగిపోయాయని అంటే వారి మెడలపై నాగటి కాడి పెట్టి దున్నిస్తామని అన్నట్టు దురూహ్యమైన ఘాతుక అబద్దాలను సృష్టించి ప్రచారానికి పెట్టారని స్వయంగా ఆయన ఆంధ్ర ప్రత్రిక సంపాదకులకు ఖండన రాశారు గాని వారు ప్రచురించలేదు. ఇక శ్రీశ్రీ కమ్యూనిస్టుల తరపున ఎన్నికల సభలలో పాల్గొన్నారు. చల్లపల్లి సభలో ఆయనపై రాయి విసిరారు. ఉయ్యూరుకు వచ్చేసరికి మతి స్తిమి తం తప్పింది. ఆరుద్ర, వల్లం నరసింహారావు వంటివారు ఆయన వెంటవుండి చికిత్స చేయించారు. మతిస్తిమితం తప్పిందిగాని మార్క్సిస్టు భావాలు చెరిగిపోలేదు గనకే మళ్లీ కోలుకోగానే పదండి ముందుకు అంటూ బయిలు దేరారు. ఆ ఎన్నికల ప్రచారంలోనే జి.వరలక్ష్మి బృందం విజయవాడలో ప్రదర్శనలు ఇస్తుంటే రాళ్లురువ్వి చెదరగొట్టారు. ఈ దాడులూ దుష్ప్రచారాలతో కమ్యూనిస్టు వ్యతిరేకులందరూ కట్టగట్టుకున్న కారణంగా 1955 ఎన్నికల్లో వారు అధికారంలోకి రాలేకపోయినా 33 శాతం ఓట్లు పొందగలిగారంటే ప్రజల్లో ఎంతగా చొచ్చుకుపోయారో, అందుకు ప్రజా కళలు సాహిత్యం ఎంతగా దోహదం చేశాయో తెలుస్తుంది. ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఓడిపోయిన ఏడాదే

అభ్యుదయ భావాలతో పల్లెపట్టున యువజన, వ్యవసాయ కార్మిక సంఘాలు భూస్వాములపై పోరాడటం ఇతివృత్తంగా అక్కినేని నాగేశ్వర రావు జానకి తదితరులు నటించిన రోజులు మారాయి చిత్రం మహత్తర విజయం సాధించింది. ఆ చిత్రం మొత్తం ప్రజా కళాకారులు తీసిందే. దర్శకుడు చాణక్య, రచయిత కొండేపూడి లక్ష్మీనారాయణ, ఏరువాక సాగారోరన్నో చిన్నన్నా అంటూ వుర్రూతలూపిన సంగీత దర్శకుడు మాస్టర్ వేణు పాట ఇప్పటికి మార్మోగుతూనే వుంటుంది. ఎన్టీఆర్ సావిత్రి నటించిన పల్లె టూరు చిత్రం కూడా ప్రజాకళాకారులు సృష్టించిందే. దాంట్లోనే చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా, ఆంధ్రుడా లేవరా వంటి పాటలతో పాటు శ్రీశ్రీ మహాప్రస్థానం దృశ్యరూపం చూస్తాం.

> **❝ అభ్యుదయ రచయితల సంఘం తర్వాత స్తబ్దతకు గురై కోలుకున్నా విప్లవ రచయితల సంఘం ఏర్పడినా జన సాహితి సాహితీ స్రవంతి వంటి సంస్థలు పనిచేస్తున్నా ప్రజా నాట్యమండలి, జన నాట్యమండలి వంటివి ఉద్భవించినా ప్రజా కళల వరవడిని కొనసాగిస్తున్నాయి. నాటి నాజర్ నుంచి గద్దర్ వరకూ సుద్దాల నుంచి గోరటి వెంకన్న వరకూ అందరూ ఆ పునాదులపై పెరిగిన వారే. ❞**


జి. వరలక్ష్మి


జమున


సావిత్రి


మిక్కిలినేని

తర్వాత చాలా పరిణామాలు, ప్రతిబంధకాలు, ఆటుపోట్లు ఎదర్కోవలసి వచ్చింది. కాని ఏది ఎలాగైనా ప్రజా సాహిత్య సృష్టిలోనూ, కళా వెల్లువలోనూ కమ్యూనిస్టుల పాత్ర ఎవరూ కాదనలేనంతగా పెనవేసుకుపోయింది. (సుందరయ్య ,మద్దుకూరి చంద్రం వంటివారు స్వయంగా సాహిత్య విమర్శలు రాశారు. ఏది ఎలా వుండాలోచర్చించారు. కొంతమంది ఆరోపిస్తున్నట్టు వారెన్నడూ సాహిత్యకారులను శాసించేందుకు ప్రయత్నించలేదు. ఆ రంగంలో పనిచేసే కార్యకర్తలతో చర్చకోసం రాశారు.) కట్టమంచి రామలింగారెడ్డి మొదటిగా నవీన సాహిత్య విమర్శ ప్రారంభించినా తర్వాత దాన్ని కొనసాగించి, మరింత అర్ధవంతంగా ముందుకు నడిపింది ప్రగతిశీల రచయితలే. అంతర్జాతీయంగా, జాతీయంగా మాత్రమే గాక తెలుగు నాట కూడా ప్రసిద్ధ కళా సాహిత్య కారులలో అత్యధిక భాగం ప్రగతిశీల వాదులు కావడం యాదృచ్ఛికం కాదు. అభ్యుదయ రచయితల సంఘం తర్వాత స్తబ్దతకు గురై కోలుకున్నా విప్లవ రచయితల సంఘం ఏర్పడినా జన సాహితి సాహితీ స్రవంతి వంటి సంస్థలు పనిచేస్తున్నా ప్రజా నాట్యమండలి, జన నాట్యమండలి వంటివి ఉద్భవించినా ప్రజా కళల వరవడిని కొనసాగిస్తున్నాయి. నాటి నాజర్ నుంచి గద్దర్ వరకూ సుద్దాల నుంచి గోరటి వెంకన్న వరకూ అందరూ ఆ పునాదులపై పెరిగిన వారే. దళిత వాదులైనా స్త్రీ వాదులైనా సామాజిక న్యాయం, ఆర్థిక సమత, స్వేచ్ఛా స్వాతంత్రాలు కోరే మరెవరైనా ఇటువైపున వున్నట్టే లెక్క. వ్యక్తిగతంగా కొందరు కొన్ని పొరబాట్లు చేసినా పాలకపక్షం వైపు వెళ్లినా ప్రజా కళల వరవడి మాత్రం కొనసాగుతూనే వచ్చింది. అయితే రాజకీయ, సామాజిక రంగాలలో వచ్చిన మార్పుల ప్రభావం ఈ రంగంపైనా పడటం సహజం. పైగా కవులూ కళాకారులను లోబర్చుకోవడానికి పాలకులు మరింత ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. జనకవనం, సాహిత్యశాల వంటివి పెట్టిన వరవడికి భిన్నంగా ఇప్పుడు ప్రభుత్వ సంస్థలు కార్పొరేట్ స్పాన్సరర్లు అనుకూల రచనలు తెప్పించుకోవడానికి బాహాటంగానే ప్రయత్నిస్తున్నారు. మీడియాలోనూ పెద్ద భాగం అదే పనిలో వుంది. లెనిన్ ఎప్పుడో అన్నట్టు సైద్ధాంతిక రంగంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కూడా భీకర పోరాటమే జరుగుతున్నది. అదే సమయంలో అవార్డువాపసీ వంటి ఉద్యమాలూ వచ్చాయి.

ఇప్పుడు ఒక వైపున మతతత్వం, మరో వైపున మార్కెట్ తత్వం కళారంగానికి రాహు కేతువుల్లా దాపురించాయి. తెలుగు జాతి ఎన్నడో తిరస్కరించిన మితవాద, మతవాద ధోరణులు జాతీయ స్థాయిలో అసహన, అమానుషాలు వెన్నాడుతున్నాయి. సాంకేతిక రంగంలో లభించిన గొప్ప అవకాశాలను దుర్వినియోగ పరుస్తున్నాయి. అయితే సోషల్ మీడియా నుంచి అరచేతిలోని సెల్‌ఫోన్ కెమెరాల వరకూ, కీబోర్డుల నుంచి వర్చ్యువల్ స్టుడియోల వరకూ వినూత్నమైన అవకాశాలను కూడా కలిగిస్తున్నాయి. పుస్తకాలు చదివేవారు తగ్గుతున్నారని ఒక వైపున అంటుంటే మరోవైపున ఫేస్‌బుక్‌లో పుంఖానుపుంఖంగా కవులు పుట్టుకొస్తున్నారు. ఇంటర్‌నెట్ ఒక విధంగా విజ్ఞాన సర్వస్వంగా వుంటూనే మరోవైపున వలగా మారుతున్నది. ఇలాటి తరుణంలో ప్రజాకళాకారులు, సాహిత్య కారులు వాస్తవిక దృక్పథంతోనూ, ఆధునిక కోణంలోనూ తమ కృషికి పదును పెట్టుకోవాలి. నిపుణత పెంచుకోవాలి. యువతను, బాల బాలికలను ఆకర్షించే ఆధునిక ప్రక్రియలపైన, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక అవగాహనపైన దృష్టి పెట్టాలి. వందేళ్ల కిందట అంత అననుకూలమైన చాందస వాతావరణాన్నే ఛేదించిన నాటి యోధుల అడుగుజాడలు మనకు మార్గదర్శకం కావాలి. తెలుగు భాషా పరిరక్షణ పేరిట సంప్రదాయాలను, అవధానాలను తలకెత్తుతున్న పాలకుల దోరణికి భిన్నంగా జానపద సమరశీల సాహిత్య కళారూపాలను మనం పెంపొందించాలి.

**'అలజడి మా జీవితం**
**ఆందోళన మా ఊపిరి**
**తిరుగుబాటు మా వేదాంతం**
**ముళ్లూరాళ్లూ అవాంతరాలెన్ని వున్నా**
**ముందు దారి మాది'**
**అన్న శ్రీశ్రీ చరణాలే స్ఫూర్తికావాలి** ❊

# సమాజాన్ని దిగజారుస్తున్న దోపిడీ వ్యవస్థ

ఎ కోటిరెడ్డి



రచయిత
ప్రజాశక్తి సహాయ సంపాదకులు

పెట్టుబడిదారీ వ్యవస్థ క్షీణస్థితికి చేరుకుంటున్న కొద్దీ ఆ సమాజంలోని అన్ని రంగాలను అట్టడుగు స్థాయికి దిగజారుస్తున్నారు. వర్గాలు, తరగతులు, ప్రాంతాలు, జాతి, మతం, ప్రాంతం, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా పెట్టుబడిదారీ విధానం సమాజాన్ని అథః పాతాళానికి దిగజారుస్తున్నది. సమాజంలో హింస, హత్యాకాండ, అవినీతి, మహిళలపై దాడులు, అత్యాచారాలు, కుటుంబంలో స్త్రీలను హింసించటం, ముక్కుపచ్చలారని బాలికలపై అత్యాచారాలు, స్కూళ్ళలోనూ రక్షణలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. బాల్య వివాహాలు కొనసాగుతున్నాయి. అంటరానితనం కొత్తరూపాల్లో ముందుకు వస్తున్నది. నిరక్షరాస్యుల సంఖ్య గణనీయంగా ఉన్నది. మద్యపానం విస్తరిస్తున్నది. రాష్ట్రంలో ప్రభుత్వమే మద్యపానాన్ని ప్రోత్సహిస్తుండటంతో ముక్కుపచ్చలారని బాలలు కూడా ఈ దురలవాటుకు బానిసలవుతున్నారు. మద్యపానం, ఇతర దురలవాట్లతో యువత నిర్వీర్యం అవుతున్నది. మోసాలు చేయటం, లంచగొండితనం, పెద్దవయసులో కన్న తల్లిదండ్రులను గాలికి వదిలివేయటం, ఆస్తులు సంపాదించటం కోసం ఎటువంటి అకృత్యాలకైనా పాల్పడటం జరుగుతున్నది. కార్పొరేట్ విద్యారంగం విస్తరణతో బాలలకు బాల్యం పెనువిపత్తుగా మారుతున్నది. ఆడుతూపాడుతూ విద్యాభ్యాసం చేయాల్సిన వయసులో మానసిక వత్తిడికి గురై అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వైద్యరంగంలో కార్పొరేట్ ఆధిపత్యం పెరగటంతో లాభాపేక్ష పెరిగి మానవ విలువలు లుప్తమౌతున్నాయి. చిన్న జబ్బుతో ఆసుపత్రికి వెళ్ళినా అనవసర పరీక్షలు, వైద్యంచేస్తూవేలరూపాయలు ఖర్చుచేయిస్తున్నారు. కాస్తోకూస్తో పేదలకు ఉచితవైద్యం అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులను కూడా ప్రభుత్వం ప్రైవేటుకు కట్టబెడుతున్నది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల సేవలో తరిస్తున్నాయి. ప్రజల సంపదను కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నాయి. మన సంస్కృతి, సామాజిక కట్టుబాట్లు, నైతిక విలువలు పతనమౌతున్నాయి. సమాజం నైతిక పతనం వైపు పరుగులు తీస్తున్నదని సామాజిక సంక్షేమం, విలువల కోసం పరితపించేవారు ఆందోళన చెందుతున్నారు. మన సమాజం ఇటువంటి దుస్థితికి గురికావటానికి వ్యక్తులే కారణమని, నూతన తరం ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నదని భావిస్తున్నారు. సమాజాన్ని అభ్యుదయ పథాన నడపాల్సిన భావితరాలు ఈ స్థితిలో ఉండగా సమాజాన్ని అభివృద్ధి చేయటం ఏ విధంగా సాధ్యం అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

### బాబాలు స్వామీజీల మోసాలు

ఒకవైపున ఇటువంటి పరిస్థితులు ఎదురౌతుండగా, మరోవైపు సమాజంలో అధ్యాత్మిక చింతన, దైవభక్తి పెరుగుతున్నాయి. దైవం పేరుతో వేలు, లక్షల మంది సమీకరించబడుతున్నారు. రాష్ట్రంలో, దేశంలో పేరుబడ్డ దేవాలయాల నుండి చిన్న దేవాలయాల వరకు ప్రజలు తండోపతండాలుగా వెళుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నెలకు 50 వేలమందికి మించని తిరుమల యాత్రికుల సంఖ్య ఇపుడు కొన్నిరోజులలో రోజుకు లక్ష దాటుతున్నది. మధ్యతరహా దేవాలయాలకు కూడా ప్రజలు రోజూ వేలసంఖ్యలో వెళుతున్నారు. చర్చిలు, మసీదులు కూడా కిక్కిరిసిపోతున్నాయి. దేవుడి పేరు చెప్పుకొని బతుకుతున్న బాబాలు, అమ్మలు, స్వామీజీలు, యోగులు, బైరాగులు, ఫాదర్లు, ముల్లాలలో అనేకమంది. ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు. భక్తిపేరుతో అమాయక ప్రజలను, మహిళలను మోసం చేస్తున్నారు. ఇటువంటి వారు మహిళలను లైంగికంగా ఎలా వేధిస్తున్నారో, భక్తులు బతికి ఉండగానే వారి అవయవాలను అమ్ముకొంటూ ఎలా వ్యాపారాలు చేస్తున్నారో డేరాసచ్ఛాసౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీం ఉదంతం తేటతెల్లం చేస్తున్నది. ఇటువంటి నకిలీ బాబాల ఉదంతాలు తరచుగా వెల్లడౌతూనే ఉన్నాయి. అయినా ప్రజలు కుప్పతెప్పలుగా ఇటువంటి బాబాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మూఢ విశ్వాసాలు, దైవ ప్రతినిధులుగా ముద్రవేసుకున్నవారు చెప్పే విషయాలను గుడ్డిగా నమ్మటం పెరుగుతున్నది. ఈ విధమైన మౌఢ్యం నిరక్షరాస్యులు, సామాజిక అవగాహన లేని పామరులకే పరిమితం కావటం లేదు. ఇటువంటి వారిలో విద్యాధికులు, డాక్టర్లు, లాయర్లు, కళాకారులు, శాస్త్రవేత్తలు కూడా గణనీయంగానే ఉంటున్నారు. ఉపగ్రహాలను తయారు చేసి ప్రయోగించే ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ ద్వారా ఉపగ్రహాలను ప్రయోగించటానికి ముందు వాటికి శాస్త్రోక్తంగా పూజలు చేస్తున్నారు. ప్రయోగం జయప్రదం కాగానే తిరుమల, ఇతర దేవాలయాలకు వెళ్ళి పూజలు చేస్తున్నారు. ఈ విధమైన మౌఢ్యాన్ని పెంపొందించటంలో రాజకీయ నాయకులు ముందెత్తున ఉంటున్నారు. బూర్జువా రాజకీయాలలో గతంలో కొద్దోగొప్పో ఉన్న నిజాయితీకి కాలం చెల్లింది. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, వ్యక్తిగత లాభాల కోసం అర్రులు చాచేవారు బూర్జువా రాజకీయ పార్టీలలో నాయకత్వ స్థానాలకు చేరారు. తమకు లాభాలస్తాయనుకుంటే ఎంతకైనా దిగజారటానికి వీరు సిద్ధం అవుతున్నారు. గతంలో ఎక్కువ మంది నాయకులు, ముఖ్యంగా ప్రధాని, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, తదితరులు లౌకిక విలువలకు కట్టుబడి ఉండేవారు. ఇపుడు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం లౌకికవాదానికి ఏ విధంగా పాతర వేస్తున్నారో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవహారశైలి స్పష్టం చేస్తున్నది. గతంలో బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు, ఇతర సందర్భాలలో ప్రజలకు చేసిన కొన్ని వాగ్దానాలనైనా నెరవేర్చటానికి ప్రయత్నం చేసేవారు. ఇపుడు ఎన్నికలలో గెలవటం కోసమే వాగ్దానాలు చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత తాము

చేసిన వాగ్దానాలను మరిచిపోతున్నారు. అధికారంలో ఉన్నవారు, ప్రతిపక్షంలో ఉండి అధికారంలోకి రావటానికి సన్నద్ధమౌతున్న వారు గుళ్ళూగోపురాలు, చర్చిలు, మసీదుల చుట్టూ తిరగటం కార్యక్రమంగా పెట్టుకుంటున్నారు. పార్లమెంటు, అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికలలో బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు వ్యవహరించే తీరు చూస్తే ఈ విషయం స్పష్టం అవుతున్నది. గుజరాత్ ఎన్నికలలో ప్రధాని నరేంద్రమోడి, ప్రతిపక్షనేత రాహుల్ గాంధి పోటీలు పడి హిందూ దేవాలయాలను సందర్శించటాన్ని చూశాం. కేంద్రంలో ఏ పార్టి అధికారంలో ఉన్నా ప్రధాని, రాష్ట్రపతి దేవాలయాలను దర్శించటం, బాబాల చుట్టూ తిరగటం అలిఖిత నిబంధనగా మారింది. కేంద్ర మంత్రులు, యంపిలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, యంయల్ఎలు దేవాలయాలు, మసీదులు, చర్చీలకు తిరగటం పెరిగింది. ఈ పార్టీలలోని నాయకులు అనేక మంది వివిధ సందర్భాలలో యజ్ఞయాగాదులు కూడా నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఇటువంటి వాటిని ప్రోత్సహించటంలో ముందెత్తున ఉంటున్నది. గోదావరి, కృష్ణా పుష్కరాలలో రాష్ట్రంలోని ప్రజలందరూ పాల్గొనాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. వివిధ సందర్భాలలో ముఖ్యమంత్రి, మంత్రులు ప్రముఖ దేవాలయాలను దర్శిస్తున్నారు. వైదిక సాంప్రదాయాలను అమలు చేయాలని దేవాదాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రతిపక్షనాయకుడు వైయస్ జగన్ పాదయాత్ర ప్రారంభించటానికి ముందు తిరుమలను సందర్శించాడు. ప్రజలకు ఆదర్శంగా ఉంటూ అభ్యుదయ విలువలను పెంపొందించాల్సిన బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు ప్రజలలో తర్కబద్ధమైన ఆలోచనలను అంతం చేయటానికి, మౌఢ్యాన్ని పెంచటానికి ఒక పథకం ప్రకారం పనిచేస్తున్నారు. ఒకవైపున శాస్త్ర విజ్ఞానం అత్యున్నత శిఖరాలకు చేరుకుంటున్నది. మరోవైపు సమాజాన్ని ముందుకునడిపించాల్సిన నాయకులు, మేధావులు, శాస్త్రవేత్తలు, ఉన్నత స్థానాలలో ఉన్నవారు సమాజాన్ని వెనక్కునడిపే ప్రయత్నం చేస్తున్నారు. సమాజ పురోగతికి మార్గనిర్దేశం చేయవలసిన రాజకీయ నాయకులు, శాస్త్రవిజ్ఞాన ఫలితాలను వినియోగించుకుంటూ కోట్లాది రూపాయల లాభాలను సంపాదిస్తున్న పారిశ్రామికవేత్తలు ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు?

“మన రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఇటువంటి వాటిని ప్రోత్సహించటంలో ముందెత్తున ఉంటున్నది. గోదావరి, కృష్ణా పుష్కరాలలో రాష్ట్రంలోని ప్రజలందరూ పాల్గొనాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. వివిధ సందర్భాలలో ముఖ్యమంత్రి, మంత్రులు ప్రముఖ దేవాలయాలను దర్శిస్తున్నారు. వైదిక సాంప్రదాయాలను అమలు చేయాలని దేవాదాయశాఖ ఆదేశాలు జారీ చేసింది.”




ఆంధ్రప్రదేశ్‌లో కిటకిటలాడుతున్న వైన్‌షాపులు

### సంక్షోభంలో సరళీకరణ విధానాలు

పెట్టుబడిదారీ విధానం, ప్రస్తుతం అమలు జరుగుతున్న సరళీకరణ ఆర్థిక విధానాలు ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతాయి. పెట్టుబడిదారీ విధానం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థపై ద్రవ్యపెట్టుబడి పూర్తి ఆధిపత్యం సంపాదించిన తర్వాత పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను అమలు జరుపుతున్న దేశాలన్నీ ఈ సంక్షోభానికి గురవుతున్నాయి.

గతంలో ఎదురైన సంక్షోభాల కన్నా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న ఈ సంక్షోభం మరింత తీవ్రమైనది. ఈ సంక్షోభం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పటికి బయటపడుతుందో, ఏ విధంగా బయటపడుతుందో పెట్టుబడిదారీ మేధావులు అంచనా వేయలేక పోతున్నారు. ఇటువంటి వారిలో అనేకమంది సంక్షోభం నుండి బయటపడటానికి ఏదైనా మార్గం దొరుకుతుందేమోనని పరిశీలన చేయటం కోసం కారల్ మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథాన్ని చదువుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం సంపాదించిన తర్వాత పెట్టుబడిదారీ సంక్షోభాల వేగం, విస్తృతి పెరిగింది. పెట్టుబడిదారీ విధానాలను అమలు జరుపుతున్న దేశాలలో ఆర్థిక సంక్షోభాలు సంభవించటం సహజమైన విషయం. పెట్టుబడిదారీ విధానం అమలవుతున్న ప్రతిదేశంలోనూ ప్రతి ఏడెనిమిది సంవత్సరాలకు ఒకసారి, కొన్ని సందర్భాలలో అంతకన్నా ముందుకూడా సంక్షోభాలు వస్తూ ఉంటాయి. ఒక సంక్షోభం నుండి బయటపడ్డామని ఊపిరి పీల్చుకుంటుండగానే మరో సంక్షోభం చుట్టుముడుతుంటుంది. వీటిలో కొన్ని సంక్షోభాలు ఆయా దేశాలకు పరిమితమౌతాయి. మరికొన్ని ప్రాంతీయంగా కొన్ని దేశాలపై ప్రభావం కలిగిస్తాయి. కొన్ని సంక్షోభాలు అన్ని దేశాలపైనా ప్రభావాన్ని కలిగిస్తాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభం ప్రపంచవ్యాపితమైనది. అగ్రరాజ్యమైన అమెరికా నుండి అతి సామాన్యమైన ఆర్థికవ్యవస్థలున్న చిన్న దేశాలు కూడా ఈ సంక్షోభం బారినపడి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. 2008లో అమెరికాలో ప్రారంభమై ప్రపంచాన్నంతా చుట్టుముట్టిన ఈ సంక్షోభం అంతరించే సూచనలు కనిపించటం లేదు. ఈ సంక్షోభం నుండి బయటపడటం కోసం ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం తమ దోపిడీని మరింత తీవ్రం చేస్తున్నది. కార్మికులు, ఉద్యోగుల వేతనాలలో కోతపెడుతున్నది. కార్మికవర్గం, శ్రామికప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తున్నది. బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు గనులు, ఖనిజాలు, అడవులు, జల

**" మనదేశంలోని బడా పెట్టుబడిదారీ వర్గం కూడా సంక్షోభం నుండి బయటపడటం కోసం దోపిడీని మరింత తీవ్రం చేస్తున్నది. పెరుగుతున్న దోపిడీ ఫలితంగా కార్మికవర్గం, సామాన్య ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. దరిద్రం, నిరుద్యోగం పెరుగుతున్నాయి. రైతులు దివాళా తీయటం, ఆత్మహత్యలు చేసుకోవటం పెరుగుతున్నది. "**


ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు

వనరులు, ప్రభుత్వ భూములు, రైతాంగ భూములు, సామాజిక వనరులు, లక్షల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను కబళిస్తున్నాయి. భూమ్యాకాశాలు, దేశాల సరిహద్దులతో నిమిత్తం లేకుండా సర్వస్వాన్ని హరిస్తున్న బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు కార్మికవర్గం, సామాన్యప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలోని బూర్జువా రాజకీయ పార్టీలు ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యానికి లంగిపోయాయి. బూర్జువా రాజకీయపార్టీలు అధికారంలో ఉన్నపుడు సరళీకరణ విధానాలను అమలు చేయటం, ప్రతిపక్షంలో ఉన్నపుడు సరళీకరణ విధానాల ఫలితాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు నటిస్తూ ప్రజలను మోసం చేయటం రివాజుగా మారింది. అందువలన ఏ దేశంలో అయినా అధికారంలో ఉన్న బూర్జువా రాజకీయ పార్టీలు ఎన్నికలలో ఓడిపోయి, ప్రతిపక్షంగా ఉన్నపార్టీలు అధికారంలోకి వచ్చినా అవే విధానాలను కొనసాగిస్తున్నాయి. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయ విధానాల కోసం ప్రతిపక్షానికి ఓట్లు వేసినా విధానాలలో ఏ విధమైన మార్పూ ఉండటం లేదు. ప్రజలకు ఏ మాత్రం ఉపశమనం లభించటం లేదు.

**దేశంలో తీవ్రమౌతున్న దోపిడి**

మనదేశంలోని బడా పెట్టుబడిదారీ వర్గం కూడా సంక్షోభం నుండి బయటపడటం కోసం దోపిడీని మరింత తీవ్రం చేస్తున్నది. పెరుగుతున్న దోపిడీ ఫలితంగా కార్మికవర్గం, సామాన్యప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. దరిద్రం, నిరుద్యోగం పెరుగుతున్నాయి. రైతులు దివాళా తీయటం, ఆత్మహత్యలు చేసుకోవటం పెరుగుతున్నది. గత రెండు దశాబ్దాలలో మూడు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయి. లెక్కలలోకి రానివి ఇంతకు రెట్టింపు ఉంటాయి. పనులు దొరకకపోవటంతో వ్యవసాయ కార్మికులు వలసలు పోవటం పెరిగింది. ప్రభుత్వం అమలు జరుపుతున్న సరళీకరణ సంస్కరణలు ప్రజల ఉపాధి, ఆదాయాలను హరిస్తున్నాయి. గత సంవత్సరం పెద్దనోట్లను రద్దు చేయటంతో కోట్లాది మంది ప్రజల ఆదాయాలకు గండి పడింది. ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. సంక్షేమమా, అభివృద్ధా అనే అర్థంలేని పోటీని ముందుకు తీసుకువచ్చి, సంక్షేమ పథకాలు అమలుజరిగితే దేశం అభివృద్ధి చెందదని ప్రచారం చేస్తూ, మిగతా వర్గాల ప్రజలలో పేద ప్రజలపై వ్యతిరేకతను పెంచుతున్నారు.

ఒకవైపున దేశసంపద అంతా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమౌతున్నది. ఒక్కశాతం మంది చేతుల్లో 58 శాతం దేశసంపద ఉన్నది. సంపద కేంద్రీకరణ వేగం పెరుగుతున్నది. ఉత్పత్తి అయిన సంపదలో 73 శాతం ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల వద్దకు చేరుతున్నదని అంతర్జాతీయ ద్రవ్యసంస్థల అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపున దరిద్రం పెరుగుతున్నది. దిగువస్థాయిలోని 50 శాతం మందివద్ద 4.1 శాతం సంపద మాత్రమే ఉన్నది. సంపద కొద్దిమంది వద్ద పోగుపడే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. నోట్లరద్దు, జియస్‌టి, ఇతర సంస్కరణలు సంపద ధనికుల వద్ద పోగుపడటం కోసం అమలు చేస్తున్న విధానాలే. గతపది సంవత్సరాల నుండి జిడిపి 7.5 శాతం నుండి 9.0 శాతం వరకు పెరిగినప్పటికీ ఆ ఫలితాలు సామాన్యప్రజలకు దక్కటం లేదు. అభివృద్ధి ఫలాలన్నింటటినీ కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు, దేశ ప్రజానీకంలో ఒక్కశాతంగా ఉన్న ధనికులే స్వంతం చేసుకుంటున్నారు. ఫలితంగా దేశంలో ఒకవైపున సంపద, మరోవైపు దరిద్రం పోగుపడుతున్నాయి. ఈ పరిణామాలు దిగువ తరగతి వర్గాలలో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఈ అసంతృప్తి ప్రభుత్వం పైకి తిరిగితే దోపిడి వర్గాలు అధికారంలో కొనసాగలేవనే విషయాన్ని పాలక వర్గాలు అర్థం చేసుకున్నాయి. అందువలన ప్రజల అసంతృప్తి తమ వర్గపాలనకు వ్యతిరేకంగా మారకుండా దారిమళ్ళించటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు.

**పాలకవర్గాల ఎత్తుగడలు**

ప్రజలలోని అసంతృప్తిని ఇతర సమస్యల పైకి మళ్ళించటం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన ప్రజలు అంతర్గతంగా తమలో తాము ఘర్షణ పడేలాచేయటం కోసం పాలకవర్గాలు వివిధరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. తాము పడుతున్న కష్టాల నుండి ఓదార్పు కోసం ప్రజలు దేవుళ్ళు, బాబాలు, స్వాముల వెంటతిరిగేలా చేయటం, మూఢ విశ్వాసాలను ప్రచారం చేయటం తదితరాలన్నీ ప్రజల అసంతృప్తిని దారి మళ్ళించటానికి పాలకవర్గాలు వేస్తున్న ఎత్తుగడలే. ప్రజలు, ముఖ్యంగా యువతను సామాజిక బాధ్యతల నుండి దారి మళ్ళించటానికి, తమ స్వార్థం మినహా మరేమీ పట్టించుకోని వారిగా మార్చటం కోసం పాలకవర్గాలు, ప్రభుత్వం పనికట్టుకొని ప్రయత్నం చేస్తున్నాయి. తమ కళ్ళముందే ప్రాణాలు పోతున్నా, అత్యాచారాలు జరుగుతున్నా, తాము ప్రయత్నిస్తే అత్యాచారాలను నిరోధించటం, ప్రాణాలను కాపాడటం చేయగలిగినా పట్టించుకోకుండా చేయటంలో పాలకులు తాత్కాలికంగా సఫలమయ్యారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీ నగరంలో యాక్సిడెంట్‌కు గురైన వ్యక్తి కొనప్రాణంతో ఉంటే జేబులో ఉన్న డబ్బు, సెల్‌ఫోన్‌లను కాజేశారు. దారిన పోయేవారు అతనిని చూసివెళ్ళటం మినహా ఆసుపత్రికి తీసుకువెళ్ళటం గురించి ఎవరూ పట్టించుకోకపోవటంతో అక్కడే చనిపోయాడు. ఇటువంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. భోపాల్ నగరంలో సివిల్స్‌కు సంసి

ర్థం అవుతున్న విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది. పోలీస్‌స్టేషన్‌కు 100 గజాల దూరంలో, జనసంచారం ఉన్న ప్రాంతంలో మూడు గంటలసేపు సామూహిక అత్యాచారానికి గురైనా ఎవరూ పట్టించుకోలేదు. పోలీసులు చూసినా తమను ఏమీచేయరని బాధిత విద్యార్థినితో దుండగులు చెప్పారంటే వారెంతధీమాగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. అందుకు తగినట్లుగానే ఆమె తండ్రితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయటానికి వెళితే హేళన చేయటం మహిళలకు ఎదురౌతున్న అవమానాల పట్ల ప్రభుత్వాల, పోలీసుల బాధ్యతా రాహిత్యాన్ని వెల్లడి చేస్తున్నది.

రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థికవిధానాలే ఇందుకు కారణం. ప్రభుత్వాలు వ్యవసాయోపకరణాల ధరలను పెంచుతున్నాయి. రైతాంగపంటలకు మద్దత్తు ధరలను నిర్ణయించటం లేదు. మార్కెట్ ధరలు మద్దత్తు ధరలకన్నా తక్కువగా ఉన్నపుడు పంటలను కొనుగోలు చేయటానికి ప్రభుత్వ సంస్థలు జోక్యం చేసుకోవటం లేదు. కౌలు రైతులకు ఎటువంటి రక్షణలు కల్పించటం లేదు. ఫలితంగా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు దివాళా తీస్తున్నారు. సరళీకరణ విధానాలలో భాగంగా అభివృద్ధి, పారిశ్రామికీకరణ పేరుతో ప్రభుత్వాలు రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నాయి. తగిన నష్టపరిహారం ఇవ్వకపోవటంతో భూములు కోల్పోయినరైతుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. వ్యవసాయ కార్మికులు, వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణప్రజల జీవితాలు దుర్భరం అవుతున్నాయి. ఈ విధంగా రాష్ట్రంలో లక్షల సంఖ్యలో, దేశంలో కోట్లసంఖ్యలో ఉపాధికోల్పోయి అల్లాడుతున్నారు.

విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీలు తాము అధికారంలోకి వస్తే అందరికీ ఉద్యోగాలిస్తామని వాగ్దానాలు చేశాయి. కొత్తఉద్యోగాలు రాకపోగా, ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా చిన్నవృత్తులు, వ్యాపారాలు దివాళా తీస్తున్నాయి. బడా పారిశ్రామిక సంస్థలు తమలాభాలు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. జిడిపి 6 శాతంకు పైగా పెరుగుతున్నప్పటికీ నూతన ఉద్యోగాల కల్పన ఒక్కశాతం కూడా జరగటం లేదని ప్రభుత్వసంస్థలు నిర్వహించిన అధ్యయనాలే స్పష్టం చేస్తున్నాయి. ఆర్థికవ్యవస్థను బహుళజాతి, కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టటాన్ని కప్పిపుచ్చుకోవటం కోసం కేంద్రం మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రచారం చేస్తున్నదని స్పష్టం అవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదేవిధంగా వ్యవహరిస్తున్నది. అధి కారంలోకి రాగానే రాష్ట్రంలోని ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తానని టిడిపి ఎన్నికలలో వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చి మూడు న్నర సంవత్సరాలు దాటిపోయినా ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేదు. ఉద్యోగాలులేని నిరుద్యోగులందరికీ నిరుద్యోగభృతిని ఇస్తామని చేసిన వాగ్దానానికీ అదేగతి పట్టింది. ఫలితంగా నిరుద్యోగులలో అసంతృప్తి పెరుగుతున్నది.

> “ విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీలు తాము అధికారంలోకి వస్తే అందరికీ ఉద్యోగాలిస్తామని వాగ్దానాలు చేశాయి. కొత్త ఉద్యోగాలు రాకపోగా, ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా చిన్నవృత్తులు, వ్యాపారాలు దివాళా తీస్తున్నాయి. ”



ముక్కుపచ్చలారని బాలలకు వివాహం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి కార్మికచట్టాలను నీరుగారుస్తున్నాయి. కార్మికులు, ఉద్యోగులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచటం లేదు. పనిగంటలను పెంచుతున్నారు. కొన్ని పరిశ్రమలలో కార్మికుల చేత రోజుకు 12 గంటలు పనిచేయిస్తున్నారు. ప్రైవేటు సంస్థలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఎటువంటి రక్షణ లేకుండాపోతున్నది. యాజమాన్యాలు ఎప్పుడుకావాలంటే అప్పుడు కార్మికులు, ఉద్యోగులను తొలగిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఈ ధోరణి పెరిగిపోతున్నది. ఫలితంగా కార్మికులు, ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తికి, భయాందోళనలకు గురవుతున్నారు.

ఈ విధంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తికి, ఆందోళనకు గురికావటం పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఈ అసంతృప్తి అంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమీకృతం అయితే పెట్టుబడిదారీ వర్గం పరిపాలన సాగించటం అసంభవం అవుతుంది. అందువలన అసంతృప్తిని దారితప్పించటానికి పెట్టుబడిదారీ వర్గం వివిధమార్గాలను అనుసరిస్తుంది. కార్మికుల మధ్య కుల, మత, ప్రాంతీయ వైరుధ్యాలను పెంచటం, స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను మరింత తీవ్రం చేయటం, ప్రజలలో మూఢ విశ్వాసాలను పెంచటం, దైవభక్తిని, సమాజంలో క్షీణ సంస్కృతిని పెంపొందించటం, తాగుడు, వ్యభిచారం తదితరాలను పెంచటం, ప్రభుత్వ యంత్రాంగం పై ప్రజలు విశ్వాసం కోల్పోయేలా చేయటం, అధికార యంత్రాంగాన్ని నిర్వీర్యం చేయటం, రాజకీయాలపై ప్రజలు విశ్వాసం కోల్పోయి నిరంకుశపాలనకు మద్దత్తిచ్చేవారిగా తయారు చేయటం తదితర విధానాలను పాలకవర్గాలు అనుసరిస్తున్నాయి. ఈ విధంగా సమాజాన్ని దిగజారిస్తేనే బూర్జువావర్గం తన అధికారాన్ని నిలబెట్టుకోగలుగుతుంది. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, బిజెపి అధికారంలో

> **"హిందువులకు ఆవు పవిత్రమైనదిగా, తల్లిగా చూయిస్తూ, ఆవును చంపేవారిగా ముస్లీంలపై ముద్ర వేస్తున్నది. ముస్లీంలపై దేషాన్ని రగిలించటం కోసం, వారిపై ఎక్కడికక్కడ దాడులు చేసే విధంగా హిందువులను రెచ్చగొట్టటానికి ఆవును సాధనంగా వినియోగించుకుంటున్నారు."**



ఆవు పేరుతో ముస్లీంలను చంపుతున్న మతోన్మాదులు

ఉన్నా బూర్జువావర్గ ప్రతినిధులుగా ఈ విధానాలను విశ్వాసంతో అమలుచేస్తున్నారు. ఈనాడు అధికారంలో ఉన్న బిజెపి మత విభజనలను తీవ్రంచేస్తూ ఈ విధానాలను మరింత శక్తివంతంగా అమలు జరుపుతున్నది. సమాజంలో అసంతృప్తి చెందిన ప్రజలను మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు, లింగం ప్రాతిపదికగా చీలుస్తున్నది.

ప్రజలను మత ప్రాతిపదికన విభజించటంలో ఆవును ప్రధాన సాధనంగా వినియోగించుకుంటున్నారు. హిందువులకు ఆవు పవిత్రమైనదిగా, తల్లిగా చూయిస్తూ, ఆవును చంపేవారిగా ముస్లీంలపై ముద్రవేస్తున్నది. ముస్లీంలపై దేషాన్ని రగిలించటం కోసం, వారిపై ఎక్కడికక్కడ దాడులు చేసే విధంగా హిందువులను రెచ్చగొట్టటానికి ఆవును సాధనంగా వినియోగించుకుంటున్నారు. ఆర్‌యస్‌యస్ తన అనుబంధ సంస్థల ద్వారా ఒక పథకం ప్రకారం ముస్లీంలపై దాడులు, హత్యలు చేయిస్తున్నది. ఆ విధంగా మతపరమైన సమీకరణకు ఆర్‌యస్‌యస్ పూనుకుంటున్నది. మతంపేరుతో ఘర్షణలు రెచ్చగొట్టటానికి, తద్వారా ప్రజల అసంతృప్తిని దారి మళ్ళించటానికి, హిందుమతంపై తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవటాకి ఆర్‌యస్‌యస్‌కు ఇది ఉపయోగపడుతుంది. మనుస్మృతి ప్రామాణికంగా హిందు సమాజాన్ని తీర్చిదిద్దాలని ఆర్‌యస్‌యస్ ప్రయత్నం చేస్తున్నది. మనుషులంతా సమానం కాదని, బ్రహ్మముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, పొట్టనుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని మనుస్మృతి చెబుతున్నది. దళితులకు మనుషులలో స్థానమే కల్పించలేదు. పుట్టుకలోనే అసమానత ఉంది కాబట్టి మనుషులందరూ సమానం కాదని ఈ సిద్ధాంతం చెబుతున్నది. భూస్వామ్య వ్యవస్థ మనుగడకు ఈ సిద్ధాంతం దోహదం చేసింది. పెట్టుబడిదారీ దోపిడీని కప్పిపెట్టటానికి, పీడితుల ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి పెట్టుబడిదారీ పాలకులకు కూడా ఈ సిద్ధాంతం ఇపుడు బాగా ఉపయోగపడుతున్నది. అందువలన దేశంలోని పెట్టుబడిదారీ వర్గం తమవర్గ ప్రయోజనాల కోసం మతతత్వం, కుల విభజనను పెంచటం కోసం బిజెపి ప్రభుత్వానికి మద్దత్తు ఇస్తున్నది.

ప్రజలు తర్కబద్ధంగా ఆలోచించటం ప్రారంభిస్తే, తమ దరిద్రానికి కారణమేమిటో తెలుసుకుంటే పెట్టుబడిదారీ విధానానికి పుట్టగతులు లేకుండా చేస్తారు. కాబట్టి ప్రజలు చైతన్యవంతం కావటం అంటే పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమ ఘడియలు సమీపించినట్టే. అందువలన తన అస్థిత్వాన్ని కాపాడుకోవటం కోసం పెట్టుబడిదారీ విధానం ప్రజలకు వాస్తవాలు తెలియకుండా మభ్యపెట్టటానికి, వారిని దారితప్పించటానికి నిరంతరం ప్రయత్నం చేస్తుంటుంది. అక్రమాలను, అన్యాయాలను బలపర్చే శక్తులకు మద్దత్తునిస్తుంది. నైతిక పతనాన్ని, విలువల హరణాన్ని బలపరుస్తుంది. ప్రోత్సహిస్తుంది. సమాజాన్ని అట్టడుస్థాయికి దిగజారుస్తుంది. అందువలన సమాజాన్ని పతనం వైపుకు నడపటం పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం. కాబట్టి పెట్టుబడిదారీ విధానం సమాజాన్ని అభ్యుదయం వైపు నడపటం కోసం కృషిచేస్తుందనేది కల్ల. అది ఆ వ్యవస్థ ప్రయోజనాలకే విరుద్ధం. మరి పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ అవలక్షణాలన్నింటినీ పెంచి పోషిస్తున్నపుడు వీటిని అరికట్టటం కోసం పనిచేసే వారి కృషికి ఫలితం ఉంటుందా? సమాజాన్ని సరైన దారికి మళ్ళించాలనే వారు ఏంచేయాలి అన్నప్రశ్న ముందుకువస్తుంది. ప్రభుత్వం ఉద్ధేశ్యపూర్వకంగా సమాజాన్ని దిగజార్చటానికి ప్రయత్నం చేస్తున్నా, సామాజిక దుర్లక్షణాలను అరికట్టటం కోసం చేసే కృషిని బట్టి కొంతమేరకు ఫలితాలు రావటానికి అవకావం ఉంది. అటువంటి వారికృషి పూర్తిగా ఫలించాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసి, దానిస్థానంలో సోషలిజాన్ని స్థాపించాలి. సోషలిజంలో దోపిడీ వర్గాలు అంతరించిపోయే క్రమం ప్రారంభమౌతుంది. ప్రభుత్వ నిర్వహణ బాధ్యతను కార్మిక వర్గం చేపడుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు భిన్నంగా మానవుల భౌతిక, నైతిక అభివృద్ధి, సామాజిక అవగాహనను పెంపొందించటం, సమగ్రాభివృద్ధి చెందే విధంగా తీర్చిదిద్దటం సోషలిస్టు వ్యవస్థ అభివృద్ధికి అవసరం అవుతాయి. కాబట్టి శాస్త్రీయంగా ఆలోచించి, అభ్యుదయ విధానాలను అమలుచేసే పౌరులుగా సోషలిజం మానవ జాతిని తీర్చిదిద్దుతుంది. అందువలన ప్రస్తుత సమాజంలో పెచ్చురిల్లుతున్న అవలక్షణాలపై ఆందోళన వ్యక్తం చేసేవారూ, సామాజిక మార్పుకోసం కృషిచేస్తున్నవారూ తమ కృషికి సోషలిజాన్ని గమ్యంగా ఎంచుకోవాలి. అపుడు మాత్రమే వారికృషికి తగిన ఫలితాలు వస్తాయి. అత్యున్నతమైన నూతన సమాజ నిర్మాణానికి అవసరమైన మార్గంలో ముందుకు సాగటం ద్వారా వారికి తమ జీవితాదర్శాన్ని సాధించటం సాధ్యమౌతుంది. ❄

# కోరలు చాచిన రాకాసి ఆర్ఎస్ఎస్



రచయిత
ప్రజాశక్తి బుక్హౌస్ సబ్ ఎడిటర్

**గుల్లా తిరుపతిరావు**

ప్రజాతంత్ర, లౌకిక భారతదేశాన్ని హిందూమతోన్మాద దేశంగా మార్చేందుకు ఆరెస్సెస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) అన్ని సాంస్కృతిక, నాగరికతా సూత్రాలను ఎంత దారుణంగా ఉల్లంఘించిందో, ఎటువంటి నియంతృత్వపోకడలను అనుసరించిందో సెల్లార్స్ ఆఫ్ ది ఇన్ఫెర్నో (రాకాసి కోరలు) పుస్తకం ద్వారా సుధీశ్ మిన్నీ బట్టబయలు చేశాడు. సంఘపరివార్ దౌర్జన్యం ఎంత భయంకరంగా ఉంటుందో తెలుసుకునేందుకు ఈ పుస్తకంలోని సంఘటనలు కొన్ని మచ్చుతునకలు మాత్రమే. కన్నూర్ జిల్లా కూతూపరంబ పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో గల అయితారాకు చెందిన మిన్నీ సుమారు సుమారు 25 ఏళ్ల పాటు ఆర్ఎస్ఎస్ ప్రచారక్గా పని చేసి అనంతర కాలంలో సిపిఐ(ఎం) అనుయాయిగా మారాడు. ఆర్ఎస్ఎస్లో తన అనుభవాలను ఈ పుస్తకంలో చూడవచ్చు. సాంస్కృతిక సంస్థగా చెప్పుకుంటున్న ఆర్ఎస్ఎస్ భయానక రూపం ఇందులో దర్శనమిస్తుంది. దేశభక్తి, క్రమశిక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ ఇలా చెబుతూ మనుగడ సాగిస్తున్న ఆ సంస్థ అరాచకాలు చెప్పేందుకు తెలుగు భాషలో పదాలు చాలవని చెప్పడం అతిశయోక్తి కాదేమో..

'నరకం వంటి ఆరెస్సెస్ కొలిమిలో నా బాల్యాన్ని, యౌవ్వనాన్ని కాల్చుకున్న ఒక సామాన్య వ్యక్తిని నేను. ఆకాశం, భూమి కలిసినట్లు కన్పించే ప్రదేశంలో సూర్యాస్తమయం సమయంలో సమ్మోహనపరిచే కాషాయ రంగుతో స్ఫూర్తిని పొందినవాడిని. ఇది ప్రతి హిందువు ఆకాంక్షను సాకారం చేస్తుందని నమ్మినవారిలో నేనూ ఒకడిని. ఆ రంగును నా హృదయంలో నింపుకున్నవాడిని. ప్రతి ఒక్కరూ తనను తాను మార్చుకోవాలి; ఆ రంగును తన జీవితంలో నింపుకోవాలి అనే బోధనలను విన్నవాడిని. దీన్ని నా 25 ఏళ్ళ ప్రస్థానంలో అనుసరించిన వాణ్ణి. నా జీవితాన్ని సంఘ్ వేదనామయ అగ్నిలో కాల్చుకున్న వాణ్ణి. ఇప్పుడు నేను భయంకర విలువల చీకటి ప్రపంచం నుంచి మంచితనపు మానవీయ ప్రపంచంలోకి తిరిగివచ్చే క్రమంలో ఉన్నాను. భయంకరమైన అనుభవాలతో కూడిన ఈ పుస్తకంలోని ప్రతి అక్షరాన్నీ ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదవాలని, ఆరెస్సెస్ డ్రాకులా కోటలోని మోసపూరిత మాయాలోకంలో పడవద్దని నేను ప్రార్థిస్తున్నాను. ఇంక ఏ తల్లీ కోల్పోయిన తన కుమారుని కోసం కన్నీరు పెట్టకూడదు. ఏ సోదరీ తన తోడబుట్టినవాని కోసం పరితపించరాదు' అంటూ సుదీశ్ మిన్నీ ఈ పుస్తకం ముందుమాటలో రాసిన వేదనపూరితమైన మాటలే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలోని కపటాన్ని తెలియజేస్తాయి. కాషాయం ముసుగులో మారణకాండను సృష్టించే గూండా మూకల మాయలో పడొద్దని ఎందుకు చెప్పారో, వారు చేసే దుర్మార్గాలు ఏవిధంగా ఉంటాయో పుస్తకం లోపల పేజీల్లో వివరించారు.

సరస్వతీ పూజలు చేయించడం, మంత్రాలు నేర్పించడం, యోగా, ప్రాణాయామం నేర్పించడం, లెక్కలు, కరాటే శిక్షణ లాంటివి నేర్పిస్తూ హిందూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తున్న ఓ చిన్న సంస్థలా కన్పించే ఆర్ఎస్ఎస్ అసలు స్వరూపం చాలా మందికి తెలియదు. దేశంలో పెద్ద ఊడలమర్రిలా పాతుకుపోయిన ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు దేశ సార్వభౌమత్వానికి, లౌకికవాదానికి పెను ప్రమాదం తెచ్చిపెట్టేవే. చంటి పిల్లవాడి నుంచి ఉన్నత స్థాయిలో ఉన్న ఐఎఎస్, ఐపిఎస్ల వరకూ ప్రతి ఒక్కరినీ పూజలు, మంత్రాలు, యోగా, కరాటే పేరిట ఆకర్షించి తమ శాఖల్లో కూర్చోబెట్టి,అతి భయంకరమైన ఫాసిస్టు సిద్ధాంతాన్ని వారి మెదళ్లలో ఎక్కించి, వారిని హిందూ ఉన్మాదిగా తీర్చిదిద్ది, దేశంలోని ముస్లిం, క్రైస్తవులపైకి రెచ్చగొట్టడమే ఆ సంస్థ పని.

ప్రతి ఒక్కరి మనసుల్లో పూర్తిగా నాటుకుపోయేంతవరకూ ఆ కట్టుకథలను నిజాలుగా చెప్పాలన్నదే వారి సిద్ధాంతం. మనిషిని మతోన్మాదిగా మార్చేందుకు ఆర్ఎస్ఎస్ అనుసరించే పద్ధతులు ఎంత నీచంగా ఉంటాయో బాలగోకులంలో మిన్నీ అనుభవాలను చూస్తే అర్థమవుతాయి. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు ఈ దేశానికి అత్యంత ప్రమాదకరమైన మనుషులని బోధనలు చేస్తారు. శాఖలకు హాజరయిన వారికి ఉన్మాదపు బోధనలు చేసి ముస్లింలు, క్రైస్తవుల్లు, కమ్యూనిస్టులపై ద్వేషాన్ని పెంపొందిస్తారు. వారిని మట్టు పెట్టడానికి ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడేలా తయారు చేస్తారు. చత్రపతి శివాజీ ముస్లిం వ్యతిరేకి అయినందువల్లే మొగలాయిలు ఆయనపై దాడులు చేసేవారని, ఇద్దరు రాజుల మధ్య జరిగే దాడులు, ప్రతి దాడులను హిందువులు, ముస్లింల మధ్య జరిగే ఘర్షణలేనని చిత్రీకరిస్తారని మిన్నీ తెలిపారు.

కబడ్డీలో "వీర మృత్యు"(వీర మరణం) అనే ఆట ఉంది. ఆటస్థలంలో ఒక అడ్డగీత గీస్తారు. దాని అవతల ఉండే ప్రాంతం ముస్లిం ఉగ్రవాదులుండేది. అవతలి వైపుకు వెళ్ళి అక్కడి నుంచి వచ్చేలోపు సాధ్యమైనంత ఎక్కువ మందిని తాకి రావాలి. ఆ వైపున ఉన్నవారికి ఎవరైనా చిక్కారంటే వారు మరణించినట్లే లెక్క. వారిని ఆటలో నుంచి పంపేస్తారు. దాని తరువాత ఆ గీతకు ఆవల ముస్లిం ఉగ్రవాదులకు బదులు క్రైస్తవులు లేదా కమ్యూనిస్టులు ఉంటారు. ఆ రకంగా ఆటను పదేపదే ఆడిస్తారు. ఈ ఆట పూర్తయిన తరువాత వారిని గుండ్రంగా కూర్చోబెట్టి బోధనలు చేస్తారు. (దీన్ని సంఘ్ పరిభాషలో మండలం అంటారు). ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులను ఎదగనిస్తే అనేక ప్రమాదాలుంటాయంటూ వారికి చెబుతారు. వీరి బోధనల ఫలితంగా ముస్లింలు, క్రైస్తవులు,

“సిపిఎం పార్టీ నుంచి తాంపురన్ ప్రాణానికి ప్రమాదం ఉందనే వాతావరణాన్ని ఆర్ఎపెస్ ప్రతినిధులు సృష్టిస్తారు. తాంపురన్ ఇంటిపై తామే బాంబులతో దాడి చేసి అది కమ్యూనిస్టులే చేయించారని అబద్ధపు ప్రచారం చేస్తారు. తామే తాంపురన్ రాజుకు రక్షణగా నిలబడు తున్నట్లు ప్రచారం చేస్తారు.”



కవాతు చేస్తున్న ఆర్ఎస్ఎస్ దళాలు

కమ్యూనిస్టులు దేశానికి శత్రువులని, వారిని సర్వ నాశనం చేయాలనే భావన వారికి కలుగుతుంది. అటువంటి బోధనల ఫలితంగా పిల్లలు ఏవిధంగా తయారవుతున్నారనడానికి ఉదాహరణగా మిన్నీ తన అనుభవాన్ని రాశారు.‘నేను అయితారా మాంబర్ హైస్కూల్‌లో ఆరవ తరగతిలో ఉన్నాను. ఇతర మతాలకు చెందిన వ్యక్తుల పట్ల నాకు తీవ్ర విద్వేషం ఉండేది. వారితో మాట్లాడటానికి కూడా నేను ఇష్టపడేవాడిని కాదు. మా క్లాస్‌లో ఉన్న ఫైజల్ అనే అమాయక బాలుణ్ణి పాకిస్తాన్ గూఢచారి అని ఆరోపిస్తూ ఒక స్టీలు పళ్ళెంతో కొట్టిన విషయం నాకు ఇప్పటికీ జ్ఞాపకముంది. వారి శిక్షణ అంతా మనుషుల్ని మానసికంగా మత పిచ్చి వారిగా మార్చేవిగా ఉంటాయి’. అంటూ తన అనుభవాన్ని రాశాడు.

**ఆర్ఎస్ఎస్ బోధనలు – సాహిత్యం**

ఆరెస్సెస్‌లో కార్యకర్తలకు నాలుగు రకాలైన శిక్షణా కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సులు ఏవిధంగా ఉంటాయో చెప్పేందుకు ప్రాథమిక్ సంఘ్ శిక్షక్ వర్గ్ (యుటిసి ఇన్‌స్ట్రక్టర్ కోర్సు) గురించి తెలియజేశాడు రచయిత. ఈ కోర్సులో చర్చలు, ఉపన్యాసాలన్నీ ముస్లిం, క్రైస్తవ, కమ్యూనిస్టు వ్యతిరేకతను పాదుకొల్పేందుకు ఉద్దేశించినవిగా ఉంటాయి. ఒక వ్యక్తిని మానసికంగా మతపిచ్చివానిగా మార్చేందుకు ఉద్దేశించి ఉంటాయి. ప్రతి ఒక్కటీ ముస్లిం, క్రైస్తవ, కమ్యూనిస్టు వ్యతిరేక అంశాలతోనే ఉంటాయి. ఆరు రోజుల అనంతరం చివరగా ఆరెస్సెస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్, భారతమాత, గురూజీ చిత్రపటాల కింద ఒక కాంస్య దీపాన్ని వెలిగిస్తారు. అక్కడున్న దీపాలన్నింటినీ ఆర్పేసి ఈ ఒక్క దీపాన్నే ఉంచడం వల్ల ఆ మూడు చిత్రాలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. దివ్య వాక్యం మాదిరిగా ఒక మధురమైన గీతాన్ని పాడతారు. ప్రతి ఒక్కరూ ఆ గీతంలో లీనమైపోతారు. తరువాత మధురమైన ఉపన్యాసం ఉంటుంది. ఆ ముగ్గురు వ్యక్తుల కోసం మతపిచ్చి వ్యామోహాన్ని పెంచేదిగా ప్రతి ఒక్కటీ ఉంటుంది. ప్రేరేపణ కల్పించే ఈ పదాలతో ప్రతి ఒక్కరూ పరవశులవుతారు. చివరికి క్లాసు ముగుస్తుంది. ప్రతి ఒక్కరూ తీవ్ర మతపిచ్చితో ఊగిపోతారు. ఈ పథకాన్ని దీర్ఘకాలం పాటు నమ్మకమైన పరిశీలనలు, పరిశోధనలు జరిపిన అనంతరం ఖరారు చేసి అమలులో పెట్టారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను ఒక కరుడు గట్టిన ఉన్మాదుల్లా ఉండేందుకు ప్రేరేపించే అంశాలు పైన చెప్పినవి కొన్నయితే గోల్వాల్కర్ రాసిన ‘బంచ్ ఆఫ్ థాట్స్ పుస్తకం ఒకటిగా చెప్పాడు మిన్నీ. ఆ పుస్తకం చదివిన వారు గాలి, వెలుతురు లేని ఒక సొరంగంలో చిక్కుకుపోయిన భావనకు గురవుతాడు. అక్కడ తమ శిరస్సులను విశాలంగా పరిచి విద్వేషాన్ని, పగను వెదజల్లే సర్పాలు మనకు కన్పిస్తాయి. భారతీయ ఫాసిస్టుల కులతత్వం, మత పిచ్చి, ప్రజా వ్యతిరేకతను తెలుసుకునేందుకు మన ఆరెస్సెస్ విమర్శకుల నుంచి ఏమీ వినాల్సిన అవసరం లేదు. ఆరెస్సెస్ సైద్ధాంతిక గ్రంథమైన బంచ్ ఆఫ్ థాట్స్‌ను స్థూలంగా చదివితే సరిపోతుంది. ఆరెస్సెస్ ఎంతో శ్రద్ధతో ఆరాధించే గురూజీ మాధవ సదాశివ గోల్వాల్కర్ “హిందూవాదం ప్రమాదంలో పడింది” అనే నినాదాన్ని నిరంతరాయంగా నినదించడం ఒక సాధారణ హిందువులో మతతత్వ భావనను ఎక్కించి, ప్రజలను తమ వైపు ఆకర్షించే వారి వ్యూహంలోని భాగం. భారతదేశ జనాభాలో 80 శాతంగా ఉన్న హిందువులు అభద్రతతో ఉన్నారని, వారిని ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు వేటాడుతున్నారనే అబద్ధమే వారి ప్రచారానికి పునాది రాయిగా ఉంది అని తెలిపారు.

**తెయ్యం హస్తగతానికి ప్రణాళిక**

అయితారాలోని తాంపురన్ (ఫ్యూడల్ ప్రభువు) ఆధీనంలో ఉన్న ప్రతిష్ఠాత్మక తెయ్యం ఆలయాన్ని తమ చేతుల్లోకి తెచ్చుకునేందుకు ఆర్ఎస్ఎస్ ఎటువంటి కుట్రలు చేసిందో రచయిత వివరించాడు.

అయితారాలో కల్లి బాలకృష్ణన్ (సిపిఎం స్థానిక కమిటీలో అప్పటి సభ్యుడు) నాయకత్వంలో రైతులు భూములు ఆక్రమించుకున్నారు. సిపిఎం పార్టీ నుంచి తాంపురన్ ప్రాణానికి ప్రమాదం ఉందనే వాతావరణాన్ని ఆర్ఎపెస్ ప్రతినిధులు సృష్టిస్తారు. తాంపురన్ ఇంటిపై తామే బాంబులతో దాడి చేసి అది కమ్యూనిస్టులే చేయించారని అబద్ధపు ప్రచారం చేస్తారు. తామే తాంపురన్ రాజుకు రక్షణగా నిలబడుతున్నట్లు ప్రచారం చేస్తారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని కొంత మంది కత్తులూ, గొడ్డళ్లూ చేబూని కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా,

తాంపురన్‌ను కాపాడుకునేందుకు ఆర్ఎస్ఎస్‌తో జత కలుస్తారు. తాంపురన్ ఇంటికి కాపలాకాస్తారు. అటువైపుగా వచ్చిన కమ్యూనిస్టులపై రాళ్లు రువ్వుతారు. ఈ నేపథ్యంలో అక్కడ ఆర్ఎస్ఎస్ బలపడాల్సిన అవసరం ఉందనే పరిస్థితిని తీసుకొస్తారు. ఆ క్రమంలో తాంపురన్‌కు, అతని బంధువులకు వారుదగ్గరై తెయ్యం ఉత్సవాల నిర్వహణను తమ చేతుల్లోకి తెచ్చుకుంటారు. శాంతి, సామరస్యం నెలకొని ఉన్న ప్రాంతంలో అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని సృష్టించడంలో ఆరెస్సెస్ అనుసరించే వ్యూహం నమూనా ఈ విధంగా ఉంటుంది.

**ధర్మకార్యాలకు అబద్ధాలు చెప్పడం, దొంగతనం లాంటివి చెయ్యాలట...**

తెయ్యం ఉత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆలయ కమిటీ కార్యదర్శిగా ఉన్న దాసన్ శాఖలో శిక్షణ పొందుతున్న అభం, శుభం తెలియని చిన్నారుల చేతికి సంచులిచ్చి దొంగతనాలకు పంపిన వైనం ఆర్ఎస్ఎస్ నిజ స్వరూపాన్ని మరోసారి తేటతెల్లం చేస్తుంది. ఉత్సవం నిర్వహణకు అవసరమైన 100 అరటి మొక్కలను రాత్రికి రాత్రి నరికి తెప్పిస్తారు దాసన్. అవి తమకు మాంబరం ప్రభాకరన్ చందా రూపంలో ఇచ్చారని చెబుతారు. మరుసటి రోజు పోలీసులు శాఖపైకి దాడికి వస్తారు. వారితో పాటు మాంబరం ప్రభాకరన్ కూడా వస్తాడు. అరటి మొక్కలు దొంగిలించి తెచ్చినవని అర్థమవుతుంది. అ నేపథ్యంలో ధర్మాన్ని నెలకొల్పేందుకు మనం కొన్నిసార్లు విభిన్నమైన మార్గాల్లో వెళ్ళాల్సి ఉంటుందని కార్యవాహక్ మనోహరన్ శాఖలోని చిన్నారులకు గుర్తు చేస్తాడు. ఈ చర్యను అశోకన్ కూడా సమర్థిస్తాడు. అదే విధంగా కొబ్బరికాయలు, లేత కొబ్బరి కాయలను మిన్నీ సదానందన్ తోట నుంచి దొంగతనంగా తెంపి ఆలయానికి తీసుకొస్తారు. మరుసటి రోజు సదానందన్ కన్నీళ్ళతో శాఖకు వస్తాడు. అయితే చంద్రన్ ఆయన చెంపలు పగులగొట్టి అక్కడి నుంచి గెంటేస్తాడు.

శాఖలోని పిల్లలను ఉదయం 5.30 గంటలకే గ్రౌండ్‌కు పిలిపించి పెద్దపెద్ద సంచులిచ్చి కమలా ఎస్టేట్ నుంచి జీడిమామిడి పిక్కలు ఏరి తెమ్మని దాసన్ చెబుతాడు. వందలాది మంది వాటిని ఏరి క్షేత్ర సమితి (ఆలయ కమిటీ)కి అందజేస్తారు. కార్యకర్తలు వాటిని మార్కెట్‌లో అమ్ముతారు. అమాయకులైన చిన్న పిల్లలను ఉపయోగించి చేసిన దొంగతనమని ఆ తరువాతే వారికి తెలుస్తుంది.

**“శాఖలోని పిల్లలను ఉదయం 5.30 గంటలకే గ్రౌండ్‌కు పిలిపించి పెద్దపెద్ద సంచులిచ్చి కమలా ఎస్టేట్ నుంచి జీడిమామిడి పిక్కలు ఏరి తెమ్మని దాసన్ చెబుతాడు. వందలాది మంది వాటిని ఏరి క్షేత్ర సమితి (ఆలయ కమిటీ)కి అందజేస్తారు. కార్యకర్తలు వాటిని మార్కెట్‌లో అమ్ముతారు. అమాయకులైన చిన్న పిల్లలను ఉపయోగించి చేసిన దొంగతనమని ఆ తరువాతే వారికి తెలుస్తుంది.”**

**నియంతృత్వ ధోరణి**

విద్వేషాన్ని పెంచి శత్రువుపై దాడులకు పురిగొల్పడమే ఆర్ఎస్ఎస్ విధానమని ఈ సంఘటనను చూస్తే అర్థమవుతుంది.



ఆర్ఎస్ఎస్ హత్యాకాండ వివరాలు తెలుసుకుంటున్న సీతారాం ఏచూరి

తెయ్యం ఉత్సవం సాఫీగా జరుగుతున్నప్పుడు కూడా ఉత్సవాన్ని కమ్యూనిస్టులు ఆటంకపరచబోతున్నారని, అందువల్ల వారిని ఎదుర్కొవలసిందిగా ఆ ప్రాంతమంతటా ప్రచారం చేస్తారు. అయితారాను కాషాయరంగు కాగితం తోరణాలతోనూ, లేత కొబ్బరాకులతోనూ అలంకరించి, పలువురు పెద్దలు కత్తులు ధరించి వీధుల్లో ముందు నడుస్తారు. శాఖలో ఉన్న పిల్లలతో వారి వెంట తీసుకెళ్లి అచ్యుతన్ రీడింగ్ రూం ఎదుట గణగీతం (సంఘ్ గీతం) గట్టిగా ఆలపింపజేస్తారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా తెయ్యం ఉత్సవం ముగిసింది.

**కామక్రీడలు, హత్యలకు పుట్టినిల్లు**

ఈ పుస్తకం చదివిన తరువాత 'చెప్పేవి శ్రీరంగ నీతులు...' అన్న సామెత గుర్తు రాకమానదు. ఆర్ఎస్ఎస్‌లో కామక్రీడలు ఏ తరహాలో ఉంటాయో చెప్పేందుకు అథ్లెట్ సత్యన్ హత్య ఉదంతం పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది. సత్యన్ చాలా పేద కుటుంబానికి చెందినవాడు. ప్రతిరోజూ తెల్లవారుఝామునే (సుమారు 3 గంటలకు) తన స్వస్థలం నుంచి మంబారం పెరలస్సెరి వరకు 30 కిలోమీటర్లు పరుగుపెడతాడు. ఒకసారి అలా పరుగుతీస్తూ ఉండగా ఏదో పని మీద బయటకు వెళ్ళిన ఒక స్వయం సేవకుని ఇంట్లోకి ఒక సంఘ్ నాయకుడు వెళ్ళడాన్ని ఆయన చూస్తాడు. స్వయం సేవకుని చెల్లెలితో సంఘ్‌నాయకుడు కామక్రీడలు నెరుపుతున్నాడనే విషయం తెలుస్తుంది. అదే విషయాన్ని గణేషన్, దినేషన్ అనే వ్యక్తులు కూడా గమనిస్తారు. ఒక రోజు శాఖకు హాజరై "ఆ వెధవ తన చెల్లెలి చేత వ్యభిచారం చేయిస్తున్నాడు" అంటూ దినేషన్ అరుస్తాడు. దీంతో పగపెంచుకున్న దాసన్, రాజన్, చంద్రన్‌లు పథకం వేసి బస్‌లో వెళ్తున్న దినేషన్‌ను లాగి మారణాయుధాలతో దాడి చేసి ఆసుపత్రిపాల్జేస్తారు. ఈ హత్యను ఒక ట్రయిల్‌లా ఉపయోగించుకొని అదే తరహాలో సత్యన్‌ను హత్యగావిస్తారు. కూతుపరంబ నుంచి అయితారాకు బస్‌లో వస్తుండగా ఆయనను బయటికి లాగి పెద్ద పేగులు బయటికి వచ్చేలా గొడ్డలిలో నరికేస్తారు. తరువాత పొట్టలోని భాగాలన్నింటినీ దారుణంగా బయటికి లాగి పేగుల్లో ఇసుక కూరేస్తారు.

కొంకాచి, పత్యాకన్నూలో మిన్నీ బస చేసినపుడు ఆ గ్రామంలో సంఘ్ పాలనలో ఉన్న శివాలయానికి తెల్లవారు జామున 4 గంటలకు వెళ్తాడు. ఆ ఆలయంలో పూజలు ఏమీ ఉండవు సరికదా ఆ శ్రీ జిగీష్ అనే స్వయం సేవకుడు ఆ సమయంలో ఆలయంలో

**❝ ఈ దేశంలో కమ్యూనిస్టులను రాజకీయంగా అణగదొక్కటం ఆర్ఎస్ఎస్ లక్ష్యం. చైనా, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్‌ను కలుపుకొని పూర్తిగా ఒక హిందూ మతతత్వ భారతదేశాన్ని సృష్టించాలి. ఆ దేశంలో ముస్లింలు, క్రైస్తవులతో సహా మరే ఇతర మతస్తులు ఉండడానికి వీలులేదు. ❞**

అమ్మాయితో కామక్రీడలు నెరపడం చూసి ఒక్క సారి నిర్ఘాంతపోతాడు.

కొద్ది రోజుల వ్యవధిలో అక్కడ నుంచి ఉత్తర పొయిలూరు వెళ్తాడు మిన్నీ. రామాశ్రమం నిర్మిస్తున్న ప్రదేశానికి వెళ్తాడు. అక్కడ ఒక మృతవీరుని భార్యను చూస్తాడు. అంత అర్థరాత్రి పూట ఆమె అక్కడెందుకున్నదా అని ఆశ్చర్య పోతాడు. రాత్రిపూట చిక్కూ ఇంటికి వచ్చానని, చిక్కూ తల్లికి తోడుగా ఉంటానని ఆమెచెప్పింది. తెల్లవారు జాముున మధ్య పొయిలూరులో ఉదయపు శాఖ నిర్వహించేందుకు వెళ్తాడు. ఆ సమయంలో మృతవీరుని భార్యతో పాటు కొందరు మహిళలు పురుషులతో కలిసి కారులో వెళ్లడాన్ని చూస్తాడు. మృతవీరుని భార్యను కూడా ఆర్ఎస్ఎస్ నాయకులు వదలని పరిస్థితిని చూసి మనసులో కుమిలిపోతాడు మిన్నీ.




**ఆర్ఎస్ఎస్ కోరుతున్న అఖండ్ భారత్**

హత్యలు చేయడం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు సాధారణమైన విషయమే కాదు అది ఒక బాధ్యతగా భావిస్తారని శ్రీవల్సన్ మాటల ద్వారా మరో చాప్టర్‌లో అర్థమవుతుంది. శాఖకు సమీపంలో ఉన్న కొండ మీద అడవిలో దాసన్, మనోహర్, రాజన్, పురుషు, సధానందన్, సజీవన్, చంద్రన్, సుధాకరన్, రచయిత మిన్నీ, వారి సోదరుడు సమావేశమవవుతారు. దానికి శ్రీ వల్సన్ హాజరవుతారు.

ఒక కమ్యూనిస్టు కొచక్కండి రాఘవన్‌ను ఆ ప్రాంతానికి చెందిన ఇద్దరు స్వయం సేవకులు రూపొందించిన పథకం ప్రకారం 1984లో హత్య చేస్తారు. ఆ చర్యలో పాల్గొన్న దాసన్, చంద్రన్‌లకు సంఘ్ నిర్ణయించిన విధంగా రూ.15,000 అందించడానికి తాను అక్కడికి వచ్చినట్లు శ్రీ వల్సన్ చెప్తారు. వారికి ఆ మొత్తం అందజేస్తూ ఇలా చెప్పాడు. ప్రాణాలను త్యాగం చేసైనా మార్క్సిస్టు ఉగ్ర వాదుల సవాళ్ళకు జవాబివ్వడం మన బాధ్యత. ఇలా దాడులు చేయడం మన పని విధానం అని అంటాడు. ఒక పవిత్ర యుద్ధం చేస్తున్నప్పుడు ఇటువంటివి సహజమంటూ ప్రచారక్ వినోద్ చెప్పడాన్ని బట్టి ఆర్ఎస్ఎస్ విధానం అర్థం చేసుకోవచ్చు.

### ఆర్ఎస్ఎస్ లక్ష్యమేంటి?

ఈ దేశంలో కమ్యూనిస్టులను రాజకీయంగా అణగదొక్కటం ఆర్ఎస్ఎస్ లక్ష్యం . చైనా, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్‌ను కలుపుకొని పూర్తిగా ఒక హిందూ మతతత్వ భారతదేశాన్ని సృష్టించాలి. ఆ దేశం లో ముస్లింలు, క్రైస్తవులతో సహా మరే ఇతర మతస్తులు ఉండడానికి వీలులేదు. అది హిందూ మతరాజ్యంగా ఉండాలని మధురైలోని నిర్వ హించిన ప్రథమ సంఘ్ శిక్షా వర్గ్‌ను గమనిస్తే అర్థమవుతుంది.

'భారతదేశం మన మాతృభూమి అనే భావనను పాదుకొల్పేందుకు దేశభక్తి గీతాలు పాడతారు. శిబిరమంతా వందేమాతరం గీతంతో మారుమోగిపోతుంది. ఆ ఆవరణలో ఒక రకమైన ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టిస్తుంది. శిబిరం ముగింపులో రాత్రిపూట అఖండ భారత్ చిత్రాన్ని గీయడం జరుగుతుంది. చైనా, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ వంటి వాటిని కలుపుకొని అఖండ భారత్ లేదా సమగ్ర భారతదేశాన్ని రూపొందిస్తారు. ప్రతి చోటా పురాణాలకు సంబంధించి వృత్తాలు గీయబడతాయి. ఉదాహరణకు నేపాల్‌లో జనకుడు, ఆఫ్ఘనిస్తాన్‌లో గాంధారం వంటివి. తరువాత శిబిరంలోని దీపాలన్నింటినీ ఆర్పేసి శ్రీలంక ఉన్న స్థలంలో కంచు దీపాన్ని వెలిగిస్తారు. అది చక్కగా కన్పించేలాఉంటుంది. ఒక నిరాకారమైన బాణీలో పాట పాడబడుతుంది.

'ఓ దేవీ,<br>
నీ బంగారు అందె, అందమైన లంక<br>
ఎప్పటికీ కోల్పోయావు, నీ అందమైన తిలకం<br>
గాంధారము నీ శరీరం నుంచి వేరైపోయింది<br>
ఈ తల్లి తన అంగాలన్నింటినీ ఈ రకంగా కోల్పోయింది.

కాశ్మీర్‌ను వేరు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ సహాయంతో భారతదేశాన్ని లోబరచుకొనేందుకు చైనా ప్రయత్నిస్తోంది. అస్సాం, నాగాలాండ్ సరి హద్దుల్లో క్రైస్తవులు ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నారు. మన ప్రాణాలను త్యాగం చేసి అయినా సరే తల్లి భారతదేశాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్న దుష్ట శక్తులను ఎట్టి పరిస్థితిలోనూ తరిమికొట్టాలి. గాడ్సే అస్తికలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. అఖండ భారత్‌ను సాధించిన తరువాత మాత్రమే వాటిని నిమజ్జనం చేస్తాం' అంటూ పాడతారు.

'సమగ్ర భారతదేశంలోని అన్ని పవిత్ర స్థలాలకూ ప్రత్యేకమైన మెరుపు వచ్చేలా దీపాలు వెలిగిస్తారు. సమగ్ర భారతదేశం, దాన్ని కార్య రూపంలోకి తేవడం అనే భావనను అత్యున్నత స్థాయిలో భావోద్రేకం కల్గే విధంగా వివరిస్తారు. ఈ ఒక్క అంశమే ప్రతి ఒక్కరినీ మానసికంగా ఉన్మాదస్థాయికి చేరుస్తుంది. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులను నిర్మూలించేందుకు అక్కడున్న ప్రతివారూ తీరని దాహాన్ని ప్రదర్శిస్తారు. ఈ శిబిరం తన సభ్యులను నిస్సందేహంగా మతతత్వ ఉన్మాదపు శిఖరాగ్రానికి చేరుస్తుంది.' అని ప్రథమ సంఘ్ శిక్షా వర్గ్ విశేషాలు తెలియజేస్తాడు మిన్నీ.

గణిత మ్యాజిక్, యోగా, లక్ష్మీపూజ,

వంటి అంశాలు నేర్పించే పేరుతో విద్యార్థుల మధ్యకు వెళ్లి ఆరెస్ఎస్ కార్యకర్తలు ఎలా ఆకర్షిస్తారో కూలంకుషంగా వివరించారు. సుదీశ్ మిన్నీయే ప్రత్యక్షంగా మారు పేర్లతో సుమారు 500 విద్యాసంస్థల్లో విద్యార్థులను ఆకర్షించినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కన సంఘ్ పరివార్ తమ కార్యకలాపాలను చాపకింద నీరులా ఏ విధంగా చేసుకుపోతుందో, ఎంత మందిని ఉన్మాదులుగా మారుస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఆరెస్సెస్‌కు చెందిన వివిధ పరివార్ సంస్థలకు సంబంధించి సాధారణ ప్రజల్లోనే గాక స్వయం సేవకుల్లో కూడా సందేహాలున్నాయి. ఇక్కడ ఎదురయ్యే ప్రశ్న ఆరెస్సెస్, బిజెపి రెండూ ఒకటేనా, బిజెపిని ఆరెస్సెస్ నియంత్రిస్తోందా అనేది. పరివార్‌లో బయటకు కన్పించే సంస్థలతో పాటు అనేక నిగూఢ సంస్థలున్నాయి. ఇంకా దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక ట్రస్టులు పని చేస్తున్నాయి.

**సంఘ్ పరివార్ అంటే ఏమిటి?**

ఒక నదిలోని నీరు విభిన్న పిల్ల కాలువల ద్వారా ప్రవహించి ఒక ప్రత్యేకమైన ప్రదేశంలో అడ్డుకోనలవిగాని పెద్ద ప్రవాహంగా మారుతుంది. అదే విధంగా హిందూ దేశాన్ని సాకారం చేసేందుకు విభిన్న మార్గాల ద్వారా కదులుతూ ఉంటాయి. అన్నీ ఒక చోట కలిసినప్పుడు ఒక భీకర సైన్యంగా మారతాయి. దీనికి ఒక ఉదాహరణగా గంగానదిని చెబుతారు. సంఘ్ పరివార్‌లోని వివిధ సంస్థల మధ్య ఉన్న సంబంధాలను గురించి రెండవ సర్ సంఘ చాలక్ గురూజీ గోల్వాల్కర్ ఈ విధంగా చెప్పారు – సంఘ్ రాముడైతే పరివార్ సంస్థలు హనుమంతుని వంటివి. అంటే రాముడు తన మనస్సులో ఏది అనుకుంటాడో హనుమంతుడు దాన్ని పూర్తి చేస్తాడు. పరివార్‌కు సంబంధం ఉన్న ప్రతి సంస్థనూ అఖిల భారతీయ కార్యకారీ, ప్రాంతీయ కార్యకారీ నియంత్రిస్తారు. వారి ప్రతి కదలికనూ నాగపూర్ నుంచి పర్యవేక్షిస్తారు.

ప్రతి పరివార్ సంస్థ తన సొంత చట్రంతో ఇతర సంస్థలకు భిన్నంగా పని చేస్తుంది. వాటికి మార్గదర్శనం చేసేందుకు ఒక పరిశోధనా సంస్థే ఉంది. అత్యున్నత స్థానాల్లో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, రిటైర్డ్ న్యాయమూర్తులు ఈ పరిశోధనా సంస్థలో ఉన్నారు. పరివార్‌కు సంబంధించిన ప్రతి సంస్థా ఈ సంస్థ రూపొందించిన మార్గంలోనే కదులుతాయి. పరివార్ సంస్థలు, సంఘ్

> **"సంఘ్ పరివార్‌లోని వివిధ సంస్థల మధ్య ఉన్న సంబంధాలను గురించి రెండవ సర్ సంఘ చాలక్ గురూజీ గోల్వాల్కర్ ఈ విధంగా చెప్పారు - సంఘ్ రాముడైతే పరివార్ సంస్థలు హనుమంతుని వంటివి. అంటే రాముడు తన మనస్సులో ఏది అనుకుంటాడో హనుమంతుడు దాన్ని పూర్తి చేస్తాడు."**



కేరళలో ఆర్ఎస్ఎస్ హత్యాకాండలో బలైన సిపిఎం కార్యకర్త

కూర్చొని కార్యనిర్వాహక అజెండాను రూపొందిస్తాయి. వారి సమావేశాన్ని 'సమన్వయ బైఠక్' అని పిలుస్తారని మిన్నీ పేర్కొన్నాడు.

ఆరెస్సెస్ సంస్థాగత వ్యవస్థ పురాతన హిందూ కుటుంబ నమూనాలో ఉంటుంది. అది హిట్లర్, ముస్సోలినీల ఫాసిస్టు సంస్థలను అనుకరించి రూపొందించబడింది. ఆరెస్సెస్ కలల దేశపు రాజకీయ వ్యవస్థ కేంద్రీకృత నిరంకుశ అధికారంపై ఆధారపడి ఉంటుంది.

**కేరళలో పరివార్ సంస్థలు**


ఎబివిపి (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్), బాలలు – బాలగోకులం (బాలలను సమీకరించేందుకు), అమృత భారతి విద్యా సంస్థ, యువ మోర్చా, మహిళా మోర్చా వీటితో పాటు క్షాత్ర సదనం – శిశు వాటిక (ఒక రహస్య సంస్థ) విజ్ఞాన భారతి, విద్యా భారతి, యా కుందేందు తుషార హార ధవళాం (ఆ సంస్థలు సంఘ్ ఆదేశాలన్నింటినీ పాటిస్తాయి. దాని పథకాలన్నింటినీ అమలులో పెడతాయి), విశ్వ హిందూ పరిషత్, హిందూ ఐక్యవేదిక, భారతీయ విచార కేంద్ర, బిఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్), క్షేత్ర సంరక్షణ సమితి, సేవా భారతి, భాస్కర్ జ్యోతి,వనవాసీ కల్యాణాశ్రమం, ఏకలవ్య విద్యాలయాలు, వివేకానంద కేంద్రం, కన్యాకుమారి, అఖిల భారతీయ మత్స్య ప్రవర్థక సంఘం. ఇవి కేవలం కేరళలో ఉన్న పరివార్ సంస్థలు మాత్రమే. ఈ లెక్కన దేశంలో ఎన్ని పరివార్ సంస్థలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇన్ని సంస్థలు ఉన్నాయనే విషయం ఆయా సంస్థల్లో పని చేస్తున్న సభ్యులకు కూడా తెలిసి ఉండదు. ఒక్కో సంస్థ ఒక్కో విభాగంలో పని చేసి ప్రజలకు గేలం వేసి, వారిని తమ భావాలవైపు ఆకర్షితులను చేస్తూ ఉన్నాదాన్ని ప్రేరేపిస్తుంటాయి.

**సిపిఎం కంచుకోటపైనే దృష్టి**

నాగపూర్‌లో జరిగే నైపుణ్యవర్గ్ (ముఖ్యమైన వ్యక్తులతోజరిపే రహస్య సమావేశం)లో జరిగిన చర్చలు పరిశీలిస్తే బలంగా ఉన్న సిపిఎంను దెబ్బతీయాలన్నదే ఆర్ఎస్ఎస్ ప్రధాన టార్గెట్‌గా కన్పిస్తుంది.


భారతదేశంలో కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర కమ్యూనిస్టుల కోటలుగా ఉన్నాయి. అక్కడ సంఘ్ కార్యకలాపాలు లోతుగా వేళ్ళూనలేదు. ఈ రాష్ట్రాలలో మనం పోరాడితే హిందూ

> **“కన్నూర్‌లో సిపిఎంను నిరోధించేందుకు కాంగ్రెస్‌తో ఆర్ఎస్ఎస్ కుమ్మక్కవుతుంది. కాంగ్రెస్ ప్రధాన శతృవులుగా భావిస్తున్న ముగ్గురు సిపిఎం నాయకులను ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు హత్య చేస్తారు. దీనికిగాను కృతజ్ఞతగా కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌జీ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి అవసరమైన రూ.1 లక్ష విలువైన టైల్స్‌ను అందజేస్తాడు.”**


రవీంద్రనాథ్ ఠాగూర్


రామకృష్ణ పరమహంస


స్వామి వివేకానంద


నారాయణగురు

దేశాన్ని నెలకొల్పాలనే స్వయం సేవకుల కల సాకారం అవుతుంది. బెంగాల్ పవిత్ర భూమి. హిందూ పునరుజ్జీవనానికి నాయకులుగా ఉన్న గొప్ప మేధావులు ఈ గడ్డపై జన్మించారు. ఈ పవిత్ర భూమి స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి గొప్ప వ్యక్తుల జన్మస్థలం. ఇది దురామాతను పూజించే పవిత్ర భూమి. అంతేగాక ఆధ్యాత్మికత, కళలు, సాహిత్య రంగాలలో దిగ్గజాలున్న నేల. కేరళ పరిస్థితి కూడా ఇదే. మనకు శ్రీ నారాయణ గురు, చట్టంబి స్వామికల్, అద్వైత వేదాంత రూపకర్త శంకరాచార్య అంటే మనకు అపారమైన ఆదరణ ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ సంఘ్, శాఖ కార్యకలాపాలున్నాయి. కానీ అవి బలంగా లేవు. అవి రాజకీయాల్లో విజయం సాధించలేక పోయాయి. దానికి కారణం కమ్యూనిజం ప్రభావం బలంగా ఉండటమే. విభిన్న మార్గాల ద్వారా ఆ పరిస్థితిని మెరుగుపరచేందుకు మనం తీవ్రంగా యోచించాల్సి ఉంది. పశ్చిమ బెంగాల్‌లో పదేళ్ళలో కమ్యూనిజాన్ని రూపుమాపవచ్చని ఊహిస్తున్నాం. ఈ లక్ష్యాల సాధన కోసం వివిధ సెక్షన్లలో హిందూ సెల్‌లను రహస్యంగా ఏర్పాటు చేయాలి'. అంటూ ముఖ్య నేతలు చర్చించుకున్న విధానాన్ని రచయిత వివరించారు.

**గూండాగిరి**

డబ్బులిస్తే ఎటువంటి హత్యలనైనా చేయడానికి సిద్ధపడతారని తెల్లిచెర్రిలో సంఘటన తేటతెల్లం చేసింది. కన్నూర్‌లో సిపిఎంను నిరోధించేందుకు కాంగ్రెస్‌తో ఆర్ఎస్ఎస్ కుమ్మక్కవుతుంది. కాంగ్రెస్ ప్రధాన శతృవులుగా భావిస్తున్న ముగ్గురు సిపిఎం నాయకులను ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు హత్య చేస్తారు. దీనికి గాను కృతజ్ఞతగా కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌జీ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి అవసరమైన రూ.1 లక్ష విలువైన టైల్స్‌ను అందజేస్తాడు. ఈ విషయాన్ని కళ్లతో చూసిన రచయిత కాంగ్రెస్ కొటేషన్ పనిని సంఘ్ నిర్వహిస్తోందా? అంటూ తనలో తాను మధన పడతాడు. అంతే కాకుండా కన్నూరు జిల్లాలో ప్రతి చోటా ఉన్న అవినీతి, చదువుల తల్లి సరస్వతి నిలయాలుగా ఉండాల్సిన సంస్థలను ఆయుధాగారాలుగా, వ్యభిచార గృహాలుగా దిగజారుస్తుండడాన్ని చూసి కలత పడతారు.

**సిపిఎం, ఆర్ఎస్ఎస్ మధ్య తేడా**

ఆర్ఎస్ఎస్ దుర్మార్గాలను ఎండగడుతూనే సిపిఎం – ఆర్ఎస్ఎస్ పని విధానాల తేడాను కూడా ఈ విధంగా వివరించారు.

'సిపిఐ(ఎం), ఆరెస్సెస్ రెండూ ఒకే రకంగా పని చేస్తాయంటూ చాలా కాలంగా మీడియా ప్రచారం సాగిస్తోంది. సిపిఐ(ఎం) పని చేసే పద్ధతికి, ఫాసిస్టు ఆరెస్సెస్ పద్ధతికి ఎటువంటి సారూప్యతా లేదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికన పనిచేసే సిపిఐ(ఎం)కు పార్టీతో సంబంధమున్న ఏ వ్యక్తి అయినా చేసే ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు పూర్తి స్థాయి యంత్రాంగం ఉంది. ఈ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం జరుగుతుంది. ఆరెస్సెస్ లో అటువంటి ఏర్పాటు ఏదీ లేదు. వారు రహస్య పద్ధతిలో పని చేస్తారు' అని రాశారు. ❋

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తి ప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

# చరిత్ర జ్ఞానంలేని మోడీ

**సుధీంద్ర కులకర్ణి**



రచయిత
ప్రముఖ పాత్రికేయులు

అభిప్రాయాలు ఏవైనా చెప్పొచ్చు కాని నిజాలు మటుకు పవిత్రమైనవి. జర్నలిజాన్ని ఆచరించే వారందరు ఈ సూత్రాన్ని (ధర్మాన్ని) తప్పనిసరిగా అనుసరించాలి. కాని ఈ దేశ ప్రధానమంత్రి నిజాలను పక్కన పెట్టేసి ఉదారంగా అబద్ధాలను వల్లిస్తుంటే ఏమిజరుగుతుంది? అదికూడా సాక్షాత్తు పార్లమెంటులో. ఇక్కడ మాట్లాడే సామ్యానుల నుండి పెద్దల వరకు అందరూ రాజ్యాంగానికి లోబడి వాస్తవాలను మాట్లాడాల్సి ఉంటుంది. ఒకటి మటుకు జరుగుతుంది. అదేమిటంటే ప్రధానమంత్రి తనకుతాను అపకీర్తి కొనితెచ్చుకోవటం, తాను బాధ్యత వహించే కార్యాలయానికి అపఖ్యాతి కొనితేవడం, పార్లమెంటుకే తలవంపులు తేవటం జరుగుతుంది.

నరేంద్రమోడీకి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అంటే ఎంత ద్వేషమో, వల్లభాయ్ పటేల్ అంటే ఎంత ఇష్టమో అందరికి తెలుసు. కాని ఒకరి పట్ల ద్వేషమున్నా లేదా అభిమానమున్నా, నిజాలను అగౌరవ పరిచేలా ఉండకూడదు.

పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చేప్పే క్రమంలో ప్రధానమంత్రి ఎన్నికల ప్రచార ఉపన్యాసం చేశారే తప్ప వివేకశీలియైనా వ్యక్తిగా సమాధానం ఇవ్వలేదు. పేటెంటు హక్కులు ఇవ్వగలిగే విధంగా రెండు అబద్ధాలు ఆయన ప్రసంగంలో వచ్చాయి. ఒకటి 1947లో జరిగిన దేశ విభజనకి కారణం కాంగ్రెస్ పార్టీయేనని, డెబ్బై ఏళ్ళ తరువాత కూడా 125 కోట్ల మంది భారతీయులు ఆనాడు కాంగ్రెస్ వేసిన విషబీజాల ఫలితాలు నేటికీ అనుభవిస్తున్నారు అని శెలవివ్వటం. ఆ విషజ్వాలలు ఏమిటనేది ఎవరికి తెలియని అంశం. ఆయనకూడ ఒక కుట్రలాగా దాని గురించి విడమరిచి ఏమి చెప్పలేదు. రెండోది, దేశ విభజన సమయంలో సంఘ్ పరివార్ పాత్రాచాలా గొప్పదని, నెహ్రూ బదులు పటేల్‌ను ఆరోజు ప్రధానమంత్రిని చేసి ఉంటే మొత్తం కాశ్మీర్ భూభాగం భారతదేశంలో ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు.

పార్లమెంటులో ఆరోజు ప్రధానమంత్రి ప్రసంగం విన్నవారికి అసలు దేశ విభజన ప్రస్తావన ఆ సందర్భంలో చాలా వింతగా అనిపించింది. ఎందుకంటే, గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హడావిడిగా విభజన బిల్లు తీసుకువచ్చి ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు మార్గంచేయటం, దాని వల్లే ఈ రోజు ఈ సమస్యలన్ని వచ్చాయని చెప్పటం ఆయన ప్రసంగ ఉద్దేశం. బి.జె.పి తోటి తెగతెంపులు, చేసుకోవటానికి టి.డి.పి ముందడుగు వేస్తుందనే ఆలోచనలో ఆయన కాంగ్రెసుని టార్గెట్‌చేసారు. ఎన్‌డిఎ-1 అధికారంలో ఉన్నప్పుడు చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరఖండ్ రాష్ట్రాలను సమానంగా విభజించామని, ఇప్పుడు కాంగ్రెస్ విఫలమయ్యిందని చెప్పటం ఆయన ఉద్దేశం.

కాకపోతే, దేశంలోని నాలుగు రాష్ట్రాల విభజనకు దేశ విభజన సందర్భాన్ని పోలిక తేవటం అసందర్భంగా ఉంది. రాష్ట్రాల ప్రమాణాలను సరిచేసే సాధారణ ప్రక్రియగా రాష్ట్రాల విభజనలు జరుగుతున్నాయి. అందుకు భిన్నంగా 1947 బాధాకరమైనా పరిస్థితులలో దేశం రెండు దేశాలుగా విడగొట్టబడింది. కాంగ్రెస్ పట్ల ఉన్న ఏహ్యతా భావనలో మోడీ సమయ, సందర్భాలను మరచి తప్పుడు ప్రచారాన్ని అందుకున్నారు.

రక్తసిక్తమై ముక్కలుగా విడిపోయిన భారత దేశానికి కాంగ్రెస్ ఒక్కటే కారణమా? దేశ విభజన మీద వచ్చిన పుస్తకాలన్నిటితో ఒక లైబ్రరీని ఏర్పాటు చేయవచ్చు. వాటన్నిటిలోనూ రచయితలు చెప్పినదేమిటంటే, కాంగ్రెస్ పార్టీ దేశ విభజనకు ఎన్నడూ అంగీకరించలేదని, చివరి వరకు అడ్డుపడుతూనే ఉందని, పాకిస్థాన్ ప్రతిపాదనకు బీజం వేసిన మహమ్మద్ ఆలీ జిన్నా కూడా ఈ విధమైనా విభజనను కోరుకోలేదు. ప్రజలను పూర్తి విరోధులుగా మార్చే విధంగా దేశాన్ని ముక్కలు చేయటాన్ని ఆయన వ్యతిరేకించారు. మతోన్మాదులతో కూడిన ముస్లిమ్ లీగ్ ప్రత్యేక ముస్లిం రాష్ట్రాలు కావాలని మొండితనానికి పోవటం, బ్రిటీషువాడి విభజించు-పాలించు విధానాల మధ్య తప్పనిసరి పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ విభజన ప్రణాళికను అమోదించింది. ముస్లింలీగ్ 1940 లాహోర్ తీర్మానంలో కూడా ప్రత్యేక రాష్ట్రాలు కోరారు కాని, దేశ విభజన అంశం, ప్రత్యేక పాకిస్థాన్ అంశం అసలు లేనేలేవు. అది బ్రిటీషువాడితంత్రం.

అయినా, కాంగ్రెస్ పాపం కొంత లేకపోలేదు. స్వాతంత్రపోరాట సమయంలో ఎన్నో సార్లు విభజన జరగకుండా చేయటానికి అవకాశాలు వచ్చాయి. పరస్పర సహకారం, సుహృద్భావ వాతావరణం నెలకొల్పటానికి ముస్లిం లీగ్‌కి, కాంగ్రెస్ పార్టీకి అవకాశాలు వచ్చాయి. కాని కాంగ్రెస్ వాటిని దొరక పుచ్చుకోలేదు మహాత్మగాంధిని, నెహ్రూని విభజన ద్రోహులుగా చిత్రీకరిస్తున్న సంఘ పరివార్ సోదరులకు ఇక్కడ రెండు విషయాలు గుర్తుచేయాలి. మొదటిది, అబ్దుల్ కలామ్ అజాద్ రాసిన "ఇండియా విన్స్ ఫ్రీడం " పుస్తకంలో స్పష్టంగా చెప్పిందేమిటంటే, బ్రిటీషువాడి విభజన ప్రతిపాదనకు కాంగ్రెస్ నాయకులందరిలోకి గట్టిగా మద్దతు ఇచ్చింది వల్లభాయ్ పటేల్ మాత్రమే. తీవ్ర విముఖత, బాధతో చిట్టచివర గాంది ఒప్పుకున్నాడు. పోనీ అబ్దుల్ కలామ్ ఆజాద్ సంఘపరివార్ మిత్రుడు కాదు కాబట్టి మోడీగారికి వారి మంత్రి మండలి సభ్యులనుంచే విద్యాభ్యాసము చేయిద్దా ము ఎమ్.జె.అక్బర్ 1988 లో రాసిన "నెహ్రూ-ది మేకింగ్ ఆఫ్ ఇండియా" పుస్తకంలో, పేజి 406లో ఇలా రాశాడు. "భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ నెహ్రూకన్న ముందే విభజన ప్రతిపాదనకు అంగీకరించాడు" అందు వల్ల మోడీగారు విభజనకు కాంగ్రెస్ పార్టీని బాధ్యురాలుగా చేసి మాట్లాడితే, అది నేరుగా పటేల్‌ని ఉద్దేశించి అన్నట్లేనని గుర్తించాలి.

రెండవ అంశం ఇంకా ముఖ్యమైనది. మోడీ నడిపించే పార్టీ సంఘపరివార్‌లో ఒక భాగమే. దాని సిద్ధాంతం హిందుత్వ, హిందూ రాష్ట్రం, అఖండ భారతం. దేశ విభజనకు ఇది కూడా కారణం కాదా? ఇక్కడ మోడీగారు పొగిడిన ముగ్గురు దేశ ప్రముఖులలో ఒకరైన డా.రామ్‌మనోహర్‌లోహియా మాట్లాడింది మనం గుర్తు చేసుకోవాలి. (మిగతా ఇద్దరు


> **"ముస్లింలను, హిందువులను ఏకం చేయటానికి వారొక్క ప్రయత్నం కూడా చేయలేదు. పైపెచ్చు, ఆ దూరం మరింత పెరగటానికి చేయాల్సినవన్నీ చేశారు. ఆ దూరమే అంతిమంగా విభజనకు దారి తీసింది. ఒకవైపు అఖండ భారత్ అంటూ మరోవైపు మనస్పర్ధలు మరింతగా పెంచేలా చేయటం వారిని వారు మోసగించుకునే సిద్ధాంతం."**

పండిట్ దీనదయాళ్, గాంధీ.) అఖండ భారత్, హిందూరాష్ట్ర సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతి రేకించిన లోహియా తన పుస్తకం "దేశ విభజనకు బాధ్యులు"లో దేశ విభజనకు ప్రధాన కారకులలో ఒకరు హిందూ మత్తోన్మాదులు. హత్య చేసిన తరువాత ఎందుకు చేశానా అని విలపించినట్లు ఉంది వీరి తీరు. ఎవరయితే అఖండ్ భరత్ అని గట్టిగా వాదించారో ఆ జనసంఘ్, దాని ముందు తరాల వారు, బ్రిటిషు వారు, ముస్లిం లీగ్ దేశాన్ని విడగొట్టడానికి ప్రయత్నిస్తుంటే పూర్తిగా సహకరించారు. ముస్లింలను, హిందు వులను ఏకం చేయటానికి వారొక్క ప్రయత్నం కూడా చేయలేదు. పైపెచ్చు, ఆ దూరం మరింత పెరగటానికి చేయాల్సినవన్నీ చేశారు. ఆ దూరమే అంతిమంగా విభజనకు దారి తీసింది. ఒకవైపు అఖండ భారత్ అంటూ మరోవైపు మనస్పర్ధలు మరింతగా పెంచేలా చేయటం వారిని వారు మోసగించుకునే సిద్ధాంతం.

ఇప్పుడు ఇక మనం కాశ్మీర్ అంశంపై పటేల్ గురించి మోడీగారు మాట్లాడే వాటిని పరిశీలిద్దాం. భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకున్న తరువాత దాదాపు 560 సంస్థానాలను ఇముడ్చుకోకడంలో పటేల్ గణనీయమైన పాత్ర పోషించింది వాస్తవం. నెహ్రూ స్వయంగా పటేల్ ను "భారత దేశ నిర్మాత" అని ప్రశంసించారు. కాని మూడూ సంస్థానాలు హైదరాబాద్, జునాఘడ్, జమ్ము కాశ్మీర్‌ల విషయంలో రెండు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తాయి. పటేల్ యొక్క ఉక్కు సంకల్పం, జునాఘడ్‌లో అభిప్రాయ సేకరణతో, హైదరాబాదు పోలీసు యాక్షన్‌తో ఆ రెండింటి సమస్య తీరిపోయింది. కాని కాశ్మీర్ సమస్య చాలాకాలం పాటు పరిష్కారం కాలేదు. రెండుదేశాలను ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తీసింది. వేలమంది రక్త మోడ్చాల్సి వచ్చింది.

చరిత్రలో అందుబాటులో ఉన్న ఆధారాలన్ని పరిశీలిస్తే పటేల్ కాశ్మీర్ సమస్యను


మహాత్మాగాంధీ


మహ్మద్-ఆలీ-జిన్నా

1947-48లోనే పరిష్కరించగలిగేవాడని, కాశ్మీర్ మొత్తం ఇండియాలోకి వచ్చేదని మోడీ చేస్తున్న ప్రకటనలు అవాస్తవమని తెలుస్తోంది. అసలు ప్రారంభదశలోనే మొత్తం కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కి ఇచ్చేయాలని పటేల్ అభిప్రాయ పడ్డాడు. ఈ నిజాన్ని అర్థం చేసుకోవాలంటే, చరిత్రకారులందరూ కలిసి వెలిబుచ్చిన అభిప్రాయాలను వినాలి. రాజమోహన్ గాంధీ తన "పటేల్ జీవితం" పుస్తకంలో జిన్నా కూడా ఒప్పుకుంటే, జనాగఢ్‌ను, హైదరాబాద్‌ను ఇండియాకి ఇచ్చేస్తే, కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇద్దామని పటేల్ ఆలోచన చేశాడు. దానికి ఆయన ఇచ్చిన తార్కాణం "పటేల్ జునాగఢ్ లోని బహాఉద్దీన్ కాలేజీలో మాట్లాడుతూ వారు హైదరాబాద్‌కి అంగీకరిస్తే, మేము కాశ్మీర్‌కి అంగీకరిస్తామని ప్రకటించారు. (పేజి.407-8, 438 ).

పటేల్ గురించి పూర్తిగా అవగాహనతో రచయిత బల్ రాజ్‌క్రిష్ణ. రాసిన సర్ధార్ వల్లభాయ్ పటేల్ పుస్తకంలో నెహ్రూ కాకుండా పటేల్ అయివుంటే అతి తక్కువ సమయంలోనే కాశ్మీర్ సమస్య తీర్చేవాడు. ఎలా అంటే, కాశ్మీర్ లోయా ప్రాంతమంతా పాకిస్థాన్‌కి ఇచ్చేసి, తూర్పు పాకిస్థాన్‌ను ఇండియాలో కలిపేవాడు అని రాశాడు. దీని వలన రెండు దేశాలులాభం పొందుతాయని ఆయన భావించారు. ఆయనకు ఎందుకు ఈ సర్దుబాటు ఆలోచన వచ్చిందని ప్రశ్నిస్తే దానికి రచయిత ఒక సంభాషణను పేర్కొన్నాడు. డా.రాజేంద్రప్రసాద్, జయప్రకాష్ నారాయణతో చర్చిస్తున్నప్పుడు, పటేల్ ఇలా అన్నారు "మన పంజాబ్, సింధ్, వాయువ్య ప్రాంతాలను ఇవ్వటానికి సిద్ధపడినపుడు ఈ చిన్నలోయ ప్రాంతం మనకేమంత విలువైనది?".

ఇక మరొక ప్రముఖ చరిత్రకారుడు, గుజరాత్ రాష్ట్రానికి చెందిన వాడు, మోడీ గారికి సుపరిచితులు అయిన డా.దినకర్ జోషి రాసిన పుస్తకం, "సర్దార్-ది సావరిన్ సైంట్" లో ఇలా అన్నారు. మహారాజా హరిసింగ్ సందిగ్ధం, నాన్చుడు ధోరణిపై పటేల్‌కి అవగాహన ఉంది. భౌగోళికంగా, జనాభా పరంగా (ముస్లిం మైనా రిటి) పశ్చిమ పాకిస్థాన్‌కి చేరువలో ఉండటం. ఒకవేళ హరిసింగ్ పాకిస్థాన్ తోకల వాలని నిర్ణయిస్తే, సర్దార్‌కి వేరే ఆలోచనలు ఉన్నాయి. కాశ్మీర్‌లోయని వారికి ఇచ్చేసి జమ్ము, లధక్ ప్రాంతాలను మనకు అడగాలని సిద్ధమయ్యారు. "దీనిని మరో ప్రసిద్ధ రచయిత నరేంద్రసింగ్ సరిలా" రచించినా "దిషాడో ఆఫ్ గ్రేట్‌గేమ్-ది అన్‌టోల్డ్ హిస్టరీ ఆఫ్ పార్టిషన్", పేజి 343-4 లో భారతదేశపు ఆఖరి వైస్రాయ్ మౌంట్ బాటన్ కొన్ని సంవత్సరాల తర్వాత తనతో ఇలా అన్నాడు "నేను హరిసింగ్‌తో చెప్పాను, ఎవరితో ఉండాలో నిర్ణయించుకొనే అవకాశాన్ని నీకేవది లేస్తున్నాము, ఎందుకంటే నాకు భారతదేశంలోని నాయకులను గురించి నాకు తెలుసు. పాకిస్థాన్‌లో కలవాలని నిర్ణయించుకున్నా వారేమి తప్పుగా అర్థంచేసుకోరని చెప్పారని ఆయన రాశాడు. ఈ హామీలు ఎవరు ఇచ్చారు? నరేంద్రసింగ్ పుస్తకం ప్రకారం" పటేల్‌కు కుడిభుజంగా, సివిల్ సర్వెంట్‌గా పని చేసి, విభజన సమయంలోనూ, సంస్థానాలను విలీనంచేసే సమయంలో కీలకంగా పనిచేసిన వి.పి.మీనన్ ప్రకారం ఈ హామీలు సాక్షాత్తు అప్పటి హోం మినిష్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇచ్చారు.

దీని నిబద్ధతను మరింతగా నిరూపిస్తూ, స్వయంగా రాష్ట్రీయ-స్వయం సేవక్‌సంఘ్‌లో నెం.2గా వెలిగిన హెచ్.డి.శేషాద్రిగారే తన పుస్తకం "బాధాకరమైన విభజన" పేజి215లో .విపి మీనన్‌ను ప్రస్తావిస్తూ, కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇవ్వటానికి పటేల్‌కు ఎటువంటి అభ్యంతరం లేదు అని రాశాడు. ఇన్ని ఉదాహరణలు కూడా మోడీ గారిని, వారి భక్త బృందాన్ని ఒప్పించలేక పోతే వెంటనే వెళ్ళి ఎస్.సి.దాస్ రచించిన "ది బయోగ్రఫీ ఆఫ్ భారత్ కేసరి డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ" పేజిలు 186-7 పేజీలు చదవ మనండి. భారతీయ జనసంఘ్ ఆవిషర్త,

బి.జె.పి. దిగ్గజం అయిన ముఖర్జీ గురించి రాసిన ఈ పుస్తకంలో దాస్ "తూర్పు పాకిస్తాన్‌కు బదులుగా కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇచ్చేయటానికి సిద్ధంగా ఉన్నారని" "మరీముఖ్యంగా ఈ విషయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి, ఉక్కుమనిషి పటేల్‌కి పూర్తిస్థాయి అవగాహన కుదిరిందని" ఆయన రాసారు.


అసలు భారతదేశపు ఉక్కుమనిషి కాశ్మీర్‌ను ఎందుకు ఇచ్చేయాలని అనుకున్నాడు? ఎక్కువ మంది చరిత్రకారులు అభిప్రాయపడేది ఏమిటంటే అది పటేల్‌కున్న వ్యవహారజ్ఞానం. నెహ్రూ లాగా ఆయనకు కాశ్మీర్ అంటే ఎటువంటి ప్రేమలేదు. బహుశా ముస్లింలు ఎక్కువగాఉన్నా ఆ ప్రాంతం భవిష్యత్తులో నైనా దేశానికి ఇబ్బందిగా మారుతుందేమో నని భావించి ఉండవచ్చు. కాని అదే సందర్భంలో చరిత్రకారులు అంగీకరించిన అంశం, పాకి స్థాన్ బలవంతంగా కాశ్మీర్‌ను ఆక్రమించాలని సాయుధ బలగాలను పంపించినపుడు, విరామం ఎరుగని యోధుడిలా పటేల్ పాకిస్థాన్‌ను నిలువరించటానికి శ్రమిం చాడు. అందరికీ తెలిసిన అంశం భారతదేశపు మొదటి యుద్ధం పాకిస్థాన్‌తో 1947-48లో అర్ధంతరంగా పరిష్కారం లేకుండా ముగిసింది. ఐక్యరాజ్య సమితి కాల్పుల విరమణ ప్రకటిం చింది. జమ్ముకాశ్మీర్ విభజన ప్రకటించబడింది. ఈయుద్ధంలో బ్రిటన్ పాకిస్తాన్‌తో కుమ్మక్కైంది- ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే రెండు సైన్యాలకు నాయకత్వం వహించింది బ్రిటీషు వార సులే. మరి పటేల్ కాశ్మీర్ మొత్తం భారత్ లోకి వచ్చేవరకు యుద్ధం ఆగదని ఎందుకు ప్రకటించ లేదు అనేది ప్రశ్న?

ఈ ప్రశ్ననే మరో విధంగా చూద్దాం. అన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బి.జె.పి. పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్ భారత్‌లో భాగమేనని గట్టిగా వాదిస్తారు. కాని దానిని సాధించడానికి ఎవరి దగ్గరా ఎటువంటి కార్యాచరణ లేదు. మరి పటేల్‌కి ఏమన్నా ఉందా? దీని సమాధానం వెతికితే మోడీకి ఆయన అనుచరులకు ఆశాభంగమే కలుగుతుంది.

ఈ విషయంపై అభిప్రాయాలు వినాలంటే ఇద్దరు ప్రముఖులు, నిబద్ధత కలిగిన భారత రాయబారుల మాటలు వినాలి. చంద్రశేఖర్ దాస్ సప్తా 2002 రాసిన " వార్ ది డిప్లొమసి ఇన్ కాశ్మీర్ 1947-48 పేజి 79-80 లో సర్దార్ పటేల్ ఒక దశలో హైదరాబాద్‌లో అభిప్రాయ సేకరణకు అంగీకరిస్తేనే కాశ్మీర్‌లో కూడా అభిప్రాయ సేకరణకు అంగీకరిస్తానని

**❝ చంద్రశేఖర్ దాస్ సప్తా 2002 రాసిన " వార్ ది డిప్లొమసి ఇన్ కాశ్మీర్ 1947-48 పేజి 79-80 లో సర్దార్ పటేల్ ఒక దశలో హైదరాబాద్‌లో అభిప్రాయ సేకరణకు అంగీకరిస్తేనే కాశ్మీర్‌లో కూడా అభిప్రాయ సేకరణకు అంగీకరిస్తానని పాకిస్తాన్‌ను డిమాండ్ చేశాడు. ❞**


జవహర్‌లాల్ నెహ్రూ


సర్దార్ వల్లభాయ్ పటేల్

పాకిస్తాన్‌ను డిమాండ్ చేశాడు. అంటే కాశ్మీర్‌లో అభిప్రాయ సేకరణకు పటేల్ వ్యతిరేకం కానే కాదు. ఒక దశలో పూంచ్ ప్రాంతం నుంచి భారత సైన్యాన్ని వెనక్కి రప్పించాడు. (అభిప్రాయ సేకరణ జరపాలనే ఉద్దేశ్యంతో) ప్రజాస్వామ్యయుతంగా , చర్చలద్వారా సమస్య పరిష్కరించే విధంగా సైనిక చర్యను మధ్యలో నిలిపివేయడానికి సిద్దపడ్డాడు. కాని అటువంటిది ఏదీ జరగలేదని మనందరికి తెలుసు. కాని పటేల్ మిలటరీ చర్యలకు ఎటువంటి ఉత్సాహం చూపలేదనికొద్ది మందికే తెలుసు. దాస్ గుప్తా వ్యాఖ్యలకు మద్దతుగా 2015 వరకు ఇస్లామాబాద్‌లో భారత రాయబారిగా పని చేసిన టి.సి.యస్. రాఘవన్ రాసిన పుస్తకంలో ఉంది. ఆయన రాసిన పుస్తకానికి మంచి ప్రాచుర్యం కూడా వచ్చింది. " ద పీపుల్ నెక్స్ట్‌డోర్ - ది క్యూరియస్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ రిలేషన్స్ విత్ పాకిస్తాన్ " లో 1948 చివరికి యుద్ధం పతాక స్థాయికి చేరుకుంది. పూంచ్, లధక్,కార్గిల్ ప్రాంతాలలోని గిరిజనులు పాకిస్తాన్ సైన్యాన్ని పారద్రోల గలిగారు. కాని, పాకిస్తాన్‌కు దగ్గరలో ఉన్న ముజఫరాబాద్, మిర్పూర్‌లలో కొంత భాగం, గిల్గిట్, స్కర్దూలో కొంత భాగం పాకిస్తాన్ ఆధీనంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల నుండి వారిని తరిమి వేయాలంటే, భారీ ఎత్తున బలగాలను మోపి యుద్ధం చేయాల్సివచ్చేది. దానికి నెహ్రూ ప్రభుత్వం కాని, డిప్యూటీ ప్రధానమంత్రి పటేల్‌గాని సిద్ధంగా లేరు, అందుకు ఎటువంటి ఉత్సాహం చూపలేదు. ఇవన్నీ పటేల్ గురించి, విభజన గురించి, కాశ్మీర్ గురించి తిరుగులేని నిజాలు, సత్యాలు.

ప్రధాన మంత్రిని మనం ఈ విధంగా విద్యార్ధి కుని చేయాల్సిన అవసరం ఏమిటి? ఎందుకంటే ఇది కేవలం చర్చల కోసం, వాదనల కోసం కాదు. అప్పటి వ్యక్తుల అభిప్రాయాల సేకరణ గురించి కాదు. ఇప్పటికీ నెత్తురోడుతూ, నిరంతర సమస్యగా కొనసాగుతున్న కాశ్మీర్‌కు ఖచ్చితమైన పరిష్కారం కనుగొనాలి. లైన్ ఆఫ్ కంట్రోల్ కాల్పుల మోతతో ఉడుకుతోంది. సామాన్య పౌరులు, సైనికులు మరణిస్తున్నారు. మోడీ ప్రభుత్వం యొక్క అయోమయ విధానం అంతర్గతంగా కాశ్మీర్‌లో గాని, బహిర్గతంగా పాకిస్థాన్‌తో కాని ఎటువంటి సత్ఫలితాలు ఇచ్చేది కాదు.

అందువలన, ఇండియా కాని పాకిస్థాన్ కాని పటేల్ నుంచి ఏదన్నా నేర్చుకోవాలనుకుంటే, అది ధర్మం తెలిసిన, ఆచరణాత్మకమైన, సర్దుబాటు చేసుకొనే జ్ఞానం కలిగి ఉండటం ద్వారానే కాశ్మీర్ సమస్యకు పరిష్కారం చూపగలం అని అర్ధంచేసుకోవాలి. దాయాదుల మధ్య భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు లేకుండా ఉండేందుకు మొత్తం కాశ్మీర్‌నే అప్పచెప్పేద్దామని భావించిన నాయకుడి నుండి ఏమి నేర్చుకోవాలి.

"కాశ్మీర్‌లో ఒక్క అంగుళం కూడా ఇచ్చేది లేదు" అని బడాయికొట్టే దేశభక్తులు మాట్లాడేవి ఎంత ఆచరణ సాధ్యం కాని అంశమో, అసంగతమో స్పష్టమౌతున్నది. వారి ఆరాధ్య దైవమైన పటేల్ యొక్క జాగురూకత, సూచనలు తప్పనిసరిగా ఆలకించాలి. హెచ్.వి.శేషాద్రి రాసిన పుస్తకం పేజి 236లో పటేల్ హెచ్చరిక "వాస్తవాలను విస్మరించడం మూఢత్వం, అవివేకం. వాటిని సమత్వంతోనూ, సరియైన పద్ధతిలోనూ చూడకపోతే, అవిప్రతీకారం తీర్చుకుంటాయి.

**అనువాదం : లక్కరాజు భారవి**

ఈ మాసం ప్రత్యేకం

# పర్యావరణం కోసం పోరాటం

**జాన్ బెల్లమి ఫాస్టర్**



రచయిత
ప్రముఖ పాత్రికేయులు

**17వ** శతాబ్దంలో ప్రకృతి కొన్ని నియమిత సూత్రాల ప్రకారమే నడుస్తుందన్న దానికన్నా విప్లవాత్మక విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణే లేదు. అయితే ఆ తరువాతి కాలంలో, మనం ఆధునిక విజ్ఞాన శాస్త్రంగా చెప్పుకుంటున్న కాలంలో ప్రకృతిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం, ప్రకృతిని జయించడం, ప్రకృతిపై ఆధిపత్యాన్ని పొందడం మనుగడలోకి వచ్చాయి. పర్యావరణోద్యమం విశ్వవ్యాప్తంగా బాగా ఊపందుకున్న ఇరవైయవ శతాబ్ది వరకు ప్రకృతిని జయించటాన్ని పెట్టుబడిదారీ విధానంలో, ఒకొక్కసారి సోషలిజంలో కూడా అభివృద్ధిగా భావించేవారు, కాని పర్యావరణోద్యమ ఆద్యుడు ఫ్రాన్సిస్ బాకెన్ మాటల్లో చెప్పాలంటే "ప్రకృతి నియమాలను పాటించడం ద్వారానే దాన్ని జయించడం సాధ్యపడుతుంది."

ప్రకృతి ఆరాధకులయిన కవుల తరువాత ప్రకృతిని జయించడం అన్న ఆలోచనను అంత బలంగా వ్యతిరేకించిన వారు చారిత్రక భౌతిక వాద మూలకర్తలు మార్క్స్ ఏంగిల్స్ మాత్రమే. బాకెన్ సూత్రాన్ని గురించి స్పందిస్తూ మార్క్స్, పెట్టుబడిదారీ వ్యవస్థలో "ప్రకృతి స్వత: సిద్ధ సూత్రాలు కేవలం మానవుల అవసరాలకు అడ్డుపడే వాటిగాను, ఆధీనంలోకి తెచ్చుకోవలసిన వాటిగానే" ఉంటాయి. అయినప్పటికీ ప్రకృతి భౌతిక పరిమితులను పెట్టుబడి ఎన్నటికీ మార్చలేదు. ప్రకృతి ఎప్పుడూ తన ఆధిపత్యాన్ని చాటుకుంటూనే ఉంటుంది." ఉత్పత్తి వైరుధ్యాల మధ్య కొనసాగుతూ, తిరిగి తన స్థానాన్ని పొందుతూనే ఉంటుంది. ప్రకృతి పరిమితులను అధిగమించాల్సిన పరిధులుగా చూడడమే పెట్టుబడికి క్రియాశీలక స్వభావాన్ని సమకూరుస్తుంది. ప్రకృతి యొక్క ఈ వాస్తవ పరిమితులను పెట్టుబడి పరిగణలోనికి తీసుకోకపోవడం వలననే పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుంది. ఒక్కొక్కసారి తిరిగి పొందలేనంత విధ్వంసం, వినాశనం జరుగుతుంది. ఆ జీవన క్రియను తిరిగి నెలకొల్పాలనీ, పెంచాలనీ, భావితరాలకు నివాసయోగ్యమయిన భూమిని అందించాలని మార్క్స్ ప్రతిపాదించాడు. 1870లో "ప్రకృతి వైరుధ్యాలను చరిస్తూ, ఏంగిల్స్ పర్యావరణ పరిమితులను గురించి ఇలా వ్రాసారు.

"ప్రకృతి పై మానవుడు సాధించిన విజయాలను గురించి మనల్ని మనం మరీ ఎక్కువగా అభినందించుకోవాల్సిన అవసరం లేదు. ప్రకృతి పై సాధించిన ప్రతి విజయానికి ప్రకృతి బదులు తీర్చుకుంటుంది. ప్రతి విజయం ఊహించిన ఫలితాలిస్తుందనేది నిజమే. కాని ఈ తరువాత వచ్చే పర్యవసానాలు మన విజయాన్ని తుడిచి వేస్తాయి. అందు వలన ప్రకృతి పై విజయం సాధించడం అంటే ఓ దేశాన్ని ఆక్రమించినట్టుగా, ప్రకృతి నుంచి విడివడి మనం ఆ విజయాన్ని చూడటమేమిటని అడుగడుగునా ప్రకృతి మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. రక్త మాంసాలతో కూడుకున్నమనం, ప్రకృతిలో భాగమే; ప్రకృతి మధ్యే ఉంటాం; మనకున్న ఒకేఒక్క అదనపు సౌకర్యమేమిటంటే మిగిలిన జంతువులు ప్రకృతి సూత్రాలను అధ్యయనం చేయలేవు. అన్వయించలేవు. మనం మనుషులం ప్రకృతి సూత్రాలను అధ్యయనం చేయడంలోనూ అన్వయించడంలోనూ ప్రావీణ్యం పొందగలం.

పర్యావరణంపై మార్క్స్, ఏంగెల్స్‌ల విశ్లేషణ ఎన్నో రోజులు ఎవరికీ తెలియకుండా ఉండిపోయినా సోషలిస్టు సిద్ధాంత వేత్తలు వచ్చిన తరువాత అది వెలుగు చూసింది. అయినప్పటికీ 1930 - 50ల మధ్య సోవియట్ యూనియన్‌లో కూడా పర్యావరణం విధ్వంసం జరిగింది. 1962 లో ఛార్లెస్ కార్సన్ రాసిన సైలెంట్ స్ప్రింగ్ ప్రచురించబడే వరకు పర్యావరణోద్యమం బలపడలేదు. అందులో ఎల్లలు లేని పారిశ్రామికీకరణ, అధునాతన సాంకేతిక విజ్ఞానంతో పర్యావరణాన్ని విధ్వంసం చేయటాన్ని తీవ్రంగా విమర్శించాడు. మానవ అభివృద్ధి అంటే ఆర్థిక ఎదుగుదల మాత్రమే కాదని తీవ్రంగా విమర్శించిన తరువాతే ప్రత్నామ్నాయ విధానాలు, ప్రకృతితో అంతర్గత సంబంధాలు, ప్రకృతిలో కలిసి ఎదగడం వంటివి ముందుకొచ్చాయి. అందులో భాగమే పర్యావరణ పరిరక్షణ. విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి అయింది. ప్రస్తుతం సాధిస్తున్న అభివృద్ధి ప్రకృతి సూత్రాను ఉల్లంఘించడానికి కారణమయి అంతిమంగా మానవాళి వినాశనానికి తోడ్పడుతుందని చెప్పడం జరిగింది. జీవావరణం, భూ పరిరక్షణ విధానాలపై అధ్యయనాలు పెరుగుతుండటంతో భూమిని మానవుల లాభాపేక్షకు వాడుకోవడాన్ని వ్యతిరేకించేవారు, విజ్ఞాన శాస్త్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనుకునేవారు పెరుగుతున్నారు.

'పర్యావరణం' దృష్ట్యా చూసినప్పుడు జీవావరణం వాతావరణ సంక్షోభాన్ని మాత్రమే కాక గ్రహ సరిహద్దులకు సంబంధించి మరింతగా సృజనాత్మక, నిర్మాణాత్మక, సహ పరిణామ సంబంధాలతో కూడుకున్నది. సమాజం మరింత సమభావనతో కొనసాగేందుకు అనువుగా ఉండాలని పర్యావరణ సోషలిస్టు సిద్ధాంతం చెబుతుంది. నిరంతరంగా కొనసాగే పర్యావరణ విప్లవం అవసరం. ఇది పదుల, వందల సంవత్సరాలు కొనసాగాల్సి ఉంటుంది. కాని ఇప్పుడు భూమి మానవుల ఆవాసంగా ఉండడానికి ముప్పు ఏర్పడింది. వాతావరణ మార్పులు, సముద్రాల ఆమ్లీకరణ, కొన్ని జీవజాతులు అంతరించి పోవడం, విషవాయువులతో గాలి, నీరు కలుషితం కావటం తదితర పెట్టుబడిని గుట్టలుగా పోగు చేసుకునేందుకు అనువైన విధానాలను తక్షణమే విడనాడాలి. అంటే పెట్టుబడులు పోగుపడటం కోసం పర్యావరణాన్ని ధ్వంసం చేయటాన్ని వ్యతిరేకించాలి. భూమిపై ఎప్పుడయినా, ఎక్కడయినా "సృజనాత్మక


విధ్వంసాన్ని" ప్రోత్సహించడాన్ని వ్యతిరేకించాలి. ఈరకమయిన సమాజ పునర్నిర్మాణం పెద్ద ఎత్తున జరగాలంటే అది కేవలం సాంకేతికంగా మాత్రమే సాధ్యపడదు. ఉత్పత్తికి ప్రకృతితో మానవ జీవన ప్రక్రియతో ఉన్న సంబంధాలను, మొత్తంగా సమాజ జీవన క్రియ పునరుత్పత్తి విధానంలో మార్పులద్వారానే సాధ్య పడుతుంది.

ఏ విప్లవోద్యమం కూడా శూన్యంలో పుట్టదు. అది తననెదిరించే ప్రతీఘాతక సిద్ధాంతంతో పోరాడుతుంది. జీవావరణ పరిరక్షణ, పర్యావరణ సోషలిజం మన కాలంలో పర్యావరణ సంక్షోభానికి ఒక కీలకమయిన సవాలును విసురుతున్నాయి. ఎందుకంటే ఇది పెట్టుబడిదారీ విధానం చెప్పే ఆధునీకరణను సవాలు చేస్తుంది. ఇప్పుడున్న పెట్టుబడిదారీ విధానం, ముందునుంచీ అది అనుసరిస్తున్న విధానం ప్రకృతిని వినియోగించుకోవడానికి హద్దులు లేవని, కేవలం దాని పరిధిని పెంచుకునేందుకు మరింతగా సాంకేతికంగా అభివృద్ధి చెందవలసిన అవసరం ఉందనే వాదనను కొనసాగిస్తున్నది.

పర్యావరణం పట్ల పెట్టుబడి దారీ వ్యవస్థ యొక్క ఈ ఉదారవాదమే ఈనాడు జరుగుతున్న వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలు వగైరాలకు కారణమౌతున్నది. స్వేచ్ఛాయుతమైన ప్రపంచ మార్కెట్లు ఉన్న ఈ వ్యవస్థలోనే సామాజిక, ఆర్థిక నిర్మాణంలో ఏ మార్పులూ తీసుకు రాకుండా కేవలం సాంకేతిక అభివృద్ధితోనో, జనాభా నియంత్రణతోనో, ప్రపంచీకరణతోనో పర్యావరణ మార్పుల పెను సవాళ్ళను ఎదుర్కోగలమనే భావన ఉంది. అంటే పెట్టుబడి పోగు పడడం వలన ఏర్పడ్డ సంక్షోభాన్ని మరింతగా పెట్టుబడిని పోగుచేయటం ద్వారా ఎదుర్కోవచ్చునే వాదన ఇది. అందువలనే మనం 'కర్బన ఉద్గారాల శిఖరాన్ని' త్వరలో చేరబోతున్నాం. ఇదే క్రమం కొనసాగితే రాబోయే 20 ఏళ్ళలో లక్షకోట్ల మెట్రిక్‌టన్నుల కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి వదలబోతున్నాం.

ప్రస్తుత పరిస్థితులలో పర్యావరణ, సామాజిక విప్లవం ఎలా సాధ్యం? ప్రకృతికి అనుగుణంగానే సమాజం అభివృద్ధి చెందడమే శాస్త్రీయమైన అభివృద్ధి అని అందులో ఎటువంటి మినహాయింపులు లేవని 19వ శతాబ్దంలో ఏంగెల్స్ నొక్కి చెప్పాడు. "ప్రకృతి సూత్రాలకు భిన్నమైన స్వేచ్ఛ, స్వేచ్ఛ కాదు. కాని ఆ సూత్రాల పట్ల జ్ఞానం, వాటిని క్రమ పద్ధతిలో అన్వయించుకోవడం తెలుసుకుంటే మన గమ్యాన్ని చేరగలుగుతాం. ఈ సూత్రాలు బాహ్య ప్రకృతి విషయాలకూ వర్తిస్తాయి; మనిషి మానసిక, శారీరక సంబంధాల విషయంలోనూ వర్తిస్తాయి. ఈ రెండు సూత్రాలను, కేవలం భావనలో మాత్రమే వేరు చేయగలం కాని వాస్తవంలో కాదు. సహజమైన అవసరాలను మార్చే అడ్డదారులు కూడా ఏవీలేవు. ప్రకృతిని జయించడం అనే బెకోనియన్ వాదనతో – ప్రకృతి సూత్రాలను పాటించాల్సింది. కేవలం పెట్టుబడి పోగుపడడాన్ని అభివృద్ధి చేసేందుకే – ఏకీభవించడం వినాశనానికి దారి తీస్తుంది. అది తక్షణ లాభాలకు కారణమైనా దీర్ఘకాలంలో నష్టాలనే మిగుల్చుతుంది. అందుకు భిన్నంగా "శాస్త్రీయ సోషలిజం"లో చెప్పుకున్నట్టు, ప్రకృతిని జయించడం కన్నా ప్రపంచ భౌతిక పరిస్థితుల పరిమితులలో స్వేచ్ఛ ఇమిడి ఉందన్న వాస్తవాన్ని మనిషి అర్థం చేసుకోవటం వలననే మరింత స్వేచ్ఛను అనుభవించగలుగుతాడు.

"పర్యావరణం పట్ల పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఈ ఉదారవాదమే ఈనాడు జరుగుతున్న వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలు వగైరాలకు కారణమౌతున్నది. స్వేచ్ఛాయుతమైన ప్రపంచ మార్కెట్లు ఉన్న ఈ వ్యవస్థలోనే సామాజిక, ఆర్థిక నిర్మాణంలో ఏ మార్పులూ తీసుకు రాకుండా కేవలం సాంకేతిక అభివృద్ధితోనో, జనాభా నియంత్రణతోనో, ప్రపంచీకరణతోనో పర్యావరణ మార్పుల పెను సవాళ్ళను ఎదుర్కోగలమనే భావన ఉంది."



పర్యావరణ పరిరక్షణ గురించి హెచ్చరించిన మార్క్స్, ఏంగెల్స్

ఈనాడు ఈ సమస్యల పట్ల చైతన్యం పెరుగుతుండడం, మనిషికీ ప్రకృతికి మధ్య విడదీయరాని బంధం ఉన్నదన్న అవగాహన పెరుగుతున్న కారణంగానే శాస్త్రజ్ఞులు వ్యవసాయ పర్యావరణ శాస్త్రం, బయో కెమిస్ట్రీ, పర్యావరణం తదితరాలను అధ్యయనం చేస్తున్నారు. క్రియేటింగ్ ఎకోలాజికల్ సొసైటీ అనే పుస్తకంలో ఫ్రెడ్ మాక్ డోఫ్, క్రిస్ విలియమ్స్ ఇలా రాశారు. "సమాజం యొక్క అంతిమలక్ష్యం జీవావరణాన్ని రక్షించడం, మానవులందరి అవసరాలను తీర్చడం అని జీవావరణశాస్త్రం అంటుంది. ఇది సాధించడం అసంభవం కాదు. కాని విజ్ఞానశాస్త్రం మరో స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉంది. భూమిని యాంత్రికంగా మనకిష్టమైనట్లు మలుచు కోవడం కాదు, వ్యక్తుల స్వార్థం కోసం వినియోగించుకోడం కాదు. మొత్తం మానవ సామాజిక జీవన విధానానికి ఉపయోగించుకోవాలన్న ప్రాథమిక అవగాహన ఉండాలి. ఇందుకు జీవావరణాన్ని కాపాడుకునేందుకు ఒక ప్రణాళిక ఉండాలి. అందుకు సామాజిక సంబంధాలలో మార్పులు రావాలి. మరింత విశాలంగానూ, లోతుగానూ

**" మానవ సామాజిక సంబంధాలలో విప్లవాత్మక మార్పులు తేవడం ద్వారా పర్యావరణ సంక్షోభాన్ని మరింత మెరుగుగా, మరింత తొందరగా ఎదుర్కోగలం. పర్యావరణ మార్పు లకు సంబంధించిన అంశాలను పరిష్కరించడంలో జీవావరణాన్ని విస్మరించి యాంత్రికంగా చూపే ఏ పరిష్కారం వలనా పెద్దగా ప్రయోజనం ఉండదు."**



పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమలు

ఉండి, వ్యక్తుల వినిమయ స్వార్థపర ప్రయోజనాలకంటే మిన్నగా స్వేచ్ఛకు అర్థం ఉండాలి.

దీనర్థం మనం పర్యావరణ సంక్షోభంలో కూరుకుపోకూడదు. మానవ నాగరికతలో ఎప్పుడూ ఎరుగని రీతిలో మనిషికి ప్రకృతికీ ఉన్న సంబంధాలలో ఏర్పడ్డ అసమతుల్యాన్ని కొనసాగించకూడదు. అలా కొనసాగించడం అంటే మన గొయ్యి మనం తవ్వు కోవడం అవుతుంది. మరిన్ని అణు విద్యుత్ కేంద్రాలు నెలకొల్పడం, కాలుష్య వాయువులను పర్యావరణంలోకి జొప్పించడం వంటివి చేసి వినిమయ వస్తువుల ఉత్పత్తిని పెంచడం, పెట్టుబడిని పోగుచేయడానికి దోహదం చేయడం వలన దీర్ఘకాలంలో పర్యావరణానికి తీవ్రమైన ముప్పు వాటిల్లుతుంది. సాంకేతిక, ఆర్థిక అంశాలను పక్కన పెట్టే ఇటువంటి వాటివల్ల దీర్ఘకాలంలో తప్పనిసరిగా ఏర్పడే అంతులేని ముప్పును దృష్టిలో పెట్టుకోవాలి. పర్యావరణ సంక్షోభానికి సిసిఎస్ సాంకేతిక పరిజ్ఞానం ఓ పరిష్కారంగా ముందుకొచ్చింది. తాత్కాలికంగా ఇది పరిష్కారాన్ని చూపిస్తున్న మాట నిజమే. కాని దేశ వనరులలో అధిక భాగాన్ని దానికి ఉపయోగించడం వలన సామాజిక, ఇతర పర్యావరణ పర్యవసానాలను ఎదుర్కోవలసి వస్తుంది.

మానవ సామాజిక సంబంధాలలో విప్లవాత్మక మార్పులు తేవడం ద్వారా పర్యావరణ సంక్షోభాన్ని మరింత మెరుగుగా, మరింత తొందరగా ఎదుర్కోగలం. పర్యావరణ మార్పులకు సంబంధించిన అంశాలను పరిష్కరించడంలో జీవావరణాన్ని విస్మరించి యాంత్రికంగా చూపే ఏ పరిష్కారం వలనా పెద్దగా ప్రయోజనం ఉండదు. సామూహిక అభివృద్ధికి కట్టుబడకుండా, ఉత్పత్తి వినిమయాలలో జీవావరణ వాస్తవాలను పరిగణలోనికి తీసుకోకుండా 21వ శతాబ్దంలో మానవుడు ముందుకు పోలేడు.

ఇక్కడ మనం గమనించవలసినముఖ్యమైన విషయం ఏమిటంటే ఈనాటి ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపత్యం వలన ఉత్పత్తిలో అధికభాగం అనవసరంగా, విచ్చలవిడిగా వాడబడుతున్నది. సైనికీకరణ, మార్కెటింగ్‌లో అసమర్థత, ప్రణాళికా బద్ధంగానే వస్తువులను కనుమరుగు చేయడం అన్నది ప్రతి వస్తువు ఉత్పత్తిలో అంతర్భాగంగా ఉన్నది. మనుషులకు కావాల్సిన అసలైన, అవసరమయిన వస్తువులకు బదులుగా అవసరం లేని, పాడయిపోయే వస్తువులు అందుబాటులోకి తేబడుతున్నాయి. పాల్.ఏ.బారన్ అనే మార్క్సిస్టు అర్థికవేత్త మాటల్లో "ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపత్యంలో ప్రజలు, అవసరమైనవి కోరుకోరు, కోరుకున్నవాటి అవసర ఉండదు' అనే సంస్కృతి వైపుకు నెట్టి వేయబడతారు. భౌతికంగా ఆహారం, ఇల్లు, బట్టలు, పరిశుభ్రమయిన నీరు, గాలిలాంటి కనీసావసరాలతో పాటు ప్రేమ, కుటుంబం, మంచి పరిసరాలు, ఇష్టమయిన పని, విద్య, సాంస్కృతిక జీవనం, అందుబాటులో ప్రకృతి, అందరికీ సమాన, స్వేచ్ఛాయుతమయిన అభివృద్ధి మనిషికి అవసరం. మరిన్ని లాభాలకోసం, మరింత సంపద పోగుపడం కోసం పెట్టుబడిదారీ విధానం వీటన్నింటినీ విపరీతంగా కుదించివేస్తుంది. ఒక్క అమెరికాలోనే ఒక సంవత్సరంలో లక్షకోట్ల డాలర్లు సైనికీకరణకు, మార్కెటింగ్‌కి వినియోగిస్తున్నారు. మార్కెటింగ్ అంటే ప్రజలకు అవసరం లేని వస్తువులను అంటగట్టడమే. ప్రస్తుతం పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి యాంత్రీకరణలో మార్పులు, నూతన ఆవిష్కరణలు అవసరమనడంలో ఎటువంటి సందేహాలు ఉండనవసరం లేదు. ఇవి మాత్రమే సరిపోవు. పెట్టుబడిదారీ సామాజిక సంబంధాలు కొనసాగితే ప్రపంచ పర్యావరణ సంక్షోభానికి తెరపడదు. పర్యావరణ రక్షణకు స్థాపించే దేనిలోనైనా పెట్టుబడి పోగుపడడాన్ని వ్యతిరేకించే అంశాలు ఉండాల్సిందే. రాజ్యమే పెట్టుబడులు పెట్టి, పెట్టుబడిదారునిగా వ్యవహరించినా సమస్య పరిష్కారం కాదు. ప్రపంచ అవసరాలకు తగ్గ ఒక దీర్ఘకాల పర్యావరణ విప్లవం, ప్రకృతికి, మానవ సమాజానికి ఉన్న బంధాన్ని సానుకూలంగా మార్చే విధంగా, పెట్టుబడిదారీ విధానంలో ప్రకృతికి మానవశ్రమకు ఉన్న ప్రతికూల సంబంధాన్ని మార్చేదిగా ఉండే విధానం అవసరం. భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించే విధంగా ఈనాడు మన విధానాలు రూపొందించబడాలి.

అందుకిప్పుడు అనేక కార్యక్రమాలు చేయవచ్చు. మానవ సమూహం పర్యావరణ సమాజంగా మార్చవచ్చు. ఇప్పుడు ద్రవ్య

పెట్టుబడి గుత్తాధిపత్యంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులను భూమి భరించగల స్థాయికి కుదించవచ్చు. కర్బన ఉద్గారాల విడుదలను నియంత్రించవచ్చు. తద్వారా జీవవైవిధ్యానికి, మానవ సంస్కృతికి కలుగుతున్న విఘాతాన్ని నివారించవచ్చు.

మార్క్సిస్టు పర్యావరణ వేత్తలు మానవ స్వేచ్ఛకు, సృజనాత్మకతకు ఎన్నో దారులు చూపిస్తున్నారు. మానవులందరూ కలిసి పర్యావరణాన్ని గట్టి పునాదులలో తిరిగి నిర్మించాలని కోరుకుంటున్నారు. పెట్టుబడి దారులు ప్రకృతిని జయించడం అన్నది రాజకీయ కోవిదులకు, యాజమాన్య నిపుణులకే పరిమితం. ఇవి కేవలం సామాజిక పర్యావరణ సంక్షోభ నివారణను, ప్రస్తుత ఉత్పత్తి సంబంధాలలో రావలసిన విప్లవాత్మక మార్పుల అవసరాన్ని మరుగు పరచడానికే ఉపయోగపడతాయి. ఉత్పత్తిశక్తులను అధునీకరించడమే సరిపోదు. మానవాభివృద్ధిని స్థిరీకరించడానికి అవసరమయిన పరిస్థితులను ఏర్పరచడం అంతకన్నాముఖ్యమయినది. సాంప్రదాయకంగా భూమిని వినియోగించే తీరు నుండి ఎన్నోవిషయాలు నేర్చుకోవచ్చు. ఎందుకంటే పెట్టుబడిదారీ విధానంలో సమాజం భూమి నుండి వేరుపడిపోయింది. అందువలన ఇంకా వేరుపడని సమాజాల అలవాట్ల నుండి స్థిరమయిన మనుగడకు అవసరమయిన మెళుకువలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది.

మితవాదులు, అతివాదులు కూడా ఇప్పటికే చాలా ఆలస్యమయిందని పెదవి విరవవచ్చు. "దేనికి చాలా ఆలస్యమయిందట? మరో మంచి ప్రపంచం కోసం పోరాడడమంటే ప్రపంచాన్ని యధాతథంగా తీసుకుని, దాన్ని మార్చే ప్రయత్నం చేయడమే. పర్యావరణ, రాజకీయ పరిస్థితులు, ధోరణులు ఎన్నో రకాలుగా ఆందోళనలు కలిగిస్తున్నప్పటికీ పర్యావరణాన్ని గాని, సామాజిక పరిస్థితులను గాని దిగజరుస్తూనే ఉండాలని మనం అనుకోవడం లేదు. కొంత మేరకు వాతావరణ వేడిమి కొనసాగుతూనే ఉంటుంది. ఎంత ప్రయత్నించినా వాటి పర్యవసానాలు మనం ఎదుర్కోవలసిందే. అయితే భూమి పరిస్థితి మరింత దిగజారకుండా మనం ఆపగలం. జీవరాశులు అంతరించకుండా, ఉన్న వాటి ఆరోగ్యం ప్రమాదంలో పడకుండా చూడగలం. ప్రజలందరి ఆర్థిక ప్రయోజనాల కోసం మానవ, భౌతిక వనరులను వినియోగించగలం. పెట్టుబడిదారీ సమాజం చెయ్యలేని ఈ పనిని ఒక జీవావరణ సమాజం చేయడానికి అవకాశం కల్పిస్తుంది. ఇందుకు ప్రజలందరి సహకారం తప్పనిసరి" అని మెక్‌డోఫ్, విలియమ్స్ అందుకు సమాధానంగా చెప్పారు.

**"అయితే భూమి పరిస్థితి మరింత దిగజారకుండా మనం ఆపగలం. జీవరాశులు అంతరించకుండా, ఉన్న వాటి ఆరోగ్యం ప్రమాదంలో పడకుండా చూడగలం. ప్రజలందరి ఆర్థిక ప్రయోజనాల కోసం మానవ, భౌతిక వనరులను వినియోగించగలం. పెట్టుబడిదారి సమాజం చెయ్యలేని ఈ పనిని ఒక జీవావరణ సమాజం చేయడానికి అవకాశం కల్పిస్తుంది."**



వాయు కాలుష్యం ముట్టడిలో ఢిల్లీ నగరం

అయితే దీనిని సాధించేందుకు ఇప్పుడున్న పెట్టుబడిదారి తర్కం పనికిరాదు. పూర్తిగా భిన్నమైన తర్కం కావాలి. భిన్నమైన సామాజిక, జీవావరణ పునరుత్పత్తి వ్యవస్థను సృష్టించేందుకు సిద్ధపడాలి. ప్రకృతి నుండి వేరుపడి ప్రపంచ పర్యావరణాన్ని వినియోగించే విధానాన్నుండి – వర్గ, లింగ, జాతి, ప్రాంతాల వారీగా విభజించబడిన సమాజం గెలిచేందుకు సాధనాలుగా దోపిడీ, దుర్వినియోగం ఉపయోగపడుతున్న నేటి పరిస్థితిలో ఒక విప్లవాత్మక పర్యావరణ మార్పు అవసరం. జీవావరణ సోషలిజం వైపుకు ఒక విప్లవాత్మక పోరాటం సాగాలి. ఇది పెట్టుబడి దారీ వ్యవస్థకు దాని పరిమితులను తెలియజెప్పగలగాలి. పర్యావరణ పరిరక్షణ కోసం తిరుగుబాటుకు ప్రేరణ శ్రామిక వర్గంలో తప్పని సరిగా ఉండి తీరుతుంది. ఆర్థిక, పర్యావరణ సంక్షోభాలపై శ్రామిక జన సమూహాలు సమైక్య ప్రతిఘటన చేయాలి. ఇదిప్పటికే, ముఖ్యంగా ప్రపంచ దక్షిణ భాగంలో మొదలయింది. సుదీర్ఘ పర్యావరణ విప్లవం మన ముందుంది. ప్రపంచం ఒక దాని తరువాత ఇంకొక పోరాటం చేయవలసి ఉంటుంది. పెట్టుబడి పోగుబడే క్రమంలో మానవునికి, ప్రకృతికి మధ్యనున్న సామాజిక – జీవావరణ, జీవక్రియ దూరం పెరుగుతుందని మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో చెప్పారు. ఏ కొద్దిమంది ఆర్థిక ప్రయోజనాల కోసమో మానవులంతా పనిచేసినట్టయితే భూమిపై జీవరసాయన ప్రక్రియల మధ్య దూరం పెరిగి వినాశనానికి దారి తీస్తుంది. అందువలన మరో మార్గం వెతుక్కోవడం తప్పనిసరి. ఆ మార్గం స్థిరమైన మానవాభివృద్ధికి తోడ్పడాలి. ఇదే మన కాలంలోని సంపూర్ణ విప్లవం.

**అనువాదం : కె. ఉషారాణి**

# చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు



రచయిత
ప్రముఖ పాత్రికేయులు

**జియా ఉస్ సలామ్**

మధ్యయుగానికి చెందిన ముస్లిమ్ పాలకుల మీద హిందూ మతోన్మాదులు చేస్తున్న దాడులు, చరిత్రలో జరిగిన దానిని తిరగరాయటానికి మాత్రమే కాక, ప్రస్తుత పరిస్థితులలో కూడా దానిని అన్వయించి, ముస్లింలను, వారి సాంప్రదాయాలను అపహాస్యం చేసే విధంగా ఉంది.

దాదాపు రెండు సంవత్సరాల క్రితం డా.అబ్దుల్ కలామ్ మరణించిన తరువాత, సాంప్రదాయం ప్రకారం ఆయనకు గొప్పగా నివాళులు అర్పించటానికి నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వం వెనకడుగు వెయ్యకుండా నిలబడింది. ఒక కేంద్రమంత్రి చెప్పినదాని ప్రకారం "అబ్దుల్ కలామ్" గారు ముస్లిమ్ అయినప్పటికీ ఆయన దేశ భక్తుడు. కాబట్టి, ఢిల్లీ నడిబడ్డున ప్రముఖులు నివసించే ప్రాంతంలో ఒకరోడ్డుకి ఆయన పేరు పెట్టారు. ఇక్కడ ఒక మతలబు ఉంది. ఔరంగజేబు రోడ్డుని అబ్దుల్ కలాం రోడ్డుగా మార్చారు. కాలక్రమంలో వీరు తీసుకువచ్చిన మంచి ముస్లీం చెడు ముస్లీం సిద్ధాంతం ప్రకారం ఇలా చేశారు. ఔదార్యం, దాతృత్వం కలిగిన, జాతీయవాదులైన ముస్లీంలు, వారికి ఆవలివైపున మతోన్మాదులు. ఈ రోడ్డు పేరు మార్చును కొంత మంది ప్రశ్నించారు.

ఇప్పుడు అసలు మంచి ముస్లీం, చెడు ముస్లీం అనే సిద్ధాంతానికి కూడా సమాధి కట్టే శారు. మంచి ముస్లీం అనే వాడు గత చరిత్రలో లేనేలేడని హిందూమతోన్మాదులు నమ్మబలుకు తున్నారు. లేదా తమ నిరంతర దాడితో ముస్లీం హీరోలందరిని చెడుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సంవత్సరం మొదటి భాగంలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రి రాజనాథ్‌సింగ్ గార్లు చిత్తోర్‌గఢ్ ప్రాంతంలో జరిగిన ప్రముఖ యుద్ధంలో విజేత గా రాణాప్రతాప్ నిలిచాడని ప్రకటించారు. మీడియా కూడా వారి మాటలను అక్షరం పొల్లు పోకుండా ప్రచురించింది. చరిత్ర గురించి మాట్లాడుతున్న వారి సమర్థతను ఎవరూ ప్రశ్నించలేదు. అలాగే చరిత్రను మార్చి వేస్తున్న వారి చర్యలనూ ఎవరూ ప్రశ్నించటం లేదు. అక్బరు చిత్తోర్‌గఢ్ యుద్ధంలో గెలిచాడని వామ పక్ష, మితవాద చరిత్రకారులు కూడా అంగీ కరించిన చారిత్రక సత్యం. అందరినీ కలుపుకొని దేశంలోని ప్రజానుకూలంగా పాలన చేసే విధంగా అక్బర్ రాజపుత్రులతో ఒప్పందం చేసుకున్నాడని, ఆ విధంగానే పరిపాలించాడని చరిత్ర చెబుతున్నది. రాణాప్రతాప్ యొక్క వీరోచిత పోరాట పటిమను చరిత్ర పుస్తకాలలో ప్రశంశించాయి గాని, ఆయన విజయాన్ని కాదు. అయినా యోగి ఆదిత్యానాథ్ రాజనాథ్ సింగ్‌లు భాదించింది వేరొకటి అది రాజపుట్ రాజ్ ఇదంతా వారికి రాజపుత్రుల మీద ఉన్న ప్రేమవలన కాక, అక్బరు, ముస్లింలంటే ఉన్న వ్యతిరేకత వలన ఇదంతా చేస్తున్నారు. ఈ పేరు మార్చగానే ఒక బిజెపి నాయుకుడు ఢిల్లీలోని అక్బరురోడ్డును రాజపుత్ర యువరాజు పేరుమీద మార్చాలని డిమాండ్ చేశాడు. హిందువులు, ముస్లిముల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేసిన అక్బరు ఈనాడు నాయకుడి స్థానాన్ని కోల్పోతున్నాడు. ఆధునిక సమాజంలో భారతీయులందరు మతాలకు అతీతంగా అక్బరును తక్కువగా చూసే పరిస్థితులను సృష్టించటానికి ప్రయత్నిస్తున్నారు. ఐక్యత కోసం ఆయన చేసిన పనులు హిందుత్వ శక్తులకు శాపంగా మారుతున్నాయి. వారి వినాశక రాజ కీయ విధానాలకు ఈ చర్యలు అద్దం పడుతున్నాయి.

ఈ రోజు అంతర్జాలం విశ్వవ్యాప్తం అయింది. వాటిని ఉపయోగించుకుని మిత వాదులు అక్బరునే కాదు. షాజహాన్, హుమాయూన్, అల్లాఉద్దీన్ ఖిల్జీలను కూడా వదలటం లేదు. ఇంతేకాదు టిప్పుసుల్తాన్‌ను కూడా దేశద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. టిప్పుసుల్తాన్‌ను రేపిస్టు, హంతకుడని ఒక బిజెపి మంత్రి ప్రకటించారు. టిప్పుసుల్తాన్ వారసులు కోర్టుకి వెళతామని బెదిరించేసరికి తగ్గారు. విచిత్రమేమిటంటే సామ్రాజ్యవాద బ్రిటీష్ ప్రభుత్వాన్ని పారద్రోలే ప్రక్రియలో ఎటువంటి పాత్రలేని హిదుత్వ మితవాదులు బ్రిటిష్ వారిని ఎదురించి పోరాడిన టిప్పుసుల్తాన్ ను ద్రోహిగా చిత్రీకరించే పనిచేస్తున్నారు.

బిజేపి నాయకుడు సంగీత్‌సోమ్ తాజ్ మహల్ ఒక దేశద్రోహియొక్క పని అని పేర్కొనగా వినయ్‌కటియార్ మరింత ముందుకు వెళ్ళి అది ఒక తేజో మహాలయమని, శివుని ఆలయమని ప్రకటించారు. సంగీత్‌సోమ్ చరిత్రపై అవగాహన లేక షాజహాన్ తన సొంత తండ్రినే నిర్బంధించిన వ్యక్తి అని పేర్కొన్నాడు. షాజహాన్‌కి ఔరంగజేబుకి తేడా తెలియని జ్ఞానం ఆయనది. పి.ఎన్.ఓక్ 1960 కాలంలో లేవనెత్తిన అశాస్త్రీయ అంశాలే వీరు ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఆ రోజుల్లో ఆయన తాజ్‌మహల్ ఒక గుడి అని ఢిల్లీ జామామసీదు కూడా విష్ణుమూర్తి గుడి అని కుతుబ్‌మినార్ కూడా విష్ణు ధ్వజస్తంభమని ప్రచారం చేశారు. కాని ఆయన ఏ చరిత్రకారుడిని కూడా ప్రభావితం చేయలేక పోయాడు. రామజన్మభూమి, బాబ్రీ మసీదు అంశం తెరమీదకి వచ్చినప్పుడే ఆయన పేరు వినిపిస్తుంటుంది. కాని నేటి వినాశకర మితవాద రాజకీయాలలో ఆయన మాటలతో మళ్ళీ ఊతం వస్తుంది.

వీళ్ళ ప్రకటన వలన జరిగిన నష్టాన్ని పూడ్చటానికి, యోగి గారు వెంటనే ఆగ్రాకు పరిగెత్తి తాజ్‌మహల్ భారతీయ శ్రామికుల చెమటతో నిర్మించిన అద్భుత కట్టడమని దానిని కాపాడే భాద్యత యూపి ప్రభుత్వం చూసు కుంటుందని ప్రకటించాల్సి వచ్చింది. కాని అదే

**"ఇటీవల కర్ణాటక విచ్చేసిన రాష్ట్రపతి టిప్పసుల్తాన్‌ను ఒక గొప్ప దేశ భక్తుడే కాకుండా బ్రిటీష్ వారిని ఎదురించిన వీరునిగా కీర్తించారు. తద్వారా తొలితరం స్వాతంత్ర్య పోరాట వీరుల్లో టిప్ప ఒకడని తెలియజేశారు. టిప్పసుల్తాన్ బ్రిటీష్ వారితో పోరాడుతూ వీరోచిత మరణం పొందారు. రాకెట్లను తయారు చేయడంలో వాటిని యుద్ధంలో వినియోగించడంలో ఆయన ప్రావీణ్యతను కొనియాడారు."**

సందర్భంలో ఆయన తాజ్‌మహల్ కట్టించిన షాజహాన్ గురించి కాని షాజహాన్ భార్య అర్జుమండ్ బానో కొరకు నిర్మించిన ముంతాజ్ మహల్ గురించి కాని మాట్లాడకుండా జాగ్రత్త పడ్డాడు. అదే విధంగా అన్ని మతాల్లోనుంచి వచ్చిన కళాకారులు, శిల్పులు, వృత్తి దారులు అందరు కలిసి తాజ్‌మహల్ ని నిర్మించారన్న విషయాన్ని పక్కన పెట్టేశారు. ఉదాహరణకి సమాధి కట్టించిందిమక్రమత్‌ఖాన్ నేతృత్వంలో దీనికి ముఖ్య రూపకర్త టర్కీకి చెందిన మహమ్మద్ ఇసాఅఫెండీ. ప్రముఖ శీర్షిక రచయిత మరియు పుస్తక రచయిత శ్రీ ఆర్.వి.స్మిత్ తాజ్‌మహల్ మధ్య వాస్తవికత అనే పుస్తకంలో ఈ సమాధిని నిర్మించింది ఇస్మాయిల్ ఖాన్ (టర్కీదేశస్థుడు) సమాధిమీద పొందుపర్చిన వాటిని షిరాజ్‌కి చెందిన అమనత్‌ఖాన్ చేసాడని, అంతర్భాగంలో చేసిన అందమైన అలంకారం కనౌజ్ కి చెందిన హిందు శిల్పులు చేశారని, కొంతభాగం బాగ్దాద్ నుంచి వచ్చిన వారు చేశారని తెలిపారు. మధ్య ఆసియా, కొన్ని ఇతర ప్రాంతాల నుండి , అలాగే మన దేశం నుండి ముడి సరుకు సరఫరా జరిగిందని పేర్కొన్నారు.

తాజ్‌మహల్ పైన రేపబడిన దుమారం పై ముఖ్యమంత్రి తప్పని సరి పరిస్థితుల్లో సర్దుబాటు చేయడం లోపభుయిష్టంగా ఉన్నప్పటికీ దాని వెనుక ఆర్థిక కోణంకూడా ఉంది. దేశంలో ఏ పురావస్తు కేంద్రం ఇవ్వనంత ఆదాయం తాజ్‌మహల్ యు.పి ప్రభుత్వానికి ఇస్తుంది. 2014 లో తాజ్‌మహల్ మీద రేగిన మంటలు చల్లార్చడానికి యోగి ప్రయత్నించగా టిప్పుసుల్తాన్ మీద చెలరేగిన వారికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేరుగా సమాధానం చెప్పారు. ఇటీవల కర్ణాటక విచ్చేసిన రాష్ట్రపతి టిప్పుసుల్తాన్‌ను ఒక గొప్ప దేశ భక్తుడే కాకుండా బ్రిటీష్ వారిని ఎదురించిన వీరునిగా కీర్తించారు. తద్వారా తొలితరం స్వాతంత్ర్య పోరాట వీరుల్లో టిప్పు ఒకడని తెలియజేశారు. టిప్పుసుల్తాన్ బ్రిటీష్ వారితో పోరాడుతూ వీరోచిత మరణం పొందారు. రాకెట్లను తయారు చేయడంలో వాటిని యుద్ధంలో వినియోగించడంలో ఆయన ప్రావీణ్యతను కొనియాడారు. ఈ టెక్నాలజీనే తరువాత కాలంలో యురోపియన్లు అనుసరించారని కూడా రాష్ట్రపతి తెలియజేశారు.

హుమాయూన్ సమాధిని కూడా పడ వేయాలని డిమాండ్ రేగింది. ఉత్తరప్రదేశ్ షియా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ వసీమ్ రిజ్వీ ఈ కోరిక కోరారు. హిందుత్వ శక్తులకు లొంగిపోయిన ఆయన అలా కోరటంలో అశ్చర్యమేమీ లేదు. అదేవిధంగా మాలిక్ మోహమ్మద్ జయశీ అనే ఆయన పద్మావత్ ఆధారంగా రాసిన కట్టుకథలో అలాఉద్దీన్‌ఖిల్జీని ఒక దుర్మార్గమైన నరహంతకుడిగా చిత్రీకరించారు. ఆయన అందించిన ఓడిదుడుకులు లేని పాలనా విధానం, సమానత్వాన్ని పెంపొందించటం గురించి ఏమీ రాయలేదు.



టిప్పు సుల్తాన్

### గతాన్ని తిరగరాయటం

మధ్యయుగాల నాటి ముస్లీం పాలకుల ప్రాధాన్యతను తగ్గించి చూపటానికి జరుగుతున్న ప్రయత్నమిది. ప్రముఖ చరిత్రకారుడు హర్బన్స్ ముఖియా ఇలా అన్నారు" సంఘ్‌పరివార్ గతాన్ని మార్చి రాయటం లేదు. ప్రస్తుత పరిస్థితులను మార్చి వేయటానికి, రంగులు దిద్దటానికి ప్రయత్నిస్తోంది. అర్థ విద్యావంతులైన వారి ఎమ్.ఎల్.ఏలు, మంత్రుల ప్రకటనలు, మాటలు బట్టి చరిత్ర మీద వీరి కున్న పట్టు ఎంత లోపభుయిష్టమో అర్థమవుతుంది. కాకపోతే వీరుమాట్లాడేది పత్రికలలోను, మీడియాలో కనిపిస్తూ ఉంటాయి. వారి ప్రకటనలు ఎప్పుడూ ముస్లీం పాలకుల మీద, ముస్లీం శిలాఫలకాల పైనే ఉంటాయి. తప్ప పరదేశీయులచే నిర్మించబడిన రాష్ట్రపతి భవన్ మరియు దక్షిణ, ఉత్తర బ్లాకులు గురించి ఉండదు. వీరి లక్ష్యమంతా ముస్లీం పాలకుల మీద వ్యతిరేకతను పెంచటం, దేశంలో ఉన్న ముస్లీంలపై వ్యతిరేకతను పెంచడం కోసం దానిని వినియోగించుకోవటం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అసలు లక్ష్యం నేడు దేశంలో ఉన్న ముస్లిములను భ్రష్టు పట్టించడం.


ఔరంగజేబును ఎల్లప్పుడు విమర్శించే వారు, అతన్ని ఒక విలన్ లాగా చూపుతున్నారు. సరే మరి అక్బర్ కాని, టిప్పు కాని అలా లేరు కదా. వారి ప్రాంతాలలో శాంతికి చిహ్నంగా, సమైక్యతా సాధకులుగా పరిపాలించారు. మరి ఔరంగజేబుతో సమానంగా వారిపై కూడా దాడి చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటి? హర్బన్స్ ముఖియా ప్రకారం అక్బర్‌ని, టిప్పు సుల్తాన్‌ని లక్ష్యం చేసుకోవడం ద్వారా ముస్లీం లందరూ ఒకే విధమైన వారని , మంచివారు, చెడ్డవారంటూ తేడా లేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖలు, ప్రజలలో ప్రచారం చేయటం వారి ప్రధాన లక్ష్యం. ముస్లీం రాజులందరూ హిందువులను అణచి వేశారని, ఇక ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవడం మనవంతు అని ఆర్‌యస్‌యస్ ఏర్పడినప్పటి నుండి ప్రచారం చేస్తున్నారు. చరిత్రలో సాక్ష్యాలతో నిలిచిన వాటి మీద, ఒక అక్బర్, ఒక తాజ్‌మహల్, మరే దైనా సరే వారేం వాగినా మన భయపడాల్సిన పని లేదు. కాని ముస్లీంలపై ఏకపక్షంగా దాడి చేస్తున్నప్పుడు, తద్వారా సామాజిక, సాంస్కృతిక రాజకీయ రంగాలలో ముస్లీంలు, హిందువుల మధ్య తగాదాలు సృష్టించే పరిస్థితులు వస్తే మనం ఖచ్చితంగా స్పందించాలి. ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటి ఛైర్మన్ , చరిత్ర విభాగపు పెద్దాయన అలీనదీమ్ రిజ్వి ప్రకారం, ఇవాళ జరుగుతున్న ప్రచారం గురించి ఆశ్చర్యమేమీ లేదు. మొత్తం ముస్లీంలను చెడ్డవారిగా చిత్రీకరించడానికి ముస్లిం పాలకులందరినీ చెడ్డగా చిత్రీకరిస్తున్నారు. ఈ హిందుత్వ శక్తులు మత సామరస్యం కోరేవారిని అంగీకరించరు. అందుకే వారికి అక్బర్, టిప్పు శత్రువులయ్యారు. సామరస్యం కోరిన ఇటువంటి వారు ఉన్నంతకాలం

> **“ అక్బరు హిందూయిజానికి, ఇస్లాముకి వారధి నిర్మించడానికి పర్షియన్ పుస్తకాలు సంస్కృతంలోకి తర్జుమా చేయమని ఆదేశించాడు. తద్వారా రెండు మతాల వారు ఒకరి నొకరు అర్థం చేసుకోవడం తేలికవుతుందని భావించాడు. ఎట్టి పరిస్థితులలోను ఈ రకమైన ఆలోచన విధానాన్ని వ్యతిరేకించటం బిజెపి లక్ష్యం. ”**

మతోన్మాదులు చెడ్డవారుగానే మిగిలిపోతారు. అందువలన వీరిని చెడ్డవారిగా చిత్రీకరిస్తేనే మతోన్మాదులకు మనుగడ ఉంటుంది.

పాకిస్తాన్‌లో కూడా చరిత్రని ఈ రకంగా వక్రీకరించడం ద్వారా ఏ విధంగా రాజకీయ లబ్ది పొందుతున్నారో ఆయన చెప్పుకొచ్చారు. హిందుత్వవాదులే కాదు, ముస్లిం మతోన్మాదులు కూడా పాకిస్తాన్‌లో ఇదే పని చేశారు. అక్బర్ మత సామరస్యం పాటించాడు కాబట్టి పాకిస్తాన్‌లో కూడా అయనను వెలివేశారు. పాఠ్యపుస్తకాలలో, సిలబస్‌లలో ఆయన చరిత్రను మొత్తం తొలగించేశారు.

ఇక టిప్పు విషయం. సావర్కర్ బ్రిటీషు వారితో కుమ్మక్కయ్యాడు. కాని టిప్పు సుల్తాన్ ఆలోచనా పరుడు బ్రిటీష్ వారిని తరిమి వేయ డానికి నెపోలియన్ బోనపార్టీని రమ్మని లేఖ పంపించాడు. అందుకనే మోడీగారి బి.జె.పి అక్బర్‌ను, టిప్పును మసిపూసే ప్రయత్నం చేస్తు న్నాయి. అక్బరు హిందూయిజానికి, ఇస్లాముకి వారధి నిర్మించడానికి పర్షియన్ పుస్తకాలు సంస్కృతంలోకి తర్జుమా చేయమని ఆదేశించాడు. తద్వారా రెండు మతాల వారు ఒకరి నొకరు అర్థం చేసుకోవడం తేలికవుతుందని భావిం చాడు. ఎట్టి పరిస్థితులలోను ఈ రకమైన ఆలోచన



అబ్దుల్ కలామ్

విధానాన్ని వ్యతిరేకించటం బిజెపి లక్ష్యం. అక్బర్ కాలం నాటి హిందూ సమకాలీనులు మాత్రం ఆయనను విష్ణుమూర్తి మరో అవతారంగా భావించారు. అక్బరు కాలంలోనే మహాకవి సూరదాసు కావ్యాలను రచించాడు. శ్రీ చైతన్య మహాప్రభు వర్గం ఆర్భవించింది. మధురానగరం ఒక పుణ్యక్షేత్రంగా వెలుగొందింది. ఇదంతా సామాన్యులందరికీ తెలిసే విధంగా ప్రచారం అవటాన్ని బి.జె.పి ఎందుకు అంగీకరిస్తుంది? అందుకే ఎలాగయినా దీనిని భ్రష్టు పట్టించాలి.

అందుకే చరిత్రను పూర్తిగా మార్చివేసి దాని స్థానంలో కట్టుకథలు అల్లటానికి గట్టి ప్రయత్నం జరుగుతుందని రిజ్వి అన్నారు. ఇది చరిత్రని తిరగ రాయటం కాదు. గతాన్ని ఇంకో కోణంలో చూపించటంకాదు. అసలు లేనటువంటి చరిత్రను కట్టుకథలతో సృష్టించే ప్రయత్నం. దీనికి ఎటువంటి ఆధారాలు ఉండవు. నిజానికి వీరికి ఎటువంటి చారిత్రక ఆధారాలు అవసరం లేదు. మొత్తం కట్టుకథలే కాబట్టి చరిత్రకారుల అవసరం కూడాలేదు. వారే సొంత చరిత్రకారులను సృష్టిస్తారు. పి.ఎన్.ఓక్ అసలు చరిత్రకారుడే కాదు. ఆయన ఒక జర్నలిస్టు. అలాగే సమాచార శాఖలో ఒక ఉద్యోగి. ఆయన ప్రతిపాదించిన అద్భుత కల్పనను ఆఖరికి హిందూ మతోన్మాద శక్తులు కూడా స్వీకరించలేదు. ఇప్పుడు ఆయనకు శీతలగిడ్డంగిలోంచి బయటికి లాగి ప్రొఫెసర్ ఓక్ అని, చరిత్రకారుడు అని ప్రచారం మొదలు పెట్టారు.

ఒకటి మాత్రం నిజం. వీటి ప్రామాణికత సంగతి ఎలాఉన్నా, చారిత్రక కట్టడాలపై వీరు రేపిన దుమారం నేడు వాటి భద్రతకు ప్రమాదంగా మారింది. బాబ్రీ మసీదు కూల్చి 25 సంవత్సరాలు అవుతున్నా, ఆ జ్ఞాపకాలు ఇంకా కళ్ళముందే కదలాడుతున్నాయి. హుమాయూన్ సమాధి, తాజ్‌మహల్ భద్రత గురించి ఆందోళన చెందే పరిస్థితి ఉంది. కాని రిజ్వి అభిప్రాయం ప్రకారం,చరిత్రను ఎవ్వరు నాశనం చేయలేరు. తయారుచేయలేరు. కొద్దికాలం పాటు ఇటువంటి కట్టుకథల ప్రభావం పడవచ్చు. కాని దీర్ఘకాలం పాటు నిజాన్ని కప్పిపెట్టలేరు.

హిట్లర్ కూడా చరిత్రను తిరగరాసినా కొన్నాళ్ళే సఫలీకృతడయ్యాడు. అంతకు ముందు ఉమయిద్స్ కూడా ప్రయత్నించి,విఫలమయ్యారు అలాగే హిందుత్వమతోన్మాదులు కూడా ఓడి పోకతప్పదు. కాకపోతే నాకుకూడ భయంఉంది. కొంతమంది ప్రజల వేలంవెర్రి వలన, మతోన్మాదుల వలన ఇప్పటికే వారసత్వంగా వస్తున్న కొన్ని కట్టడాలను కోల్పోయాము. బాబ్రీమసీదు, బమియాన్ బుద్ధ విగ్రహాలను మనం మర్చిపోకూడదు. కాని అవి పునరావృతం కాకుడదు. తాజ్‌మహల్‌పై ప్రత్యక్షంగా దాడిచేయలేక పోవచ్చు, ఇతర స్మారకాలు ప్రమాదంలో ఉన్నాయి. ప్రభుత్వం యొక్క దృక్పధం మనకి అర్థమవుతూనేఉంది. వారి వందిమాగధులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని స్వైరవిహారం చేస్తున్నా, వారికి రక్షణ కొనసాగుతూనే ఉన్నది. ముఖియా అభిప్రాయం ప్రకారం మీడియా కూడా

(మిగతా 35వ పేజీలో)

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, ‘మార్క్సిస్టు’** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# సమాచార హక్కు చట్టాన్ని దిగజారుస్తున్న ప్రభుత్వం



రచయిత
ప్రముఖ పాత్రికేయులు

**అక్షయ్ దేశ్‌మనె**

కేంద్ర సమాచార సంఘంలో ఉన్న ఖాళీలు, దానికోసం దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం, సమాచార హక్కు చట్టాన్ని బలహీన పరచడానికి చేస్తున్న ప్రయత్నాలు, పారదర్శకతకు సంబంధించిన ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి విషయంలో తాజాగా ఆందోళనను పెంచు తున్నాయి.

దేశ రాజధాని ఢిల్లీ నగర నడిబొడ్డున ఉన్న విజ్ఞాన్‌భవన్‌లో డిసెంబర్ 6వ తేదీన జరిగిన సమావేశం దేశం నలుమూలల నుంచి సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని పోరాటం చేస్తున్న, దానిని ఉపయోగించుకొంటున్న వందలాది మందితో నిండి పోయింది. సమాచార హక్కు చట్టం 12 వ వార్షిక సమావేశానికి హాజరయ్యేందుకు వారంతా అక్కడికి వచ్చారు. చట్టాన్ని పారదర్శకంగా అమలు జరపటంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ సమావేశపు ముఖ్య అతిథి, గౌరవనీయులు ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌ల ఉపన్యాసాలను అక్కడ చేరిన వారంతా అమితాశక్తితో ఆలకించారు. సమాచారహక్కు చట్టం అమలుకు సంబంధించిన భవిష్యత్తు కార్యాచరణ మీద కేంద్రీకరించే విధంగా తీర్మానాలు ప్రవేశపెట్టి సమావేశపు అంగీకారం పొందారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సమాచారహక్కు చట్టాన్ని పారదర్శకంగా మరియు బాధ్యతాయుతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రం భావిస్తున్నట్లు. చెప్పారు.” సమాచారం అసలైనదిగా, ప్రామాణికమైనదిగా ఉంటే, అది సాధికారికంగా ఉండగలదు. అందువల్ల నేను ఇక్కడ ఒక పదబంధాన్ని చెబుతాను, ఆయుధాలు, మందుగుండు కంటే నిర్ధారణతో కూడిన సమాచారం శక్తి వంతమైనది.” అని ఆయన చెప్పారు. ప్రత్యేకించి ఆ సమాచారాన్ని తప్పని సరిగా దరఖాస్తు దారుడి యొక్క మాతృభాషలో లేదా కనీసం వారి యొక్క ప్రాంతీయ భాషలలో ఇవ్వాలని ఆయన సలహా చెప్పారు. దానిని అందరూ ఉత్సాహంగా ఆమోదించారు. కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ప్రసంగం కొంత వివాదాలను రేకెత్తించే విధంగా, వ్యతిరేక ప్రభావాన్ని చూపే విధంగా ఉంది. కేంద్ర సమాచార హక్కు చట్టం విషయంలో అత్యున్నతమైన న్యాయ నిర్ణయాధికార వ్యవస్థ, సమాచార హక్కు దరఖాస్తులు భర్తీ చేయడంలో, పేరుకుపోతున్న దరఖాస్తుల సంఖ్యను తగ్గించే విషయంలో సాధ్యమైన మార్పులను చేయాలని ఆయన ఆయన తన సంక్షిప్త సందేశంలో చెప్పారు. “మొదటిసారిగా” ప్రభుత్వం సమాచార కమీషనర్ల ఖాళీలు మొత్తాన్ని భర్తీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సమాచార హక్కు దరఖాస్తులకు సంబంధించి మంత్రి కొన్ని ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. “దరఖాస్తులు పేరుకు పోవడాన్నితగ్గించడానికి మనం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. అలాగే నాయొక్క వినయ పూర్వకమైన విజ్ఞప్తి ఏమంటే మన సమాచారంలో ఎక్కువ భాగం ఇప్పటికే ప్రభుత్వం దగ్గర ఉన్నది. అటువంటప్పుడు సమాచారహక్కు చట్టాన్ని ఎందుకు నమోదు చేయాలి? మీరు సమాచార చట్టానికి అనుగుణంగా దరఖాస్తులు చేసినా, ఇప్పటికే ఆ సమాచారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. మనం కనీసం కమీషన్ సభ్యుల మీద దయ కలిగి ఉండాలని చెప్పాడు.

ఇక రెండవది ఏమంటే కనీసం మనం ఇప్పటికే జవాబు ఇవ్వబడిన వాటిమీదనైనా సమాచారహక్కు చట్టం ప్రకారం నమోదు చేయడం తగ్గించాలి. అలాగే సంబంధిత విషయానికి సంబంధించి అవగాహన పెంచుకోవాలి. అలా చూసినప్పుడు నాకు గనుక వైద్యం గురించి బాగా తెలిసి ఉండి, నేను వైద్యరంగం నుండి పదవీ విరమణ చేసి ఉన్నట్లైతే అప్పుడు ఆ విషయాలు నీకు తెలుస్తుంది, అప్పుడు నేను ప్రతిమూడు నెలలకొకసారి దానిని నమోదు చేస్తాను. మన పూర్వ సమాచార కమీషనర్లలలో ఒకరైన ఆర్.కె మాథుర్ గారుమన మీద పెద్ద బాధ్యత ఉంది, 36 వేల దరఖాస్తులు పేరుకు పోయి ఉన్నాయి.అని చెప్పడం నాకు గుర్తుంది. మీరు పొరబడుతున్నారు. సరైన సంఖ్య 36,003 అన్నప్పుడు ఆయన చాలా ఆశ్చర్యంగా చూశారు. ఆయన సమాచార కమీషనర్‌గా నియామకం పొందిన రెండు రోజుల వ్యవధిలో ఆయన నియామకం గురించి మూడు సమాచార హక్కు దరఖాస్తులు నమోదయ్యాయి. ఇప్పుడు మనం సమాచారహక్కు కమీషనర్ల గురించి కూడా దరఖాస్తులు నమోదు చేస్తే ఇక సమాచారాన్ని ఎవరు విడుదల చేస్తారు? అందువల్ల ఈ చట్టాన్ని పనికి మాలిన దానిగా చేయడానికి బదులు, కొంత వివేకాన్ని చూపించడానికి ప్రయత్నం చేసినట్లైతే, చట్టం తేబడిన స్ఫూర్తిని గౌరవించినట్లవుతుంది. ఎవరైనా వ్యక్తి సమాచారహక్కు చట్టంక్రింద ఏదైనా విషయం లేదా సమస్య మీద నమోదు చేసినట్లయితే షరతులతో సమాచారం ఇచ్చేటందుకు ఒక యంత్రాంగం ఉండవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా సమాచారహక్కు చట్టం గురించి పూర్తిగా తెలియకుండా కేవలం పత్రికలలో చదివి మాత్రమే ఎవరికి సంబంధించైనా సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు నమోదు చేయవచ్చు. అప్పుడు నేను ఆరోపణ చేసిన వానిని, నిపుణుడైన సమాచారహక్కు కార్యకర్తగా ఆహ్వానిస్తాను. దానికి కాలవ్యవధి ఏది. నేను దీనిని ఏ ఒక్కరికీ కేటాయించడం చేయను”..

ఇది ప్రజాసమాచారహక్కు జాతీయ

> **"ఏది ఏమైనా, ఇప్పటికీ కేంద్ర సమాచార కమీషన్‌లో 3 ఖాళీలు ఉన్నాయి. అందులో మొదటిది 2016 డిసెంబర్‌లో ఏర్పడింది. సాధారణంగా పదవీ విరమణ చేసే ఖాళీలతో సంబంధం లేకుండా ఏర్పడిన ఖాళీలు ఇవి. 11 నెలలకు పైగా గడిచినప్పటికీ ప్రభుత్వం సమాచార కమీషనర్ల నియామకం చేపట్టలేదు."**



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రచార కార్యకర్తల నుంచి తీవ్రమైన విమర్శను రెచ్చగొట్టే విధంగా ఉంది. పారదర్శకత, సమాచార హక్కు చట్టాన్ని, ఉద్యమాన్ని బలహీన పరిచే ప్రయత్నం అని జాతీయ సమాచారహక్కు ప్రచారకమిటీ ప్రకటించింది.

మంత్రిగారి సలహాలతో "తీవ్రంగా విభేదిస్తున్నట్లు" జాతీయ సమాచార హక్కు ప్రచార, పోరాట కమిటీ ఒక ప్రకటనలో చెప్పింది. సమాచార హక్కు అనేది సెక్షన్ 6(2), (సమాచారహక్కు చట్టం 2005 ప్రకారం) ఒక ప్రాథమిక హక్కు. సమాచారం కోరే ఏ వ్యక్తి అయినా, తాను ఆ సమాచారం ఎందుకు కోరుతున్నాడో కారణాలను చూపించవలసిన అవసరం లేదని ప్రత్యేకంగా ప్రకటించింది. సమాచారహక్కు చట్ట దరఖాస్తుల మీద షరతులతో కూడిన ఆంక్షలు ప్రవేశపెట్టే ఏ రకమైన ప్రయత్నమైనా ఆమోదయోగ్యం కాదని చెప్పింది. ప్రభుత్వ సమాచార అధికారులకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు పెట్టిన ఏ దరఖాసునైనా ఏక పక్షంగా, సమాచారం కోరిన వ్యక్తికి సంబంధంలేని అంశాలతో తిరస్కరించే హక్కు లేదు. సమాచార కమీషనర్ల నియామకపద్ధతికి సంబంధించిన సమాచారం కోరిన ప్రజల విషయంలో మంత్రిగారి ప్రకటనలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్, కేరళ రాష్ట్రాలలో సమాచార కమీషనర్ల నియామకాలలో పద్ధతి పాటించలేదని సుప్రీంకోర్టు ఒక వైపు ప్రకటించింది." మరోవైపు "మొదటిసారిగా" సమాచార కమీషనర్ల అన్ని ఖాళీలు భర్తీ చేయబడ్డాయి అని మంత్రిగారు ప్రకటించారు. "మంత్రిగారు కేంద్ర సమాచార కమీషన్‌లో అన్ని ఖాళీలను భర్తీ చేశారు. కేంద్ర సమాచార కమీషన్ కమీషనర్లందరితో పూర్తి స్థాయిలో పని చేసుంది అని తిరిగి ప్రకటించినట్లు జాతీయ సమాచారహక్కు ప్రచార కమిటీ చెప్పింది. ఏది ఏమైనా, ఇప్పటికీ కేంద్ర సమాచార కమీషన్‌లో 3 ఖాళీలు ఉన్నాయి. అందులో మొదటిది 2016 డిసెంబర్‌లో ఏర్పడింది. సాధారణంగా పదవీ విరమణ చేసే ఖాళీలతో సంబంధం లేకుండా ఏర్పడిన ఖాళీలు ఇవి. 11 నెలలకు పైగా గడిచినప్పటికీ ప్రభుత్వం సమాచార కమీషనర్ల నియామకం చేపట్టలేదు. వాస్తవానికి, ఈ సమస్యను ప్రజా ఫిర్యాదుగా మార్పు చేసి ప్రధానమంత్రి గారికి అందచేయడం జరిగింది. ప్రజా ఫిర్యాదుల విభాగంలో నమోదు కాబడింది. ఆ తర్వాత అది పరిష్కరించినట్లు కాకుండా చూపబడింది. ప్రస్తుత ఖాళీలను భర్తీ చేయడం గురించి మంత్రిగారు ఏరకమైన ప్రకటనా చేయక పోవడం బాధాకరం. కనీసం ఎప్పటిలోగా భర్తీ చేస్తారు అనేది కూడా ప్రకటించలేదు. దీనికి సంబంధించి సమాచార కమీషనర్లతో కమిటి 2018 లో ఏర్పడింది. జాతీయ సమాచార ప్రచార కమిటీ సమాచార కమీషనర్ల ఖాళీలను వెంటనే పారదర్శకంగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఉన్నత కార్యాలయాల్లో, అధికారుల్లో, ప్రముఖ వ్యక్తుల అవినీతిని బయటపెట్టడంలో స్వతంత్ర సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుంటున్న కార్యకర్తల పాత్ర గురించి అందరికీ తెలుసు. అయితే మంత్రిగారి ప్రకటనలు అందరినీ నిరాశకు గురిచేశాయి. ఉదాహరణ ఢిల్లీకి చెందిన సుభాష్‌చంద్ర అగర్వాల్ జాతీయ సమస్యల మీద సమాచార హక్కు చట్టం ప్రకారం కేసులను నమోదు చేయడంలో ఒక ప్రముఖ వ్యక్తిగా ఉన్నారు. ఆయన ఇటీవల సుభాష్‌చంద్రబోస్‌కు సంబంధించిన దస్తావేజుల గురించి, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్‌కు సంబంధించిన అంశాలకు సంబంధించి సమాచారహక్కు చట్టంక్రింద దరఖాస్తుచేశారు. మంత్రిగారు విమర్శ చేసిన "వృత్తి పరమైన సమాచార హక్కు చట్టంక్రింద దరఖాస్తు చేశారు. మంత్రిగారు విమర్శ చేసిన వృత్తిపరమైన సమాచారహక్కు కార్యకర్తలు" అగర్వాల్‌లాంటి వారు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆసక్తికర విషయమేమంటే సమాచారహక్కు చట్టాన్ని దుర్వినియోగ పరచడానికి వ్యతిరేకంగా కూడా అగర్వాల్ పోరాడుతున్నారు.

అగర్వాల్ ఫ్రంట్‌లైన్ పత్రికతో మాట్లాడుతూ, "సమాచారహక్కు చట్టాన్ని దుర్వినియోగ పరచడం మీద నా సలహాలు మంత్రిగారు చెప్పేదానికి పూర్తిగా భిన్నమైనవి. అని అన్నారు. సమాచార హక్కు చట్టంక్రింద నమోదు కాబడుతున్న దరఖాస్తులు కేవలం వ్యక్తుల యొక్క స్వీయ ఆసక్తితోనే చేయబడుతున్నాయి. అని ఆయన వాదన... (ఇది ఒక కేసుగా ఉండనట్లైతే) బహుశా ఇంతకు ముందు ప్రభుత్వం కామన్‌వెల్త్ క్రీడలు, 2జి స్పెక్ట్రమ్, బొగ్గుకుంభకోణం లాంటి కుంభకోణాలను వెలికితీయటంలో, వాటిని ప్రచారం చేయడంలో ఆర్‌టిఐని ఒక సాధనంగా వాడుకోలేదు."

**అనువాదం : కె నాగమల్లేశ్వరరావు**

# యల్లాయ పాలెం భూ పోరాటం

(2వ పేజీ తరువాయి)

ఈ జిల్లాలో వెంకటగిరి రాజా వ్యతిరేక పోరాటంతో పాటు అనేక చోట్ల వారికున్న జమీందారీ ఈనాం భూములపై వ్యతిరేక పోరాటాలు జరిగాయి. రాష్ట్రంలోనూ జరిగాయి. ఆ నాటి జమీందారీ భూముల స్థితిగతులను అర్థం చేసుకోవాలనుకుంటే 1937 – 38 నాటి రైతు రక్షణ యాత్ర సందర్భంగా అప్పటి ఆంధ్ర రైతు నాయకులు నండూరి ప్రసాద రావు రాసిన వ్యాసంలోని కొన్ని భాగాలను ఇక్కడ గుర్తు చేయాల్సి ఉంది. "అవి బ్రిటీషు వారు పాలించే రోజులు. అతి క్రూరమైన జమీందారీ విధానాన్నీ, రైత్వారీ పద్ధతి పేరుతో భూస్వామిక విధానాన్ని ప్రవేశపెట్టి రైతాంగాన్ని నిలువు దోపిడీ చేసే రోజుల వి." అని చెప్పారు. ఇంకా రాష్ట్రంలో నూటి కి 40 వంతుల భూ భాగం జమీందారు, మొఖాసాదారు, ఈనాం దార్ల కింద ఉండే ది" అన్నారు. రాష్ట్రంలో జరిగిన జమీందారీ వ్యతిరేక పోరాటాల ఫలితంగా " చివరకు 1947లో స్వాతంత్ర్యం వచ్చాక 1948లో జమీందారీలు శాశ్వతంగా రద్దు చేయ బడ్డాయి"1949 నుంచి ఈ చట్టం అమల్లో కొచ్చింది.

అంటే జమీందారీలు రద్దై రైత్వారీ గ్రామా లేర్పడ్డా భూ కేంద్రీకరణ ఏ స్థాయిలో ఉందో గుర్తించొచ్చు. 1975 భూసంస్క రణలు ఎంత బూటకపు సంస్కరణలుగా అమలయ్యాయో నెల్లూరు జిల్లా గురించి చెప్పిన ఉదాహరణలను బట్టి అర్థం చేసుకో వచ్చు. 1973 నాటికి భూ సంస్కరణల చట్టాలు వచ్చినా నెలూరు జిల్లా కమిటీ ప్రధానంగా బంజరు భూములు పంచా లనే దానిపైనే పోరాడుతూ వచ్చింది. 1974 నుంచే ఈ భూముల సాధన కోసం పోరా టాలు చేస్తూ వస్తుంది. దీంతో పాటు జిల్లా లో ప్రతి ఏటా కూలి పెంపు పోరాటాలూ జరుగు తున్నాయి. కూలి, భూ సమస్యలు జిల్లా వ్యవసా య కార్మికులను ఐక్యంగా కదిలించేవి. నెల్లూరు జిల్లాలో జరిగిన మరో సంఘటన కూడా బంజరు భూముల పైకి దృష్టి మళ్ళడానికి తోడ్పడింది. ఉదయగిరి తాలూకా సోమల రేగడకు చెందిన యాలమూరి పెంచలరెడ్డి 1977 అక్టోబరు 26న తాలూకా ఆఫీసు ముందు నిరాహార దీక్షకు దిగారు. అప్పసముద్రం, కాసరపల్లి, నందవరం, మందాల నాయుడి పల్లె, రెడ్ల దిన్నె గ్రామస్తులూ ఈ దీక్షలో భాగస్వాములు కావడంతో ప్రజలు వంద లూ వేలసంఖ్యలో కదల సాగారు. దీంతో తహశీల్దారు దిగొచ్చి బంజర్లను పంచారు. ఆ కాలంలో ఈ ప్రాంతంలో పొగాకు సాగు పెరగడంతో ప్రభుత్వ బంజర్లపైకి పేదలు పెద్ద ఎత్తున కదల సాగారు. (1978 జనవరి ప్రజాశక్తి వార్త) ఈ స్ఫూర్తితో ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు, కావలి, గూడూరు తాలూకాల్లో 1978లో బంజరు సదస్సులు జరిగాయి. ఈ బంజర్ల లోకి ప్రజలు దిగుతున్న




ఎల్లాయిపాలెంలో గాలంకి తిరుపాలు స్మారక స్థూపం

ప్పుడు రెండు విష యాలు అర్థమయ్యాయి. ఒకటి ఈ భూ ములు కూడా భూస్వాముల ఆక్రమణలో ఉన్నాయి. రెండు ఈ భూములను గుర్తిం చాలంటే సర్వేయర్ల సహకారం అందడం లేదు. ఈ విషయాలు 1978లో జక్కా వెంకయ్య ప్రత్యక్ష నాయకత్వంలో పైనా పురం బంజర్లలోకి దిగినప్పుడు అర్థమైంది. అవి యానాటి వారి ఆక్రమణలో ఉన్న భూములని తేలింది. దీని ఆధారంగా రాష్ట్ర నాయకత్వంతో సంప్రదిం చారు. ఆపై ఆ భూముల గుర్తింపుకు సర్వే ఎలా అన్న సమ స్య ముందు కొచ్చింది. దీంతో 1978లో భూముల గురించి అవగాహన ఉ న్న 50 మంది కార్యకర్తలను పైనాపురం పిలి పించి భూముల సర్వే పద్ధతులను నేర్పించారు. ఈ సర్వేలో శిక్షణ పొందిన వాళ్ళు భూస్వా ముల ఆక్రమణలోని బంజరు భూములనూ, ప్రభుత్వ బంజర్లనూ శాస్త్రీయంగా గుర్తించ సాగారు. నెల్లూరు, కోవూరు, ఆత్మ కూరు, ఉదయగిరి, గూడూరు తాలూకాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ సర్వేలు జరిగాయి. జక్కా వెంకయ్య సారథ్యంలో ఆయా తాలూకాల్లో పాలిచర్ల వెంకయ్య, గండవరపు బాలకృష్ణారెడ్డి, చంద్ర రాజ గోపాల్, చిట్టేటి రమణయ్య, టిపి భాను రాజు, టి.రమణయ్యలు ఈ సదస్సులకూ, సర్వేలకూ సారథ్యం వహించారు. వాటిని పంచాలంటూ ఆర్జీలివ్వసాగారు.

నెల్లూరులో ప్రత్యేకించి జిల్లా కలెక్టరుగా ఉన్న అర్జునరావు ఎమర్జెన్సీలో నిర్వహిం చిన పాత్ర కూడా భూములు దక్కుతాయన్న విశ్వాసాన్ని పేదల్లో పెంచింది. ఆయన సీలింగ్ భూములు, అప్పిలేట్ ట్రిబ్యునల్ వివాదంలో ఉండే భూములు, చెరువు లోతట్టు భూముల వివరాలు బయటికి తీశారు. వాటిని ఆర్‌డివో ఆధ్వర్యంలో పెట్టి జాయింటు ఫార్మింగ్ సొసైటీలను ఏర్పాటు చేశారు. వీటిలో సాగుదార్లకు చేరిన పేదలకు భూములను అప్పగించి సాగులోకి తీసుకొచ్చారు. ఆక్రమణలో ఉన్న బంజర్లను కానీ, సీలింగును మించిన భూములను గానీ ఆధారాలతో సహా చూపిస్తే వాటిని పేదలకు పంచారు. ఆధారాల్లేకుండా ఆర్జీలతో వస్తే మందలించిన సందర్భాలూ ఉన్నాయి. ఇలా ఆయన పంచిన భూములన్నీ ఇంది రమ్మ పంచిన భూములేనని పేదలు భ్రమ పడ్డారు. 1977 ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోయింది. ఇక భూముల సంగతేమిటన్న బెంగ పేదల్లో మిగిలింది. ఈ నేపథ్యంలో మార్క్సిస్టు పార్టీ "ప్రభుత్వం మిగులు భూములు పంచాలని చట్టం చేసింది. మనమూ సర్వే ద్వారా శాస్త్రీయంగా వాటిని గుర్తించి పంచాలంటున్నాం. ప్రభుత్వం చెప్పిందే అమలు చేయాలంటున్నాం" అం టూ సాగించిన పాజిటివ్ ప్రచారం పేద లను ఆకట్టుకుంది. ఇందిరాగాంధీ ఓడిపోయిన నేపథ్యంలో కమ్యూనిస్టులను నమ్ముకుంటే ఇక భూములు దక్కవనే ఆందోళనకు పేదలు గురయ్యారు.

భూ సమస్య తీవ్రతను వివరించేందుకు 1978 జూలై 15న నెల్లూరులో 1000 మందితో సదస్సు జరిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఆరు తాలూకాల్లోని 80 గ్రామా లనుంచి పాల్గొన్నారు. ఈ సదస్సు దిగువ విషయాలను వెలికి తెచ్చింది. నెల్లూరు జిల్లాలో ఒక కుటుంబానికి చెందిన భూస్వాముల ఆధీనంలో ఐదు వేల ఎకరాల బంజరు భూమి ఉంది. దీనిని స్వాధీనం చేసుకుని (చట్టం ప్రకారం 2.5 ఎకరాల మాగాణి, 5ఎకరాల మెట్ట లోపు ఉండే వాళ్ళు బంజర్లను ఆక్ర మించరాదు) పేదలకు పంచాలి. భూ సంస్కరణల చట్టం ప్రకారం మూడు వరుస సంవత్సరాల్లో రెండుకార్లు పండినట్టు నమో దైన చోట 14ఎకరాలూ, అంతకు తక్కువ పంట వచ్చే చోట 22 ఎకరాలూ ఒక కుటుంబానికి ఉండొచ్చు. భూస్వాములు ఆక్రమించిన బంజర్లనూ, సాగుయోగ్యమైన బంజర్లనూ (రెండూ కలిపి



జిల్లాలో లక్షా 66వేల ఎకరాలున్నాయి) సీలింగ్ పరిమితి మించిన భూములనూ భూమిలేని పేదలకు పంచాలి. అర్హులైన బంజరు సాగుదార్లకు పట్టాలివ్వాలి. పేదల సాగులోని భూమికి నీటి వసతి కల్పించాలి. నిజమైన కౌలుదార్లకే దేవాలయ భూములివ్వాలి. ఈ విషయాలను జక్కా వెంకయ్య సదస్సు ముందుంచారు. సదస్సులో వీటిపై చర్చ జరిగింది. డిమాండ్ల రూపకల్పనతో పాటు జక్కా వెంకయ్య, చిట్టేటి రమణయ్య, టిపి భానురాజు ఇతర జిల్లా కమిటీ సభ్యుల నాయకత్వంలో ప్రదర్శన కలెక్టరు ఆఫీసుకు చేరింది. వివిధ గ్రామాలనుంచి తెచ్చిన సర్వే నెంబర్లు, పంచదగిన భూ విస్తీర్ణం గురించి తెలిపే లెక్కల వివరాలతో కూడిన అర్జీలను కలెక్టరు కిచ్చారు. పై భూమి మొత్తాన్ని పంపిణీ చేయాలంటే 80 మంది తహశీల్దార్లు కావాలని అందులో సూచించారు.

ఈ సదస్సు అనంతరం భూ సమస్య గురించి పోరాట కేంద్రాల్లోనూ వాటి చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర స్థాయిలో సిపిఐ(ఎం), సిపిఐలతో పాటు ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలూ ఇందుకు సమాయత్తమయ్యాయి. వాటి ఆధ్వర్యంలో పోరాట కేంద్రాల్లో జనరల్ బాడీలు జరిగాయి. వేలాది కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగానే భూ సమస్యపై ప్రజల్లో ఉన్న సన్నద్ధతను గుర్తించారు. భూ పోరాటానికి సన్నాహకంగా నెల్లూరు జిల్లా కేంద్రంలో బహిరంగ సభ జరపాలని నిర్ణయించారు. భూ సమస్యను ప్రచారం చేస్తూ జిల్లా అంతటా జనవరిలో సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఆ తరువాత జనరల్ బాడీలు జరిపి భూ పోరాట కేంద్రాలను గుర్తించారు. వ్యవసాయ కార్మికులకు అండగా కార్మికులు, విద్యార్థులు, యువకులు ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు. దీని కొనసాగింపుగా నెల్లూరు జిల్లా కేంద్రంలో 1979 ఫిబ్రవరి 25న 10,000 మందితో ప్రదర్శన జరిగింది. కమ్యూనిస్టు ఉద్యమ చీలికల అనంతరం బహుశా ఇంత భారీ సంఖ్యలో ప్రదర్శన జరగడం ఇదే ప్రథమం. అనం తరం కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆవరణలో బహిరంగ సభ జరిగింది. సభా స్థలికి ప్రదర్శకులను మించిన సంఖ్య చేరిం ది.

ప్రజల్లో కనిపించిన ఈ స్పందనను సిపిఎం నాయకులు శ్రీహరి గుర్తించారు. వేదిక వద్దనే ఉభయ పార్టీల జిల్లా కమిటీలను సమావేశ పర్చారు. ఈ పోరాటాన్ని ఆశీర్వదిస్తూ ప్రతి ఒక్కరూ ఎంతో కొంత విరాళాన్ని 'కానుక'గా ఇవ్వా లని పిలుపిద్దాం' అని ప్రతిపాదించారు. అందరూ సమ్మతించారు. బహిరంగ సభ కాగానే ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పళ్ళేలతో వస్తారనీ, వారొచ్చే వరకూ వేచి కానుకలిచ్చి వెళ్ళాలనీ, అవే ఈ పోరాట విజయానికీ ఆశీర్వాదాలవుతాయనీ ప్రకటించారు. నాయకత్వం ఊహించినట్టే సభికుల నుంచి అనూహ్య స్పందన వ్యక్తమైంది. తమ వంతు కానుకనిచ్చే వరకూ ఏ ఒక్కరూ కదల్లేదు. 20 నుంచి 30 నిమిషాలు వేచి, తోచినంత కానుకలేసి వెళ్ళారు. తన వద్ద డబ్బుల్లేకుంటే పక్కవారిని అప్పు అడిగి తీసుకుని కానుకలిచ్చారు. ఈ సభనాడే ఈ పోరాటం విజయం సాధించి తీరాలనే స్ఫూర్తి ప్రజల్లో ఏ స్థాయిలో ఉందో సుస్పష్టమైంది. ఈ సభలోవ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌బి గంగాధరరావు, వ్యవసాయ కార్మిక సంఘం (హైదరాబాద్) కార్యదర్శి వంకా సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సభలో ప్రసంగిం చిన రాష్ట్ర నాయకులతో సహా జిల్లా ముఖ్య నాయకులు ఆరుగురిపై అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. నలుగురు జిల్లా ముఖ్యు ల్ని అరెస్టు చేశారు. నిర్దిష్టమైన రుజువుకు నిలిచే ఆరోపణలు లేనందున కోర్టు వారం దరినీ విడుదల చేసింది.

### ఆక్రమిత, మిగులు భూముల్లో ఎర్రజెండా రెపరెపలు

1979 ఫిబ్రవరి 27న పదెకరాల పైబడిన మిగులు భూములు గుర్తించే పోరాటం మొదలైంది. ప్రజలు ఎర్ర జెండాలు చేబూనారు. తండోప తండాలుగా సర్వే ద్వారా గుర్తించిన భూముల్లోకి దిగారు. వాటిలో ఎర్రజెండాలు పాతారు. కోవూరు, నెల్లూరు తాలూకాల్లో పెద్ద సంఖ్యలో పేదలు కదం తొక్కారు. గూడూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి డివిజన్‌లలోనూ ఎంపిక చేసిన కేంద్రాల్లో భూమిల్లోకి దిగారు. మొత్తం 50 గ్రామాల్లో 10,978 మంది 4,914 ఎకరాల్లో గుర్తులు పెట్టారు. ఒకే రోజు... అదీ జిల్లా అంతటా... గ్రామ గ్రామానా పేదలు కదం తొక్కుతున్న తీరు.... భూస్వాముల ఆక్రమిత భూముల్లో ఎర్రజెండాలు పాతి గుర్తించడంలోని జోరు... ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లాంటి పత్రికలకు సైతం మరో స్వాతంత్ర్య పోరాటంలా కనపడింది. అనేక మంది మేధావులూ, ప్రజాతంత్రవాదులూ, జనం గెలవాలని కోరుకునేవారూ దీన్నో మహోజ్వల పోరాటంగా కీర్తించారు. ఇంతటి భారీ జన స్పందన భూస్వామ్య అనుకూల శక్తులకు కంటగింపుగా మారిం ది. కమ్యూనిస్టులు రేగ్గొట్టిన అరాచకం గానూ, ప్రశాంతతను భంగపర్చే పోరాటం గానూ, ఎన్నికల్లో ఓట్ల కోసం సాగించే ఎత్తుగడగానూ కనపడింది. ఏదైతేనేం... చెలరేగిన జన సమూహాల భూకాంక్ష కళ్ళ కు కట్టినట్టు బట్టబయలైంది. భూస్వాముల గుండెల్లో దడ పుట్టించింది. ఆ రాత్రికి రాత్రే వారు కూడబలుక్కున్నారు. దీన్ని ఆదిలోనే తుంచకుంటే... ఆ తరువాత ఏమౌతుందన్నది ఊహించడానికి కూడా సిద్ధపడలేదు. అందరూ ఒక్కటయ్యారు.

జిల్లా నుంచి రెవెన్యూ శాఖా మంత్రిగా ఉన్న నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని కలిశారు. పోలీసులను దించి ప్రజల కదనోత్సా హాన్ని ఉక్కు పాదాలతో తొక్కి పారెయ్యాలని కోరారు. దీంతో ఎలాం టి ప్రకటనలూ, హెచ్చరికలూ లేకుండానే (నెల్లూరు, కోవూరు తాలూకాల్లో) 144వ సెక్షన్ విధించారు. బహిరంగంగా పత్రికల్లో ప్రకటనలు చేయక పోవడంతో 144వ సెక్షన్ విధింపు విషయం రహస్యంగా ఉండిపోయింది. సమన్వయ పరుస్తున్న పార్టీ నాయకత్వానికి తెలీలేదు. అందువల్ల అవసరమైన జాగ్రత్తలు దిగువ స్థాయిలో తీసుకోలేదు. దీన్ని ఆధారం చేసుకుని పోలీసులూ, భూస్వాములూ కలిసి గ్రామాల్లో భీతావహం సృష్టించారు. ప్రభుత్వంతో ఎలా సంప్ర దింపులు జరిగాయో తెలీదుగానీ మార్చి ఒకటో తేదీకి ఉద్యమ కేంద్రాలన్నింటిలోనూ పోలీసు క్యాంపులనేర్పాటు చేశారు. పేదలు భారీ

సంఖ్యలో కదులుతున్న కేంద్రాల్లో100 నుంచి 150 మందితో క్యాంపులు పెట్టా రు. నామ మాత్రంగా కదిలిన కేంద్రాల్లోనూ 10నుంచి 15మంది పోలీసులను దించారు.

**ఎల్లాయపాలెంలో తిరుపాలు అమరత్వం**

భారీ సంఖ్యలో పోలీసులను దించిన గ్రామాల్లో ఎల్లాయపాలెం ఒకటి. ఇది నేదురు మల్లి జనార్థన్ రెడ్డి అత్తగారి గ్రామం. ఈ గ్రామంలో మిగతా కేంద్రాల కన్నా 3 రోజుల ముందే... అంటే ఫిబ్రవరి 24న సీలింగ్‌కు మించిన భూములు పంచాలంటూ పేదలు భూముల్లోకి దిగారు. పంచాల్సిన భూములను ఎర్రజెండాలతో గుర్తించారు. జిల్లా అంతటా జరిగిన ముందస్తు అరెస్టుల్లో భాగంగా ఈ గ్రామ మార్క్సిస్టు పార్టీ నాయకులు గండవరపు బాలక్రిష్ణారెడ్డిని అరెస్టు చేశారు. మరో నాయకుడు జెడ్డా మస్తానయ్య బయటే ఉన్నారు. ఈ అరెస్టులను నిరసిస్తూ, తొక్కిపెట్టిన భూములను పంచాలని డిమాండ్ చేస్తూ ఈ గ్రామంలో 2000 మందికి పైగా ప్రదర్శన చేశారు. ఆ రోజు ఏ వీధిలో చూసినా ఎర్ర జెండాలు చేబూనిన పేదలే కనిపించారు. దీని తరువాత ఇక్కడా 150 మందితో పోలీసు క్యాంపు ఏర్పాటు చేశారు. దీంతో నాలుగు రోజులు భూస్వాములు ఏ ప్రతిఘటనకూ దిగలేదు. జనం ఆదమరిచి ఉంటారని భావించాక...

అది మార్చి 2వ తేదీ. చీకట్లను చీల్చుకుంటూ సూర్యుడప్పుడప్పుడే పైకెగబాకు తున్నాడు. భూస్వాముల ట్రాక్టర్లు ఒక్కటొక్కటిగా భూముల దిశగా కదిలాయి. ఒకటీ రెండు అప్పటికే భూముల్లోకి దిగాయి. కమ్యూనిస్టులు పెట్టిన గట్లను చెరిపేయసాగాయి. ఈ భూములకు సమీపంలోని కొత్త హరిజనవాడలో ఉంటున్న గాలంకి తిరుపాలు (సుమారు 18 సంవత్స రాలు) మేల్కొలుపు పలుకుతున్న పొద్దు పొడుపులాగే నాయకులకు సమాచారమందిం చేందుకు ఉద్యమ కేంద్రంగా ఉన్న పాత హరిజన వాడవైపుకు పరుగు తీశాడు. పార్టీ నాయకులు జెడ్డా మస్తానయ్యను కలిసి సమాచారం అందించాడు. అందుబాటులో ఉన్న పార్టీ సభ్యులు సంప్రదించుకున్నారు. గట్లు చెరపడాన్ని అడ్డుకోవాలని నిర్ణయించారు. పోలీసులు వచ్చినా గుర్తించిన గట్లను వదలకూడదని తీర్మానించారు. భూపోరాటంలో కలిసొచ్చిన దళిత, గిరిజన, ముస్లిం, యాదవ, దేవాంగుల కుమ్మరి, చాకలి, గౌడ వాడలకు సమాచారం పంపించారు. సమాచారం అందుకున్నవారు తెలిసిందే తడవుగా భూములవైపుకు పరుగు తీశారు. బారెడు పొద్దెక్కేలోపే సుమారు 500 మంది భూముల్లోకి చేరి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్లలో వచ్చిన భూస్వామ్య గుండాలు రాళ్ళతో దాడికి దిగారు. వాటిని తప్పించుకుంటూ వాళ్ళు విసిరిన రాళ్ళతోనే పేదలు ట్రాక్టర్లను నిలువరిస్తున్నారు. ముందుగానే సిద్ధంగా ఉన్న పోలీసులూ పొలాల్లోకి రాసాగారు. ప్రతి 15 నిమిషాలకూ 100 నుంచి 150 మంది పేదలు పెరుగుతూనే ఉన్నారు. పోలీసులు రాగానే ఆందోళనాకారులు గతానుభవాలతో పోరాట రూపాన్ని మార్చుకున్నారు. ముందు వరుసలో మహిళలు నిలబడ్డారు. పురుషులు వారి వెనుక నిలిచారు. మగ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా మహిళలపై విరుచుకు పడ్డారు. ఏ మాత్రమూ వెనకడుగు వేయకుండా మహిళలూ పోలీసుల నెదిరించి నిలిచారు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయడానికి ఓ వృద్ధ ముస్లిమ్ మహిళపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఆవిడ స్పృహ తప్పి కింద పడిపోయింది. ఒంటిపై బట్టలు తొలిగి పోయాయి. అయినా వదలకుండా లాఠీఛార్జీ చేస్తున్న తీరుకు సాటి మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఓ వైపు పోలీసులను ప్రతిఘటిస్తూ మరోవైపు ఆ వృద్ధురాలిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. అయినా పోలీసుల పైశాచికం ఆగలేదు. దీన్ని సమీపం నుంచి గమనించిన జమ్ము వెంకయ్య ఒక్క ఉదుటున సిఐ పైకి దూకాడు. గట్టిగా సిఐ అస్తులు పట్టుకున్నాడు. సిఐ విలవిల్లాడాడు. వృద్ధ మహిళను ఒదిలేంత వరకూ తానూ ఒదలనన్నాడు. దీంతో 10 నుంచి 15 మంది పోలీసులు వెంకయ్యను చుట్టుముట్టారు. చావచితగ్గొట్టారు. ఈ లోపల పోలీసులు వృద్ధ మహిళలను విడిచిపెట్టారు. వెంకయ్య కూడా వదిలేశారు. దాంతో ఊపిరి పీల్చుకున్న సిఐ గాలిలోకి కాల్పులు జరిపారు. అప్పటికే వెయ్యి, 1500కు పేదల సంఖ్య పెరిగింది. ఒక పక్క లాఠీఛార్జీ చేస్తూనే రెండో సారి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల శబ్దాలు విని అప్పటి వరకూ సమాచారం తెలీని పేదలు కూడా కారాలతో వచ్చి పోలీసు దాడిని అడ్డుకున్నారు. మూడోసారి ఉన్నట్టుండి జనం మీదకే కాల్పులు జరిపారు. పోలీసు దురాగతాల నెదిరించడంలో ముందున్న గాలంకి తిరుపాలు పొత్తి కడుపుగుండా ఒక బుల్లెట్ దూసుకెళ్ళింది. అది వీపు వెనుక నుంచి బయటికొచ్చింది. మహిళలు ముందున్నప్పుడు ప్రత్యక్షంగా ప్రతిఘటించారు. పురుషులు ముందుకురికాక రాళ్ళం దించారు. ఇందులో సమరశీలంగా వ్యవహరిస్తున్న రమణమ్మను టార్గెట్ చేసి పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆమె చేతికి తూటా తగిలింది. చెయ్యి ఎముక విరిగి చర్మం ఆధారంగా వేలాడసాగింది. కాల్పులు జరిగాయని తెలిసి పోలీసు నిర్బంధంలో ఉన్న జక్కా వెంకయ్య తప్పించుకొని ఎల్లాయపాలెం చేరారు. గండవరపు బాల క్రిష్ణారెడ్డి అలాగే తప్పించుకుని స్పాట్‌కు చేరారు.

జక్కా సూచనపై అప్పట్లో ఈ ఊరికేసిన బుడ్డ బస్సులో తిరుపాలును, రమణమ్మను నెల్లూరులోని డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలకు తరలిం చారు. తిరుపాలు అప్పటికే మరణించినట్లు డాక్ట ర్లు ప్రకటించారు. రమణమ్మకు చెయ్యి తొలగిం చారు. ఈ పోరాటంలో అల్లాడి ఆదెమ్మ, పుచ్చల పల్లి నర్సమ్మ, అల్లంపాటి నర్సమ్మ, వడ్ల పూడి రావమ్మ, షేక్ దాదాసాహెబ్, ఇమాం సాహెబ్, మీరా సాహిబ్, ఖాసిం, సైదు ఛత్తీబి, కాకి పిచ్చయ్య, కాకి వీరాస్వామి, పెద సింగయ్య ఆయా వాడల ప్రజలను కదిలించడంలోనూ, పోరాటాన్ని సాగించడంలోనూ వ్యూహాత్మక నాయకత్వం అందించారు. ఈ పోరాటంలో దాదాపు 30 మంది గాయపడ్డారు. చనిపోయిన తిరుపాలుతో సహా 45 మందిపై కేసులు పెట్టారు. ✽

# చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు

(31వ పేజీ తరువాయి)

ఈ పరిస్థితులకు తోడ్పడుతున్నది. హిందు మతోన్మాద శక్తులకు లౌకిక మీడియా వారి నుంచి పూర్తి సహాయ, సహకారాలు అందు తున్నాయి. మిడిమిడి జ్ఞానులు, అర్థ చదువులు చదివిన శక్తులు ఏదయినా ఒక ప్రకటన చేయగానే వెంటనే మీడియా ఇతర అంశాలను పక్కనపెట్టి,వారిప్రకటనలపై చర్చలేవనెత్తుతోంది. ఇదే మితవాద శక్తులకు కావాల్సింది. వారి ప్రకటనలు నిరంతరం చర్చలలో నలుగుతూ ఉండాలి. వాటిలో వాస్తవం ఉన్నాలేకపోయినా, అవతలి వారు ఏమి చెప్పినా వారి కవసరం లేదు. ఒక రకంగా ఇలా చేయడం ద్వారా వారు ఒక విషయంలో విజయం సాధిస్తున్నారు. ఫలానా అంశంపై ఈ విధమైన అభిప్రాయం కూడా సమాజంలో ఉంది అనే భావాన్ని ప్రజల మనస్సులలో పెంపొందిస్తున్నారు. ఇటువంటి అభిప్రాయాలపై ఇర్ఫాన్ హబీబ్ లేదా రొమిల్లా థాపర్‌ల అభిప్రాయాన్ని అడిగితే అవతల వారికి కూడా నువ్వు ప్రాధాన్యత, గౌరవం ఇచ్చినట్టేకదా. ఒక వైపు సంగీత్ సోమ్ అభిప్రాయం, ఇంకొకవైపు ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయం. వా...! ఇదేవారు పన్నుతున్నవల. ఆ వలలో మనం అందరం తల దూరుస్తున్నాము. **అనువాదం : లక్కరాజు శ్రీనివాస భారవి**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-03-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# పేదలను హత్యచేస్తున్న దోపిడీ సమాజం

**- ఫ్రెడరిక్ ఏంగెల్స్**



"ఒక వ్యక్తి మరో వ్యక్తిని గాయపరిస్తే, ఆ గాయం వల్ల అతను మరణిస్తే, అలా గాయపర్చడాన్ని 'మనిషిని చంపడం' అంటాం. ఆ గాయం ప్రాణాలను హరించి వేస్తుందని దాడి చేసిన వానికి ముందే తెలిస్తే, ఆ పనిని 'హత్య' అంటాం. కానీ సమాజం, వేలాదిమంది కార్మికులను తప్పనిసరిగా అతి తొందరగా, అసహజ మరణానికి గురయ్యే స్థితిలో ఉంచితే, ఆ కార్మికులు కత్తితోనో తుపాకీ గుండుతోనో హింసాత్మకంగా మరణించినట్లే ఆ వ్యక్తులు మరణిస్తే, సమాజం లక్షలాది ప్రజలకు జీవితావసరాలు లేకుండా చేస్తే, వారికి జీవించలేని పరిస్థితులు కల్పిస్తే, ఆ లక్షలాది బలి పశువులు నశించిపోతారని తెలిసీ పరిస్థితులనలాగే కొనసాగనిస్తే, సమాజపు ఇటువంటి చర్య ఖచ్చితంగా ఒక వ్యక్తి చేసిన హత్య లాంటిదే! ఇది, ఎవరూ తమని తాము రక్షించుకోలేని హత్యకాండ. అయితే ఇది పైకి హత్యాకాండలా కన్పించదు. ఇక్కడ హంతకుడు ఎవరికీ కనిపించడు. బలి పశువు చావు సహజ మరణంగా కనిపిస్తుంది.

"కానీ, అది హత్యే! కార్మిక పత్రికలు సరిగ్గా చెప్పినట్టు ఇంగ్లండు సమాజం ప్రతి రోజూ, ప్రతి గంటా సామాజిక హత్యకు పూనుకుంటోందని నేనిప్పుడు నిరూపించాల్సి ఉంది. కార్మికులు తమ ఆరోగ్యాన్ని నిలుపుకోడానికీ, ఎక్కువ కాలం జీవించడానికీ వీలులేని పరిస్థితుల్లో వారిని ఈ సమాజం ఉంచుతోంది. వారి జీవశక్తిని కొంచెం కొంచెంగా తొలిచివేసి చిన్న వయసులోనే వారిని వేగంగా కాటికి పరుగులు పెట్టిస్తోంది. అటువంటి పరిస్థితులు కార్మికుల ఆరోగ్యానికీ, వారి జీవితానికీ, ఎంతటి హానికరమో, సమాజానికి బాగా తెలిసినప్పటికీ, ఆ పరిస్థితులను మెరుగు పర్చడానికి అది ఏమీ చేయడం లేదని కూడా నేను నిరూపించాల్సివుంది. నేను అధికార పత్రాలనే, పార్లమెంటు ప్రభుత్వ నివేదికలనే నా ఆరోపణలకు సాక్ష్యాలుగా చూపించి సమాజం చేసే హత్యలేనని రుజువు చేస్తాను.

"జీవితావసరాలు ఏ మాత్రమూ తీరని వర్గం ఆరోగ్యంగా ఉండరనేదీ, ముసలితనం వరకూ బ్రతకరనేదీ స్వయం విదితమె కార్మికుల ఆరోగ్యంపై దృష్టి నిలిపి మరోమారు పరిస్థితులను సమీక్షిద్దాం.పెద్ద పట్టణాల్లో జనాభా కేంద్రీకరణ చాలా వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తుంది. లండనులో వాతావరణం, గ్రామీణ వాతావరణమంతా శుద్ధంగా, ప్రాణవాయువు సమృద్ధంగా అందే విధంగా ఉండదు. 25 లక్షల జతల ఊపిరితిత్తులు, 2 లక్షల ఏభై వేల పొయ్యిలు, 3,4 మైళ్ళ చదరపు విస్తీర్ణంలో కిక్కిరిసి ఉంటే, అత్యధిక మొత్తం ప్రాణ వాయువు ఖర్చయిపోతుంది. తిరిగి భర్తీ అవడం కష్ట సాధ్యమవుతుంది. భర్తీ ఎందుకు కష్టమంటే, నగర నిర్మాణపద్ధతి, గాలి ప్రసారాన్ని అడ్డుకునేదిగా వుండడంవల్ల. శ్వాస క్రియవల్లా, మంట వల్లా ఉత్పత్తి అయిన బొగ్గు పులుసు వాయువు, దాని విశిష్ట గురుత్వం వల్ల, వీధుల్లోనే మిగిలి ఉండగా, ప్రధాన వాయు ప్రవాహం ఇంటి కప్పులపై నుండే వెళ్ళిపోతుంది. అక్కడ నివసించే వారి ఊపిరితిత్తులకు సరిపడినంత ప్రాణ వాయువు అందదు. దానివల్ల, మానసిక-శారీరక బడలిక, జీవశక్తి క్షీణించడమూ జరుగుతాయి. ఈ కారణంచేత, నగరవాసులు, ప్రమాదకరమైన నొప్పులూ, వాపులూ కలిగించే వ్యాధులకు, స్వచ్ఛమైన ఆరు బయలు వాతావరణంలో నివసించే గ్రామీణ వాసులకంటే ఎక్కువగా గురవుతారు. పట్టణ వాసులు, మొండివ్యాధులతో ఎక్కువ బాధపడతారు. అసలు నగర జీవితమే ఆరోగ్యానికి హానికరమైనపుడు గాలిని విషపూరితం చేసే నగర శ్రామిక వాడల్లో వాతావరణం, మరింత ప్రమాదకరమై ఉంటుంది. గ్రామంలో బహుశా ఇంటి పక్కనే పేడ కుప్ప ఉన్నప్పటికీ అది అంత హానికరం కాకపోవచ్చు. అక్కడ అన్నివైపుల నుంచీ గాలి స్వేచ్ఛగా వీస్తుంది. కానీ పెద్ద పట్టణం మధ్యలో ఇరుకు సందులూ, ప్రాంగణాలూ, గాలి ఆడకుండా అడ్డుకుంటున్నపుడు పరిస్థితి వేరుగా ఉంటుంది. మాంసం, కూరగాయల వ్యర్థాలు, కుళ్ళుతున్నప్పుడు వెలుపడే వాయువులు, నిశ్చయంగా ఆరోగ్యానికి హానికరమే! ఆ వాయువులుపోయే మార్గం లేనప్పుడు, అవి తప్పనిసరిగా వాతావరణాన్ని విషపూరితం చేస్తాయి. మహానగరాల్లో శ్రామికవాడల్లోని చెత్తా, మురికిగుంటలూ, రోగకారక వాయువులనే విడుదల చేస్తాయి. అలాగే కలుషిత ప్రవాహాలు కూడా! అందుచేత అవి ప్రజారోగ్యంపై దారుణమైన ప్రభావాన్ని చూపుతాయి. ఇంతటితో అయిపోలేదు. అసంఖ్యాక పేదల పట్ల నేడు సమాజం ప్రవర్తిస్తున్న తీరు జుగుప్సాకరం.వారిని గ్రామాల నుంచి, నాసిరకం గాలి మాత్రమే అందే పట్టణాలకు లాక్కొచ్చారు. వారికి పారిశుద్ధ్య సాధనాలు,అవకాశాలు ఏ మాత్రం కల్పించరు. చివరకు నీళ్ళు కూడా ఉండవు. ఎందుకంటే, వాటికి ధర చెల్లిస్తేనే నీటి గొట్టాలు ఏర్పాటు చేస్తారు. నదులు ఎంతగా కలుషితమయ్యాయంటే, వాటిలో నీరు, వాడకానికి పనికిరాదు. మాంస వ్యర్థాలు, చెత్త, మురికి నీరు, మల మూత్రాలు... అన్నీ వీధుల్లోకే! మరో దారి లేదు. ఇది మాత్రమే కాదు. ఊహాకందే చెడుగులన్నీ పేదల నెత్తిమీదే పోగుబడతాయి. వీధుల్లో కలుషితమైన గాలి చాలదన్నట్టు, డజన్ల కొద్దీ మనుషులు ఒకే గదిలో ఇరుకుతారు. అందువల్ల రాత్రి పూట వారు పీల్చే గాలి చాలు వారు ఊపిరాడకుండా చావడానికి. ఇటువంటి దారుణ పరాస్థితుల్లో,కింది వర్గాల ప్రజలు ఆరోగ్యంగా, ఎక్కువ కాలం ఎలా జీవించగలరు? అధిక మరణాలు,విరామం లేని అంటు వ్యాధుల పరంపర, శ్రామిక ప్రజల దేహాలు క్రమంగా కృశించడం-ఇంతకు మించి ఇంకేమి ఆశించగలం?"

*(ఏంగెల్స్ రచించిన 'ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు' గ్రంథం నుండి ఈ భాగం గ్రహించబడింది)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.11. Published on March 1, 2018